Digitized in 2006
by
Thrinaina Informatics Ltd, Secunderabad, A.P., India.
(http://www.thrinaina.com)

From the original owned by
Sundarayya Vignana Kendram
and its partner Institutions

as part of the
British Library Endangered Archives Programme
supported by the
Lisbet Rausing Charitable Fund

Except for individual research purpose
any reproduction should be made with
written permission from the

Sundarayya Vignana Kendram,
1-8-1/B/25/A, Bagh Lingampally, Hyderabad - 500 044
Andhra Pradesh, India

COPYRIGHT STATEMENT

The copyright laws of the United States (Title 17, United States Code) and of India (Copyright Act of 1957) govern the making of photocopies or other reproductions of copyrighted material including foreign works under certain conditions. In addition, the United States extends protection to foreign works by means of various international conventions, bilateral agreements, and proclamations.

Under certain conditions specified in the laws, libraries and archives are authorized to furnish a photocopy or other reproduction. One of these specified conditions is that photocopy or reproduction is not to be used for any purpose other than private study, scholarship, or research. If a user makes a request for, or later uses, a photocopy or reproduction for purposes in excess of "fair use," that user may be liable for copyright infringement.

These institutions reserve the right to refuse to accept a copy order if, in their judgment, fulfillment of the order would involve violation of the copyright laws of the United States or India.

కొండలరావు, కాకర్ల

తపతీసంవరణము

బెజవాడ, 1923

Record no. 401

Koṇḍalarāvu, Kākarla

Tapatīsaṃvaraṇamu

Bejavāḍa, 1923

Record no. 401

SUNDARAYYA VIGNANA KENDRAM
1-8-1/B/25/A, Bagh Lingampalli
Hyderabad – 500 044, Andhra Pradesh, India

Bibliographic Record Target

కొండలరావు, కాకర్ల.

తపతీసంవరణము : ఆఱంకముల నాటకము / ఇది కాకర్ల కొండలరావుచే ఆంధ్రీకరింపబడినది.- 2. కూర్పు.- బెజవాడ : వాణీ ముద్రాక్షరశాల, 1923.

3, 2, 86 p. ;18 cm.

Record no. 401

Koṇḍalarāvu, Kākarla.

Tapatīsaṃvaraṇamu : āṟaṅkamula nāṭakamu / idi Kākarla Koṇḍalarāvucē Āṃdhrīkarimpabaḍinadi.- 2. kūrpu.- Bejavāḍa : Vāṇī Mudrākṣaraśāla, 1923.

3, 2, 86 p. ;18 cm.

Record no. 401

35 mm microfilm

Image placement: IA (IIA) IB IIB

Date filming began:

సారస్వత నికేతనం, వేటపాలెం.

పుస్తకము పేరు : తపతీసంవరణము

గ్రంథకర్త పేరు :

అనువాదకుడు : శా. కొండలరావు

గ్రంథ సంఖ్య : 37[illegible] వర్గ సంఖ్య ; [illegible]11

సారస్వత నికేతనము, వేటపాలెం.

894.8123

గ్రంథసంఖ్య. 372

ఈ గ్రంథమును యిందు క్రింద కడపటిదిగా వుండు తేదిలోపల వాపసు చేయవలెను.

TAPATI SAMVARANAM

A DRAMA IN SIX ACTS

తపతీ సంవరణము

TRANSLATED FROM SANSKRIT

BY

KAKARLA KONDALA RAO

...ని కేతనము, వేటపాలెము.
...నంబరు
...నంబరు
...బడును.
...డదు.
894.8123
కొండల రావు

... Co.

...ADA.

...Bezwada.

1923

All rights reserved.] [Re. 1-0-0.

మీకు యేరకము పుస్తకములు కావలసినను యీక్రింది అడ్రసుకు వ్రాయుడు.

నాటకములు.

చింతామణి. కాళ్లకూరి నారాయణరావుగారిది		రు 1—2—0
పద్మవ్యూహము	డిటో	1—0—0
చిత్రాభ్యుదయము		1—0—0
ప్రతాపరుద్రీయ నాటకం. వేదం వెంకటరాయశాస్త్రిగారిది		1—6—0
సత్యహరిశ్చంద్ర నాటకం. బ॥ లక్ష్మీకాంతంగారిది		1—4—0
సత్రాజితీయం	డిటో	1—0—0
బుద్ధిమతీ విలాసము	డిటో	1—0—0
గయోపాఖ్యానం. చి॥ లక్ష్మీనరసింహంగారిది		0—8—0
ప్రసన్నయాదవం	డిటో	0—8—0
పారిజాతాపహరణం		0—8—0
పార్వతీపరిణయం		0—6—0
చతురచంద్రహాస నాటకం		0—8—0
రుక్మాంగద నాటకం. వేతపూడివారి.		1—2—0
వేణీసంహారం		1—2—0
సైంధవవధ-అద్భుత వీరరస నాటకం		1—0—0

యివిగాక అనేక ప్రబంధములు, వైద్యగ్రంథములు, పురాణములు, స్కూలు పుస్తకములు గలవు. కేటలాగు కోరినవారికి వుచితముగా పంపబడును.

వలయువారు:—

మారుతీరాం అండు కో.,

బుక్కుసెల్లర్సు,

బెజవాడ.

తపతీసంవరణము

ఆఱంకముల నాటకము

ఇది

కాకర్ల కొండలరావుచే

ఆంధ్రీకరింపబడినది.

పబ్లిషర్సు:

మారుతీరాం అండ్ కో.,

బుక్కుసెల్లర్సు,

బెజవాడ, కృష్ణాజిల్లా.

రెండవకూర్పు: 1000 ప్రతులు.

బెజవాడ వాణీ ముద్రాక్షరశాలయందు

డి. కే. పంత్ చే

ముద్రింపబడినది.

1923.

Acc. No.

All rights reserved] [*Price Re. 1-0-0.*

గీ. ధర భరద్వాజ మౌని గోత్ర ప్రభువుఁడు
ప్రియ గుణుఁ డగు కే. యర్. కేసరికి నొసంగు
నాయురారోగ్య విభవంబు లలఘుగతిని
ఆశ్రితావనమూర్తి నారాయణుండు.

ఇందు వచ్చు పాత్రలు

సంవరణుఁడు - కథానాయకుఁడు.
విదూషకుడు - రాజు వేడుక చెలికాఁడు.
వసుమిత్రుఁడు - మంత్రి.
వసిష్ఠుఁడు - పురోహితుఁడు.
కురుఁడు - రాజకుమారుఁడు.
కంచుకి - అంతఃపుర పరిచారకుఁడు.
తాపసుడు - భృగుమహర్షి శిష్యుఁడు.

స్త్రీలు

తపతి - కథానాయిక
రంభా, మేనకలు } చెలులు
ఇద్దఱు చేటులు.

కథాసారము

—* ప్రథమాంకము *—

హస్తిపురాధీశ్వరుఁడగు సంవరణ చక్రవర్తి యీ కథకు నాయకుఁడు. ఆతఁడు దనతొలి భార్యయగు సాల్వరాజ పుత్రియందు సంతానము గానక, యామెనొక వ్రతనియమమున నుద్యానమున నుంచును. అంతఁ గలలో నాతని కొక రేయి, సూర్యుఁడగపడి, యెన్ని వ్రతములు గావించినను సాల్వరాజు పుత్రియందు సంతానప్రాప్తి లేదని యానతిచ్చెను. ఆ యుదయముననే దేవిని వ్రతము మాన్పించి, విదూషకునితోఁ గూడి తానుద్యానమున విహరింపఁబోవును వారికచ్చట నొక మరకత శిలాతలముపైఁ గొన్ని యడుగుజాడ లగపడుటయు, పిదపఁ బైనుండి యొక కర్ణపూరము రాలుటయు, గని, యచ్చటికి దేవ కామిను లెవ్వరో వచ్చియుండుదని కొన్ని గురుతులచే రాజు కనిపెట్టి మన్మథ పరితాపమున కగ్గమగును.

—* ద్వితీయాంకము. *—

రంభామేనకలు, సూర్యపుత్రియుఁ దమకు యజమానురాలునగు తపతి యను కన్నెం గూర్చి ముచ్చటించుకొనుచుఁ, దపతి నారదునిచే సంవరణుని రూప శౌర్యగుణములను విని యాతనిపై బద్ధానురాగయయ్యు, యాతనిఁ జూడఁ గోరి మేనకతోఁ గలిసి, సంవరణుని యుద్యానమునకు వచ్చుటయు, అపుడు మేనక తపతి కర్ణపూరమున మన్మథగాథాతురములు కొన్ని లిఖించి యాతని ముందు వైచుటయు, మున్నగు కథాభాగమును వెల్లడింతురు.

పిదప రాజు వేటకై హిమవత్పర్వత కాననమ్ముల కేగును. తపతియు నచ్చట నొక శిలామండపమున సంవరణునిఁ గూర్చి పరితపించుచుండును. రాజు ప్రక్కనుండి విని సంతసిల్లును.

సూర్యాస్తమయమగుటచే నందరు నిష్క్రమింతురు.

—* తృతీయాంకము. *—

రాజేంద్రుఁడా మండపముననే తపతికై పరితపించుచు విదూషకునిచే శిశిరోపచారములందుచు పరితాపభరంబునఁ దుదకు మూర్ఛిల్లును. తపతి దూరము నుండి యిదంతయును జూచుచుండి, పరుగున వచ్చి, రాజును స్పృశింప నాతఁడు మూర్ఛదేరి, యామెం బట్టుకొనఁబోవ సఖులడ్డమై, సూర్యునారాధించి యీవెంబడనుముమని తపతితో నంతర్ధానమందుదురు. రాజున్నశ్లేకావించి; తపతిం బెండ్లాడి సుఖంబున నాయరణ్యముననే కాలము గడపుచుండును.

—* చతుర్థాంకము. *—

పూర్వమొక యుద్ధమున సంవరణునిచేఁ దనపుత్రుల నూర్వురను గోల్పోయిన యొక రాక్షసి మోహినికయనునది, మాయలచే రాజుల నెల్ల యినఁ జంపి పగదీర్చికొనఁగోరి, యొక కుట్రబన్ని, రాజునంగీకారము వడసి యొక విమానమున సాయంతనవేళ నాతనిఁ గొంపోవునట్లు, నియమించికొని పోవును. భృగుమహర్షి యావిషయము లెఱింగి తన మంత్రప్రభావంబున నా రాక్షసిని దూరముగఁ దోలి, రాజునకా కుట్ర యెఱింగించి, ఋషులకు శరణ్యుఁడగు నా రాజచంద్రునిఁ గాపాడును.

—* పంచమాంకము. *—

రాజు చిరకాలము లేనందున నరాజకమయి సంవరణు రాజ్యమంతయు, దుర్భిక్షపీడితమై, రిపుజనమ్ముల కగ్గము గానున్నతరిని, మంత్రి మిక్కిలియుఁ జింతించి సంవరణుని వెదకికొనుచు, నరణ్యములకు వచ్చును సంవరణుఁడు దపతియందలి యనురాగముచే పురికేఁగ నిచ్చగింపకున్నాఁడని గ్రహించి, వారికిద్దరకెట్లయిన యెడబాటు గల్పింపనెంచి, యొకరేయి వారిద్దరు నిద్రించుతరిని, సారథి రహస్యముగ గర్భవతియగు తపతిని యామె యక్కయగు సావిత్రికడకుఁ జేర్పించును. అంత తపతి యచ్చట సూర్యకల్పిత సహాహామ్మున నొడలెఱుంగకయే పుత్రునిఁ బ్రసవించెను. సూర్యుఁడా కొమరు

వెంటనే తనలోకమునకుఁ గొంపోయి పెంచుచుండెను. ఇచ్చట సంవరణుడు తపతింగానక యున్మత్తుఁడై కాననముల గ్రుమ్మరువేళ సమయము కనిపెట్టి మంత్రివిదూషకు లిరువురును సమీపించి, శత్రువుల దుండగముల నుగ్గడించి యాతనికిఁ గోపముం బుట్టించ్చి, సూర్యదత్తమగు రథమున నాకాశవీథిని పురంబునకుఁ గొంపోవుదురు.

—* షష్ఠాంకము. *—

రాజు, శాత్రవుల జయించి- ప్రజల కష్టములడంచి, సుఖించుచుండి, తపతిం దలంచి పరితపించుచుండ, నచ్చట దపతియుఁ రాజునకయి పరితపించుచు, తనయాజ్ఞలేనిదే పతిని దర్శింపరాదనిన జనకుని శాసనమున సేయునదిలేక మారువేసమున సౌధాగ్రముననున్న రాజుకడకు వచ్చును. అంత మరల మోహినిక కొన్ని కుట్రలు కల్పించి, వారినెల్ల నేకకాలమున నంతమొందించు సమయమున సూర్యలోకమునుండి సంవరణ పుత్రుఁడగు కురునితోఁగూడ వసిష్ఠుడరుదెంచి, కుమారు నర్పించి, మోహినిక మాయలన్నియు వెల్లడించి, కుమార బంధితయైన మోహినికనువిడిపించును. ఇంతలో తపతియు రాజును నొండొరుల గలసియుండునట్లు సూర్యుఁడు మరల ననుగ్రహించి పారితోషికము వస్త్రాభరణములుఁ బుత్తెంచును. అందరుఁగలసి సుఖింతురు. ఈ కథ భారతము నాదిపర్వములోనిది. ఈ నాటకమున నసతి పూర్ణ్ణలొందినది.

పీఠిక.

నేను 1917 సంవత్సరము సెప్టెంబరు నెలయందుఁ గర్నూలు పురంబున కొక పనిమీఁదఁ బోయియుంటిని. అచ్చట బ్రహ్మశ్రీ ఇంద్రగంటి సుబ్రహ్మణ్యశాస్త్రి గారికిని నాకును నూతనముగ మైత్రిసంప్రాప్తమయ్యె. పిమ్మట వా రొకనాఁడు గీర్వాణవాణి నున్న తపతీసంవరణనాటకము నాకుఁ జూపి దీని నాంధ్రీకరించుటకు నన్నుఁ బ్రోత్సాహ పరచిరి. అంతట నే నాపనికిఁ గడంగి యచ్చటనే సుమా రిరువది రోజులలోఁ బ్రథమాంకము ముగించితిని. అనంతరము ప్రస్తుతము నాకు నివాసభూమియగు కృష్ణామండలము నందలి కోవూరున కేఁగి యచ్చట నా ప్రాణసఖుఁడు జాజాల చలమయ్యశాస్త్రి నాకనేక విధముల సహాయమొసర్చి నన్ను బ్రోత్సాహపఱుప 1918 సంవత్సరము జనవరి నెల నాటికి గ్రంథమంతయుఁ బూర్ణముగ నాంధ్రీకరించితిని. జూలై నెలలో నాంగ్లవిద్యాభ్యాసమునకై నేను జెన్నపురికి వచ్చితిని. అప్పుడు నా మిత్రు లనేకు లీగ్రంథముం జూచి చాల బాగుగ నున్నదని ప్రశంసించి ముద్రణమునకై నన్నుఁ బ్రేరేపించిరి. కాని నాకిది ప్రథమప్రయత్న మగుటంజేసి దోషయుక్తమై యుండు నని యెంచి యింత శీఘ్రకాలమున ముద్రింపించుట కిష్ట పడకుంటిని. అనంతరము నేనీ పొత్తమును గొందఱు పండితులకుఁ జూపఁగా వారు మంచి అభిప్రాయముల నిచ్చిరి. అంత నేనీపొత్తమును ముద్రింపఁ దలంచి యుండ, డాక్టర్. కే. యన్. కేసరిగారు నా యుద్యమమునకుం దోడ్పడి ముద్రణమున కగు వ్యయము లన్నియు భరించి నాకృతజ్ఞతకుం బాత్రులైరి. వేమూరు రామదాసు పంతులుగారు, ఆంధ్రపత్రికా సంపాదకులగు నాగేశ్వరరావు పంతులుగారు, బచ్చు వేంకటసుబ్బయ్య శ్రేష్ఠిగారును, సామి వేంకటాచలము శ్రేష్ఠిగారును వలయు కాగితముల నిప్పించి నన్ను సఫలమనోరథుని గావించి నందులకు వారికెంతయుఁ గృతజ్ఞుఁడను. గ్రంథరచన యందు నాకుఁ జాల దోడయి ముద్రణమునకు నన్ను మిక్కిలి ప్రేరేపించి నా మిత్రులు కేసరి, గురుమూర్తిశాస్త్రియు, బులుసుగుండ్ల నరసింహశాస్త్రియు నాకృతజ్ఞతకుఁ బాల్పడిరి. అచ్చటచ్చట నచ్చుతప్పు లుండవచ్చును. కాన రెండవ కూర్పున సవరించికొనెదను.

పండితులు మన్నింపఁ బ్రార్థితులు.

ఇట్లు,

28 జనవరి 1919. } కాకర్ల కొండలరావు.

అభిప్రాయములు.

బ్ర॥ శ్రీ॥ కాకర్ల కొండలరాయఁడు రచించిన "తపతీసంవరణ" మను నాంధ్రీకృత నాటకము నందందుఁ బఠించితిని. మిక్కిలి చక్కఁగఁ దెనిగింపబడినది. శైలి మనోహరమై పండిత పామర హృదయాహ్లాద కరమైయున్నది. భాష నిర్దుష్టమై శ్లాఘ్యమైయున్నది. ఇదియే వీరికిఁ బ్రథమ ప్రయత్నమని కవిత్వ మొక్కొక్కచోఁ దెలుపుచున్నది. సమష్టిమీఁద ధారయానర్గళమై స్వతంత్రముగ రచితమైన గ్రంథమువలెఁ బఠనీయమై యున్నది. వీరి కవిత్వశిల్పమున నింకయు శ్రద్ధాభక్తులతోఁ బాటుపడెదరేని యుత్తమ కవులలోఁ జేరఁగలవా రగుదురు.

తిరువళిక్కేణి
25—1—19

వావిలికొలను-సుబ్బరావు.

మ॥ రా॥ రా॥ కాకర్ల కొండలరావుగారిచే నాంధ్రీకరించబడిన "తపతీ సంవరణ" మనునాటక మంతయు నేను వింటిని. కొన్ని పద్యములును గద్యములును మూలముతోఁ బోల్చి చూచితిని. మూల మందలి యర్థమును, భావములును, భాషాంతరము నందుఁ జక్కఁగ బ్రతిఫలించినవి. మూలముతో సంబంధము లేకుండఁ జూచినను నాటకము ప్రదర్శనయోగ్యమనియుఁ బ్రేక్షకులకుఁ దప్పక యాహ్లాదముఁ గల్పించు నది యనియు నాయభిప్రాయము. ఈ గ్రంథకర్త భాషాసేవ యీవిధముగనే చేయుచుండినయెడలఁ గొలది కాలమునందే మంచికవి యనియు నాటకకర్తయనియుఁ బేరుపొంద వచ్చును.

కే. వి లక్ష్మణరావు,
ఆంధ్రపత్రికానిలయము.

మ॥ కొండలరావుగారు వ్రాసిన తపతీసంవరణనాటకమును నేను కడు సంతసముతో తీరనికనివితో వదలజాలని కుతూహలముతో తదేకలగ్నమగు మానసముతోఁ జదివితిని. వీరి కవిత్వము మృదుమధురము. పద్యముల నడక ధాటి శ్లాఘనీయము. గీర్వాణభాషను రచించిన ప్రాచీనకవి హృదయమును వీరు తమయాంధ్రీకరణమునఁ జక్కఁగాఁ జూపఁ గలిగిరి. ఇట్టి ప్రశస్తమగు

నాటకమును ఆంధ్రవాఙ్మయమునకుఁ గానుకగా నిడిన కొండలరావుగా రాంధ్రుల కృతజ్ఞతకుఁ బాత్రులు.

వేమురుమూడి - శేషగిరిరావు.
సహాయసంపాదకుఁడు.

నీతిదాయకమై సదలంకార భూయిష్టమై సముచితపోషణా సంవిధానముచే నొప్పారునట్టి తపతీసంవరణ నాటకమును మహారాజశ్రీ కాకర్ల కొండలరాయ కవిగారు సంస్కృతమునుండి యనర్గళవాగ్ధాటితో మృదుమధుర శైలితో సలక్షణభాషతో నాంధ్రీకరించి యాంధ్రభాషామతల్లి కొక యమూల్యాభరణమును గానుకగా నొసంగిరి.

వీరికిదియే ప్రథమప్రయత్నమైనను మూలమునందలి భావాదిస్వారస్యాదుల నించుకేనియు వెలితిబడనీయక స్వతంత్రగ్రంథపఙ్క్తి ననుసరించి యున్నవి యున్నట్లింత మనోజ్ఞముగాఁ దెనిగించుటఁ జూడ వీరిభాషాపరిశ్రమయుఁ గవిత్వతత్త్వనైపుణ్యము పాండిత్యము వెల్లడియగుచున్నది.

ఈ గ్రంథమును జేతఁదీసికొనినచోఁ దుదవరకుఁ జదువనిదే మనసున కింపొనర్పదు. మఱియుఁ గదళీపాక విరాజితమై దనరారుటచే విద్వాంసులకును సామాన్యులకును నిరతిశయానందమును సమకూర్చుచు నున్నతభావ ప్రబోధకమై సంస్తుతిపాత్రమగు చున్నది.

ఈ గ్రంథము మూలమునందలి భావాదుల నించుకేనియు వెలితిబడకుండ స్వతంత్ర గ్రంథముగా నుండునట్లు మిక్కిలి రమణీయముగా రచియింపఁబడియుండుటచేఁ జదువరుల మనము నెంతయు నాకర్షించుచు వారినున్నతభావ ప్రబోధితులఁ గావించి మనసున కొక యపూర్వానందమును జనింపఁజేయుచున్నది. ఈగ్రంథకర్త కిదియే ప్రథమ ప్రయత్నమైనను భాషాంతరీకరణములలో నింత హృదయంగమముగా మనోజ్ఞముగా నిర్మింపఁ సామర్థ్యము గలవారు మనదేశమున నఱుదుగా గన్పించుచున్నారు. ఇట్టి రూపకములను జ్ఞానమార్జించుటయం దాసక్తిగల వారెల్లరుఁ జదివినచోఁ దదుపలబ్ధికి సందియ ముండదు. మన దేశమునందలి కవులలోఁ బ్రాముఖ్యము వహింపఁగల శ్రీ కొండలరాయ కవిగారికి నా పరమదయాళుఁడగు నీశ్వరుఁడాయురారోగ్యైశ్వర్యముల నొసఁగి వారిచే నిట్టి భాషాసేవ నిరంతరముఁ జేయఁబడు నట్లనుగ్రహించుఁగాత!

భిషగ్వర - కైప సుబ్రహ్మణ్యశర్మ.

ఓం

తపతీసంవరణము.

ప్రథమాంకము.

{ నాంద్యంతమున సూత్రధారుఁడు ప్రవేశించుచున్నాఁడు. }

సూత్ర—

చ. కలువలఱేనివంకయును • గౌస్తుభముఁ సుధయుఁ గ్రమంబుమై
నలికము మోవి స్వేదమను • వ్యాజమునం దమసోదరిఁ దదం
గలతిక నూని పెండ్లితరిఁ • గాంతుని కీయఁగ, దెచ్చిరోయనం
బొలుచు సుధాబ్ధికన్యపరి • పూర్ణకృపామతి మిమ్ముఁ బ్రోచుతన్.

(ఆలోచించి) అతివిస్తర మేల? నా కిపుడు సంప్రాప్తమైనయభ్యుదయ ప్రమోదాతిభారంబున మద్గృహిణియుం బాల్గొనుఁగాక. (తెరవంక జూచి) నటీ! యిటురమ్మా.

నటి—(ప్రవేశించి) ఆర్యా! యిదిగో! వచ్చితిని.

సూత్ర—ప్రియా! అపూర్వంబు నాదిరాజకథాసనాథంబును నగు తపతీ సంవరణ నాటకమందలి ప్రయోగామృతాంతరములగు నవరసంబులనుఁ బానము జేయఁగోరి యీ యార్యమిశ్రు లట్టియుచిత ప్రయోగంబునకు నన్ను నియోగించి యున్నారు.

నటి—ఆర్యా! యీ నాటక మే కవిపుంగవునిచే రచియింపఁ బడియె?

సూత్ర—ఏని మకుటతటము పరమహంస పాదపంకేరుహపాంసుపటలపవిత్రీకృతమైనదో యేనికరకమలము గోత్రామరేంద్రదారిద్ర్యాంధకారంబునకు భానుతుల్యమైనదో యేనిముఖకమలమునుండి యైశ్వర్యమంజరీకథామధుద్రవము చిప్పిలినదో మఱియు

గీ. ఉన్నతాంస మాజానుబా ♦ హుయుగ మాంస
వర్తిరత్నకర్ణికకర్ణ ♦ పాశ మురశ్శి
రోధి యుత్తుంగఘోణము ♦ రుక్మనిభము
నైన యెవ్వానితనువు ప్ర ♦ జార్తిహరము 2

అట్టి కేరళకులచూడామణియు మహోదయపురాధీశ్వరుఁడు నగు మహాకవి "శ్రీకులశేఖరవర్మ" ధరావల్లభుండు తొలుత గీర్వాణభాషయం దీ నాటకమును రచించెను.

నటి—అట్లయిన దీని నెవరాంధ్రీకరించిరి?

సూత్ర—

సీ. ఆత్రేయగోత్రాంకుఁ ♦ డాఱువేలనియోగి
వంశసంజనితుఁడై ♦ వఱలువాఁడు
సతతంబు ఋజుమార్గ ♦ చరుఁడైననిమ్మరా
ట్చిన్నాంబికలు ♦ గూర్చుచిన్నిసుతుఁడు
సద్గుణ జాజ్వల ♦ చలమయ్యశాస్త్రికి
ననయంబు విడరాని ♦ ప్రాణసఖుఁడు
బాల్యంబు గడచిపో ♦ వనినూత్నతరుణిమ
బైకొనం దనగారు ♦ వటువువాడు
గీ. నిరతమును దైవభక్తిమైఁ ♦ బరగువాడు
పండితులమోల నాదల ♦ వంచువాడు

జాలిగలవాఁడు సజ్జన ♦ సమ్మతుండు
ప్రకటధీశాలి కొండలరాయఁ డతివ ! 3

నటి—ఆర్యా- అనపత్యుల రగుమీకు సపత్న్యుత్పత్తిహేతువగు వివాహాంతరాభ్యుదయమున జనించినయానందము నేఁడీయార్యమిశ్రుల యాజ్ఞాబలముచే ద్విగుణితమైనది.

సూత్ర—ఇక సంగీతమారంభింతమా ?

నటి—(ఖేద మభినయించి) ఆర్యా! నేనింతవఱకును పుత్రలాభదురాశచే నియమక్లేశితశరీర నగుటం జేసి గాన మొనర్పజాలకున్నాను.

సూత్ర—(తెరవంకఁ జూచి) ఆహా! నాశిష్యుఁడు శివదాసు విదూషకుని వేషముఁ బూని యిటే వచ్చుచున్నాఁడు. నీవు బడలియున్న దానవు. నేనును శిష్యగుణసంక్రాంతమై యున్న యాత్మప్రయోగప్రతిబింబముం దిలకింప నుత్సాహినై యున్నాను. కావున మన మిరువురమును బ్రేక్షకుల మగుదము. మఱియును,

గీ. పుత్రలాభార్థముగ నీవు ♦ పూనియున్న
వ్రతము నందుండి నాచేని ♦ వారణంబు
వడసితివి ; సంవరణ పార్థి ♦ భానుచేత
సాల్వభూనాయకునితనూ ♦ జాత వోలె. 4

(ఇద్దఱును నిష్క్రమింతురు)

{ విహ్వలాంగుఁడై విదూషకుఁడు ప్రవేశించుచున్నాఁడు. }

విదూ—(నిట్టూర్పు విడిచి యంగము లొత్తికొనుచు) దేవియగు సాల్వరాజపుత్రిని పుత్రీయనియమమునుండి నివారించి మరలి స్వప్నశ్రవణార్థమై శీఘ్రముగ రమ్మని కంచుకిచే చెలికాఁడు నా కీయుదయముననే

జెప్పిపుచ్చెను. నేను నర్మోద్యానమునఁ బోయి నియోగము నెఱవేర్చికొని మరలి రాజవీధిని వచ్చుచు నా మొద్దుగుఱ్ఱముమీఁదనుండి తల్లక్రిందుగా బడితిని. అందుచే నా యవయవములు నాకు స్వాధీనమ్ము గాకున్నవి. కాని మైమ్రనను బలవంతమున నా చెలికానికడకు లాఁగికొని పోయెదనుఁ గుంటుచు ముందునకుఁ జూచి) ఆహా! యేమి నా ప్రభావము. ఈహా స్త్రీపురవాస్తవ్యులందఱు గుఱ్ఱము-పారాశర్యుఁడు- అని యస్పష్టాలాపము లాడుచు హాసనిరోధ దుష్ప్రేక్ష్యముఖులై నవ్వుటకుఁగాని నవ్వకుండుటకుఁగాని శక్తిలేక పర్యాకులచిత్తులై యున్నారు. (తెరవంకఁ జూచి) ఇదిగో! నా చెలికాఁడలంకరణము సమాప్తిఁ జేసికొని యిటే వచ్చుచున్నాఁడు. ఇఁక నేను శ్రమపడ నేల? కావున నిచ్చటనే యుండెదను. (అచ్చటనే యుండును.)

{ రాజు సపరివారుఁడై మనస్తాపముతోఁ బ్రవేశించుచున్నాఁడు. }.

రాజు—(సవిమర్శనముగా) ఆహా! అపత్యపదార్థవిశేషమహిమ చెప్పఁ దరము కాదు, ఏలయన,

గీ॥ ప్రసవగుణహీన యగునాదు ♦ భార్యఁ దలఁప
మది జనించెడి నెంతో యు ♦ మ్మలిక నాకె
కూర్మితనయులవిరహంబు ♦ కొలఁదిఁ బుత్ర
వంతుల కొదవుఖేదం ♦ బికెంతయొకద! 5

స్వప్నము విని కర్తవ్య మాలోచించుటకై యిటకు రమ్మని యుదయముననే నా చెలికాఁడగు పారాశర్యునికి వార్త నంపియుంటిని. అతఁడిప్పటికిని రాకున్నవాఁడు (దిక్కులు బరికించి) ఓహో! ఏమిది, అప్పుడే లేయెండ తలయెత్తి నుంకించుచున్నది.

సీ॥ కలకలారావముల్ ♦ జెలఁగఁ బక్షికులంబు
లాశాంతరంబుల ♦ కరుగఁజొచ్చె
వరివెన్నుతుదవోలె ♦ నరుణంబు లగుభాను
కిరణముల్ దిశలంఘుఁ ♦ గెరల కుండె
నిదురమత్తునఁ దేలు ♦ నేత్రాంబుజములకు
నల్ల నల్లన దృష్టి ♦ లావహించె
అంతకంతకుఁ జారి ♦ యతికృశత్వము నొంది
యిరుల మొత్తంబు లిం ♦ తింత లయ్యె
గీ॥ జరఠ మత్స్యాల్ప మగుతమ ♦ శ్శకల మొకటి
సాగరతరంగముకుగిది ♦ సన్నగిలుచు
నపరదిశయందు లఘుభాగ ♦ మావరించి
పాసి పోఁజాల కున్న దిప్పటికి నైన. 6

(ముందునకుఁ జూచి)

ఆహా! యీ నా చెలికాఁడు పారాశర్యుఁ డేలకో వ్యసనపీడితునింబోలె గన్పట్టుచున్నాఁడు. ఈతని యీయవస్థకుఁ గారణ మెద్దియో!

విదూ—(సమీపించి యెట్లో కుడిచేయి యెత్తి) మిత్రమా! జయ మగు గాఁక

రాజు—వయస్యా! నీయవయవవ్యాపారము పూర్వమువలె లేదేమి?

విదూ—తమయనుగ్రహమే కారణము.

రాజు—అనఁగా నీయభిప్రాయ మేమి?

విదూ—(నవ్వుచు) అక్షరముచేతను యాకారముచేతను సూచింపఁ బడని విషయములనే యెఱింగి సదా వ్యవహరించుచుండు నీవు నే నిప్పుడక్షరాకారముల రెంటిచేతను సూచించినయీవిషయ మెఱుంగఁజాలకుంటివా? నీపాండిత్యమెక్కడ బోయినది?

రాజు—సముద్రమునందువలె లోతెఱుంగరాని మీబోఁటివారి మనోవ్యాపారము లెఱుంగుటకు మాబుద్ధు లల్పములు. కావున స్పష్టముగాఁ జెప్పుము.

విదూ—అట్లయినఁ జెప్పెదను వినుము. నే నశ్వయానమున దేవికడ కేఁగి నియమమునుండి యామెను నివారించి మరలి రాజవీధిని వచ్చునపు డా మొద్దుగుఱ్ఱము బంతివలె న న్నెగుఱవేసి యేమూలనో పడఁద్రోఁచి పోయెను. గుఱ్ఱపు మూఁపుపై నాసన మొకనిముసమాత్ర మైన నిలువమిం జేసి యీయశ్వారోహణముచే నే నాకాశగమన మర్ధము మాత్రము నేర్చికొంటిని. దేవాసురవిమర్ద పరిచితాంబరగమనుఁడగుటఁ జేసి నా చెలికాఁడీ విద్య పూర్ణముగ నేర్పఁగలఁడు గదా యని నే నప్పుడను కొని వెంటనే యిట కేతెంచితిని. కావున నాకిప్పు డావిద్య నుపదేశింపుము.

రాజు—మూర్ఖా! ఈవిషయమున మాయుపదేశములు నిరర్థకములు.

చ. అరు దగుయోగమార్గమున • నైనను మంత్రసుసిద్ధి నైనని
ర్జరులవరంబుచే నయిన • సంయమిచంద్రులసేవనైనన
శ్వరసుకృతార్జనారతులు • కల్మషరాశి నశింపఁ జేసి స
త్వరమ నభస్థలీగమన• భాగ్యముఁ గాంచి సుఖింతు రెంతయున్.

విదూ—పోని మ్మాప్రసంగము వదలుము. వాడియున్న నీమోముదామరం జూడ నీహృదయమున నేదో సంతాప మున్నట్లు తెలియు చున్నది. కారణ మేమి ?

రాజు—మిత్రమా! చక్కఁగా నూహించితివి. గడచిన రాత్రి నేను స్వప్నమున సూర్యోపస్థాన మొనర్చు చుండఁగా,

చ. కరములవేఁడిమిం దుహిన• కాండములన్ని యురూపుమాయఁ
దొరువులఁ దమ్మితీవియలు• దోఁగవిచ్చిన మొగ్గకన్నులం [గా

దిరముగ నల్లనై యొసఁగు • తేఁటులపేరిక నీనికాళిచే
వెలుఁగునఁ జూచుచుండ రవి• బింబముదోఁచె సుమత్పురస్థలిన్ ॥

విదూ—తరువాత.

రాజు—అప్పుడు నేను భక్తిచే శిరసు వంచి నమస్కరించుచుండ నాబింబమధ్యమునుండి యొకగంభీరవాక్కు వెలువడియె.

విదూ—ఎట్టివాక్కు ?

రాజు—"వత్సా! సంవరణా !

గీ. సాల్వభూమీశ్వరునిపుత్రి • సన్నుతాంగి
నీదుకోమలి కువలయ • నీలనేత్ర
ప్రసవగుణహీన సుమ్మి! యీ • భవమునందు
శారదసమయసహకార • శాఖవోలె." 9

అని చెప్పి భగవానుఁ డంతర్ధాన మొందెను. నేనును బ్రాభాతిక మంగళగీతంబులచే మేల్కొంటిని.

విదూ—శుభ మగుఁ గాక పరితపింపకుము.

రాజు—నే నధమర్ణుండను గదా. పరితపింప కుండు టెట్లు?

విదూ—(నవ్వి) అనేకామూల్యమణి ప్రపూర్ణములగు వేనవేలు కోశాగారము లుండియు ఋణసంతాపము నొందు చున్నాఁడవా? ఆశ్చర్యము!

రాజు—మూర్ఖా! నీ వుద్దేశించిన ఋణవిషయము కాదు నేను మాట్లాడుట. ఇది వేఱు. పుత్రహీనత యనెడి పితరుల ఋణముం గూర్చి చెప్పుచున్నాను.

విదూ—అన్యోన్యము వాదించుకొనుచుండ తార్కికులవలన నే నీవిషయ మిది వఱకే వినియున్నాను. మీరు సూర్యుఁ డానతిచ్చినవిషయార్థ మెఱుంగక పరితపించుచున్నారు. ఆయర్థము నేను జెప్పెదను వినుఁడు. "ఈ నీదేవికి పుత్రులు కలుగరు. వేఱొకదానిని వివాహముఁ గమ్ము. ఆమె వలన నీకుఁ బుత్రులు జనింతురు" అని

రాజు—మిత్రమా! ఇదికూడ యోచింపఁ దగినదే. కాని దేవీగుణగణబద్ధమగు నాయీహృదయము వేఱొంట నుండఁజాలను. కావున నిపుడు నియమరహితమై యున్న దేవిని దర్శించి వత్తము రమ్ము.

విదూ—ఇటు నిటు మిత్రమా!

(ఇద్దఱుఁ బరిక్రమింతురు).

రాజు—(నిమిత్తము సూచించి) మిత్రమా!

గీ. తనయ జన్మలాభంబునఁ ♦ దక్కనిపుడు
మదము వేఱొంటఁ జేకూరఁ ♦ బోదు నాకు;
అదరుచున్నది నాదక్షి ♦ ణాక్షి చూడ
నెఱుఁగరాదయ్యె దీనికి ♦ హేతు వేమొ!

అదృష్టపూర్వయగు దేవికై మార్గము వెదకుచుండ సునిమిత్త మేల కలుగ కుండును?

రాజు—అదృష్టపూర్వయనఁగా నీయభిప్రాయమేమి!

విదూ—ఇంతకాలమును నియమాంతరిత దర్శన యగుటచే నే నట్లంటిని (ముందునకుఁ జూచి) ఇదిగో! యిటు చూడుము. భగవతియగు భాగీరథి కనఁబడుచున్నది.

రాజు—(అంజలిపట్టి)

సీ. భువనత్రయంబును ♦ బూతంబుఁ గావింప
జనన మొందిన భవ్య ♦ సాధనములు
అతిదుర్లభం బైన ♦ యమరలోకముఁ జేర
వరుస మై నిడిన సో ♦ పానతతులు
శ్రావ్యనాదములచే ♦ సతతంబుఁ గ్రీడించు
హంసావళుల కెల్ల ♦ నాటపట్లు
చంద్రదీధితిపుంజ ♦ సమములై తనరారు
ధవళకాంతులకు నా ♦ ధారకములు

గీ॥ పరిమళాంభోజసంతాన ♦ భాసురములు
నయిన ఘనవీచికా నికా ♦ యములతోడ
సతతమును రామణీయక ♦ స్థాన మగుచుఁ
దనరుచుండెడు నీకు వం ♦ దనము తల్లి!

విదూ—(ఎదుటిభాగ ముద్దేశించి) ఇది గుహ్యగృహసమీపమందలి యారామము. దీనఁబ్రవేశించుము.

రాజు—(ప్రవేశమునటించి చూచి) అహా! యేమి యారామసౌభాగ్యము! ఇదిగో యిచ్చట

గీ॥ చిలుక గొఱికిన దానిమ్మ ♦ గెలలనుండి
పుడమి రాలినబీజ స ♦ మూహ మెల్ల
వన రమాంఘ్రులనుండి జా ♦ రినవిలాస
యావకపుశోభ నూనిన ♦ యట్లు దోఁచె.

(ఇద్దఱుఁ బరిక్రమింతురు.)

విదూ—(సభయముఁగా బరుగెత్తి) వయస్యా, పరుగెత్తి పోవుదము రమ్ము! ముందు గొప్పయుద్ధము జరుగుచున్నది.

రాజు—నీకీ యకారణభయ మేటికి?

విదూ—ఇట్టిప్రాణసంశయమునకంటె సంభ్రమావకాశము మఱేమి కావలయును?

రాజు—నీప్రాణసంశయమునకు హేతు వెద్ది?

విదూ—(వ్రేలితోఁ జూపుచు) ఈమరకతశిలాతలమందు రక్తప్రవాహము నీ కగపడుట లేదా?

రాజు—(నిపుణముగా నిరూపించి నవ్వుచు) మిత్రమా! నిజమే యిచ్చట యుద్ధము జరిగియే యున్నది. ఒకానొక దేవతరుణియొక్క—

క॥ యావకవిమ లేపాంచిత
భావుకపదపంకజాత ♦ బాణంబులచే

భావజుఁ డేయఁగ మరకత
మీఁ వెలవునఁ బడియెఁగరము ♦ లిరుదెస లలమన్ 13

విదూ—ఈపదవిన్యాసము దేవకన్య దనియే నీ వెట్లు తెలిసికొనఁ గలిగితివి?

రాజు—ఆకాశమునుండి దిగివచ్చునపు డీయశోక పర్ణంబులనంటినలాక్షారసముం జూడుము

విదూ—సరే యిది యుక్తముగనే యున్నది. (మరల నిరూపించి) ఇచ్చట మటి యొకపాదవిన్యాస మగపడుచున్నదే. దీనికి వ్యాఖ్యాన మెట్లు? పోని మ్మింత మాత్రమునకు నీ వేల? నేనె చక్కఁగా నాలోచించి వ్యాఖ్యాన మొనర్చెదను. (అని ధ్యాననిమీలితనేత్రుఁ డగును.)

{ అప్పుడు దేవి సపరివారముగాఁ ప్రవేశించు చున్నది. }

దేవి—సఖీ? యడత్పలికా? ఇంతకాలమును పుత్రసంభవ కౌతు కాతిశయముచే నార్యపుత్రు నెడబాసి యుంటఁజేసి విరహోత్కంఠ వ్యాకుల పరచు చున్నను నాహృదయస్ఫుటితముగా కున్నదిగదా? ఇపుడునియమరహితనై యున్నదానను. ఇఁక నిముసమైన నాలసించుటకు నామన సొప్పుట లేదు. కావున శీఘ్రముగా నార్యపుత్రుని దర్శనోత్సవ మనుభవించెద.

చేటి—దేవీ ! వర్షర్తునిరోధముం బాసిన శరచ్చంద్రిక కలువకొలనుం జేరదుం డునా ? ఇటు నిటు దేవీ !

(పరిక్రమింతురు.)

విదూ—ఆహా! కేవలము నిమీలితనేత్రములనే కాక మనస్సునుఁగూడా మహాంధకార మావరించినది. కావున నిదియు నీవే విమర్శింపుము.

రాజు—ఇచ్చట తెలియరాని దేమున్నది? ఈపాదవిన్యాస మాదేవకామిని నెచ్చెలిదై యుండును.

విదూ—ఇదియు నుక్తముగనే యున్నది. (ఊర్ధ్వముఖుఁడై) ఆహా ఈమాంస ఖండ మాకాశమునుండి పడినది. స్వర్గమున మహాదేవాసురసంగ్రామము జరుగు చున్నదో యేమొ ?

చేటి—(చెవియొగ్గి) దేవీ? యెదుట పారాశర్యులవారి యాలాపములు వినబడు చున్నవి. కావున మహారాజుగారుఁ గూడ నిచ్చటికివిచ్చేసినట్లు దోచు చున్నది.

దేవి—సఖీ? యీతీవెజొంపములం దొకముహూర్తమాత్రము దాఁగియుండి వారియన్యోన్యసంభాషణము విని పోవుదము.

(అట్లుచేయుదురు.)

రాజు—(మరలనిరూపించిచూచి) ఇది మాంసఖండము గాదు. మందారపల్లవ కల్పితమగు నొకానొక కామినియొక్క,

సీ. చిరుచెమ్మటను దోఁగు ♦ చెక్కుల్లపొత్తుచే
ఘనభాగధేయ సం ♦ కలితమగుచు
మందారపల్లవ ♦ సందోహకల్పిత
మణిదళాకృతులచే ♦ మహిత మగుచుఁ
బరిమళాకర్షిత ♦ భ్రమరాళిలులితాల
కప్రసూనపరాగ ♦ దీప్త మగుచు
మకరికాపత్ర సం ♦ ప్రకరచిత్రము లెల్ల
నదికి యుంటను మహో ♦ దార మగుచు
గీ. నమితసురభిళతాఘుమం ♦ ఘుమిత మగుచు
వివిధవిధవర్ణసంజాత ♦ విశద మగుచు
నక్షి నాసాప్రమోదదా ♦ యకము నగుచుఁ
దనరు చుండెడి ప్శ్రుకులావ ♦ తంసకంబు. 14

దేవి—సఖీ! యీమందారకర్ణపూరము నాకు శంక జనింపఁ జేయు చున్నది.

చేటి—దేవీ! యింతమాత్రముననే యేమి నిర్ణయింపఁ గలను? [illegible] వినుచుందము.

విదూ—ఆహా! నాసిద్ధాంత మంతయు నీటిపై వ్రాయఁబడిన యక్కరమువలె పరిణామశూన్య మైనదిగదా? (కర్ణపూరముం దీసికొని) ఈకర్ణపూర మెవరిదో యిదియుం జెప్పగలవా?

రాజు—(వ్రేలితోఁ జూపుచు) ఈపదవిన్యాస మెవరిదైయుండునో వారికర్ణపాళము నే యిదియు నలంకరించి యుండునని తలచెదను.

విదూ—నీ వేయాధారముచే నట్లు నిశ్చయింప గలిగితివి?

రాజు—పాదవిన్యాస మందును, గర్ణపూరమందును స్వేదబిందువు లగపడుట చేత.

దేవి—పాదకథ గూడా యొకటి కలదా?

చేటి—దేవీ! కానిమ్మింతమాత్రమున నేమి?

విదూ—ఆకాశగమనముచే నిద్దురగూడా నలసి యుండ నందొకర్తుకు మాత్రమే స్వేద ముత్పత్తిలు టెట్లు?

రాజు—ఈస్వేదోత్పత్తి మార్గశ్రమముచేఁ గలిగినది కాదు. శ్లాఘ్యజన్ముఁడగు నొకానొక యువకుని,

గీ. బొమలు గుదియించి, యనురాగ ♦ పూర్ణములగు
వాలుచూపులఁ జూచుట ♦ వలన నొదవు
గగురుపాటునఁ దేలు నం ♦ గకములందు
పంచశరుఁ డిట్లు పాదసూపుఁ ♦ బ్రథమమునను. 15

విదూ—నే నల్పజ్ఞుఁడ నయినను సుంత యుత్ప్రేక్షింపఁ గోరుచున్నాఁడను. ఆకాంతామణి యపాంగశరంబునకుఁ గుఱియైనవాఁడవు నీవే యైయుండ వచ్చును. ఈమానవలోకమున నీవు దక్క దేవకన్యలచే వరింపఁబడుటకుఁ దగువాఁడు మఱెవ్వఁ డుండును?

దేవి—సఖీ! యీమాణవకుని యుపన్యాసము వింటివా?

చేటి—అవును వింటిని. ఇందు మహారాజుగారి యపరాధ మే మున్నది?

దేవి—వా రపరాధులని యెవతె జెప్పును?

విదూ—(కర్ణ పూరము సావధానముగాఁ జూచి) మిత్రమా! ఆశ్చర్య మాశ్చర్యము! ఇచ్చట నేదియో శాస్త్రము లిఖింపబడి యున్నది.

రాజు—(నవ్వుచు) అయినా నాశాస్త్ర మెద్దియో చదువుము.

విదూ—(చదువు చున్నాడు.) చాశో నెడయ నేస్వేద్పను మెదీకలగాబ్రం. అక్షరము లెట్లో చదివితిని. అర్థముమాత్రము తెలియుట లేదు. కావున నీ వర్థము జెప్పుము.

రాజు—(సవిమర్శముగా) ఇవి మదనసందేశపర మగు గాథయందలి పదాద్యక్షరములని తలంచుచున్నాను.

విదూ—నీ గోటితో వ్రాసి దీనిని పూర్తిచేసినయెడల నీమతికౌశల మప్పుడు శ్లాఘించెదను.

రాజు—(కర్ణపూరముఁ బుచ్చికొని పూరించి యిచ్చు చున్నాఁడు.)

విదూ—(మఱలఁ జదువు చున్నాఁడు)

గీ. చాతకాంగన శోభన ♦ జలద యందు
నెక్కు డనురాగవతి యయ్యె ♦ నేమి సేయు?
దృష్టిమాత్ర మనోరథ ♦ మెట్లు దీరు?
కను లలరుఁ గాఁకఁ బ్రమదాశ్రు ♦ కణికతతుల. 16

విదూ—ఓహో! నీవు జాడ నెఱుకవలె నున్నాఁడవే? అది యొక చిన్న రంధ్రమును విస్తరింపఁ జేయును. నీవు నైదాఱక్షరములతో మహాగ్రంథము రచించితివి. పో నిమ్మి ప్రసంగము. వే ఱొకరహస్యవిషయ మిప్పుడు నాకు గోచరించు చున్నది. పదవర్ణన మైనది మొదలు నీయాకారము వేఱువిధముగా నున్నది. మన్మథుని కేమైన నిచ్చట నవకాశము దొఱకినదా?

దేవి—సఖీ! నాకుఁగూడ నిదే సందియము.

చేటి—దేవీ! భర్తగారియుత్తరము విని నిర్ణయించుట మేలు.

రాజు—(స్వగతము) ఆహా! యీమాణవకునివచనము నాయవస్థ ననుకరించుచున్నది గదా! నిజమే. గుఱి తెలియంగ రాని యొకయుత్కంఠ నాహృ

యమును బీడించుచున్నది. (ప్రకాశముగా) మిత్రమా! వేఱుగాఁ దలంపకుము. కేవలము విస్మయముచే నే నాకర్షింపఁబడి యున్నాఁడను.

చేటి— దేవీ! వింటివా?

దేవి— నీవు ఋజుమార్గప్రవర్తకురాలవు గదా? ఇట్టి గంభీరహృదయులు తమ మానసముల నెప్పుడును వెల్లడింపరు.

విదూ— (వాసన చూచి నట్లభినయించి) దక్షిణమారుత మిప్పుడు బహుళామోదభరితమై వీచుచున్నది. ఆదివ్యజనమే దీనికిఁ గారణ మని తలఁచెదను. కావున నేను వారిని వెదకి కనుఁగొనఁ బ్రయత్నించెదను.

రాజు— మూర్ఖా? ప్రభావాంకితమూర్తులగు దివ్యజనుల వెదకి గనుఁగొనుట సాధ్యమా?

విదూ— ఒక్కొకప్పుడసంభావితతిరస్కరణీకులైగూడ నుందురని విని యున్నాఁడను. కావునఁ బోయిచూచెదను. (ముందునకుఁ బరిక్రమించి చూచి సాటోపముగా) మూర్ఖుఁడ నగునాకు మాత్రమే కాక దివ్యజనము వివేకరాశివగు నీకునుం గనఁబడఁగలరు. కావున శీఘ్రముగ వచ్చి చూడుము. (అనిరాజును లాఁగుచున్నాఁడు.)

రాజు— అట్లే చూచెదను. (అని చక్కగా దిలకించి జనాంతికముగా) మిత్రమా! యిదేమి దేవి యైనదే! నీచాపల్య మిట్లు పరిణమించినది?

విదూ— నా కాఁకలి మిక్కుటమగుటచేతఁ గనులను చీఁకట్లు గ్రమ్మినవి. అందుచే దేవినిఁ జూచి దివ్యజన మనుకొంటిని.

దేవి— పారాశర్యా! శంకింప నక్కఱ లేదు. పదముగళంబును యవతంసకంబును యెవ్వతెవని మీ రెంచియుంటిరో యాకాంత గాదు నేను.

విదూ— (జనాంతికముగా) మిత్రమా! దేవి మనసంభాషణమంతయు విని నట్లు దోఁచుచున్నది. ప్రారంభమునుండియు నీమె యిచ్చటనే యున్నదేమో!

రాజు— (ప్రకాశముగా) దేవీ! యకారణముగా కోపముఁ జెంద నేల? ఈయపరాధమున కంతయు నద్భుతరసమే కారణము.

దేవి— నే నాగ్రహమొందితినని మహారాజుగారు మాత్రమే చెప్పుచున్నారు

రాజు— ప్రియా! అట్లుఁ దలంపకుము. నీ చిత్తవృత్తి నెఱుఁగనా?

చ. బొమలినుఖమంత యేనిముడిఁ ♦ బొందక యేవిషమంబులైచనం
దమకముచే నురోజములు ♦ తద్దయునల్లల నాడుచుండ బా
ష్పముల నిరోధమబ్బఁ నలిపి ♦ జాఱఁగనీయక యిట్లు ప్రేమకో
పమహితమందహాసముల ♦ భామ! వృథానను నేఁచ నేటికే.

చేటి— దేవీ! శాంతింపుము. శాంతింపుము. ఈవిషయమున భర్త యనపరాధుఁడు గదా?

దేవి— అవు నట్లే, నియమక్లేశితశరీర మగుటం జేసి ప్రత్యుత్తర మీయఁ జాలకున్నాను. కావున నామందిరమున కేఁగెదను.; రమ్ము.

(దేవి సపరివారముగా నిష్క్రమించును.)

రాజు— దేవి వెడలిపోయిన దేల?

{ నేపథ్యము నిద్దఱు వైతాళికులు }

ప్రథముఁడు— ఆహా! చండాంశుఁ డాకాశమధ్యము నధిరోహించి యత్యుజ్జ్వలంబుగ వెల్గుచున్నాఁడు.

చ. భ్రమరముతోడఁ బొత్తుఁగొని ♦ పాన మొనర్చుట చేసుధాసమా
నముగఁ దలంచియుఁ దపన ♦ నాథుని వేఁడిమిఁ దప్తమౌటఁబు
ష్పమధువు నానకుండెనొక ♦ బంభరనారి; మఱొండు భానుతా
పమున నిజాంగముల్ సుడుఁగ ♦ వల్లభుఱెక్కలనీడఁ జేరెడిన్.

ద్వితీయుఁడు—

చ. హరిణ మొకండు దప్పిగొని ♦ యాతురతన్ మృగతృష్ణ [చెంతకున్
బరువిడి మోసపోయి, పిద ♦ పం గడుశీతలవారిపూర్ణమా

సరసిని గాంచియుం దరియ॥జంకుచు నిల్వెఁ బ్రసూనధన్వి భా
స్కరకరతప్తమైనసుమ॥చాపము ముట్టగ న్నొల్లకుండెడిన్.

విదూ—వైతాళికులధర్మమున బ్రతికితిని. మిత్రమా! స్నానమునకు ద్వరపడుము, జపపడుము. రేపుదయము మృగయావినోదార్థ మడవి కేఁగ వలసియున్నది గదా! అచ్చట మృష్టాన్నము దొరకుట దుర్లభము. కావున యథేష్టముగా కుక్షినిండ భుజింపుము.

రాజు—నీయభీష్టము నెఱవేర్చుటయే కాక దేవిని శాంతింపఁ జేయవలసియు నున్నది. కావున నిప్పుడభ్యంతర మందిరమునకే పోవుదము రమ్ము.

(అందరు నిష్క్రమింతురు.)

ప్రథమాంకము

సంపూర్ణము.

ఓం

తపతీసంవరణము.

ద్వితీయాంకము.

(అంతట రంభయు మేనకయుఁ బ్రవేశించుచున్నారు.)

రంభ—సఖీ! మహేంద్రుని శాసనపు గొడవలలోఁ బడి యిన్నాళ్ళిచ్చట జరిగిన వృత్తాంత మెఱుంగఁ జాలనైతిని. ఇపుడు నీమొగముఁ జూడ వైవర్ణ్యము వహించియున్నది. కావున దీనికి హేతు వెద్దియో తెలుపుము. మన నెచ్చెలి తపతి యిపు డెచ్చట నున్నది?

మేన—సఖీ! మును పొకనాఁడు భగవానుఁడగు భానుఁడు తపతిం దన తొడపై నిడికొని నారదమహర్షితో మాటవరుసన "దీని కనురూపుఁడగు వరుఁ డెవ్వఁ" డని యడిగెను. ముజ్జగంబుల వెదకిచూచినను రాజర్షియగు సంవరణుఁడు దక్క నెవ్వఁ డని నారదమహర్షి నుడివెను.

రంభ—ఇది నే నెఱింగిన విషయమే. తరువాత;

మేన—అదిమొదలా రాజర్షిపై నభిలాషగలదై లజ్జచేఁ దపతి తనకోర్కె వెలిబుచ్చనోడి మెలంగుచుండెను. పిమ్మట నాతోఁ గలసి యొకానొకప్పుడు తపన వనమునకుఁ బయనమయ్యె. మార్గమధ్యమున నారాజర్షి రాజధాని యగు హస్తిపురం బధోభాగమునఁ జూచి నిలుచుండెను.

రంభ—తరువాత,

మేన—అపుడు నేను నెచ్చెలి భావముం గనిపెట్టి "సఖి! యిది కాత్రికేయావాస పరిసరోద్యానము. నీ వలసి నట్లున్న దానవు. కాన నిచ్చట కొంచెము సేపు విశ్రమించి పోవుద" మంటిని.

రంభ—నెచ్చెలి భావము చక్కఁగాఁ గనిపెట్టితివి. తరువాత,

మేన—పిదప నచ్చటి మరకతశిలాతలమున మే మెప్పుడు దిగితిమో యప్పుడే యారాజర్షి వయస్యునిఁ గూడి యచ్చటికి విచ్చేసె.

రంభ—తరువాత,

మేనక—పిమ్మట మన్మథ బాణములును లజ్జయు నొక్కుమ్మడిఁ దన్నుఁగాసింప నెచ్చెలి యాతని యెదుట నిలువ నోడి తిరస్కరణీప్రభావమున తిరోధానమొంది నాతోఁగూడ నభస్థలమున కెగసెను.

రంభ—తరువాత,

మేన—ప్రేమపూరితములగు చూపులతోఁ దనమార్గ మంటి చూచుచున్న యారాజర్షింగని నెచ్చెలి ద్విగుణిత మనోభవ వికారయై బొక్కుచుండెను. పిదప నెచ్చెలిం జూచి "సఖీ! నీచెక్కులఁ బొడము చిరుచెమ్మటల బొట్లనెడి ముత్తియముల శోభను గర్ణపూరము తిరస్కరించు చున్నది గదా" యంటిని.

రంభ—తరువాత,

మేన—పిమ్మట నారాజర్షికి రూపమునకుం దగిన బుద్ధికౌశల మున్నదా యని పరీక్షించుటకు నెచ్చెలి యవస్థ నాతని కెఱింగించుటకును నిశ్చయించి నెచ్చెలిచెంతనుండి కర్ణపూరము లాఁగికొని, గాథాపదాద్యక్షరములుమాత్ర మందు లిఖించి, ప్రమాదమునంబోలె నాతనిముందు బడవైచితిని.

రంభ—చతురముగాఁ బ్రవర్తించితివి. తరువాత,

మేన—పిమ్మట నాతఁ డాగాథఁ బూర్తిచేయఁగా విని కోపమునఁదధర మదరుచుండ నెచ్చెలి నన్నుఁజూచి "అవినీతా! నన్నిటు లేలఁజులకనఁ జేసెదవు?" అని నుడివెను.

రంభ—తరువాత,

మేనక—ఈప్రస్తావమునసైన సర్వవృత్తాంత మాతనిదేవి విని కుపితయై యుండ నే నపుడు నెచ్చెలిం జూచి "సఖీ! సపత్నీమత్సరమున నీ వీమెం జూచుట నే నెఱింగితినిలే" యంటిని.

రంభ—తరువాత,

మేన—పిమ్మట నెచ్చెలి కోపము వహించి నేను చేలాంచలము పట్టుకొని ప్రతిమాలుకొనినను దిరస్కరించి వెడలిపోయెను.

రంభ—హృదయరహస్యము బట్టబయ లయినచోఁ గన్యకాజనము కోపించును గదా! కానిమ్ము. తరువాత,

మేన—అది మొదలు నెచ్చెలి పడు మదనవేదన యిట్టిదని వచించుట కయినను శక్యము గాకున్నది. అపుడా యవస్థంజూచి నేనూరకుండవలసి వచ్చెను. నేఁడుదయమున నాతోనైన జెప్పకయే తపనవనమున కేఁగినది. ఆ రాజర్షియును మృగయాప్రసంగమున నచ్చోటికే విచ్చేసెనని వింటిని, కావున మనమిరువుర మచ్చటికే పోయి సఖినూరడింతము.

రంభ—అట్లే

(ఇరువురును నిష్క్రమింతురు.)

{ అంతటఁ దూరగారూఢుఁడయి రాజు ప్రవేశించు చున్నాఁడు. }

రాజు—(సవితర్కముగా) ఆహా యేమిది! మృగజాతులకుఁ బరస్పర విరోధము స్వభావసిద్ధమైనను యిపుడు నాబాణంబులచేనయిన భయాతిరేకమున నిచ్చటఁ దపోవనధర్మము సంభవించి యట్టివిరోధమును శమింపఁ జేయుచున్నది. నాయీమృగయావ్యాపార మిపుడు ప్రవృత్తమై యుండ

చ. ఖరశరసంతతిన్ మిగుల ♦ గాసిలుచుం గరిశాబకంబు కే
సరిగుహలోనఁజొచ్చె, మృగి♦జంకివృకావళినాశ్రయించె, స

త్వరగతిఁ బాఱె వ్యాఘ్రసతి పజ్జనఁ జేరె వరాహకాంత, కా
సరములు కొంక కేశరభసంతతి మాటున డాఁగఁ జొచ్చెడిన్

నేనీమృగయాప్రసంగమునఁ బడి యతిదూరగతంబగు హిమాచలోపరిభూమిం జేరితిని. మఱియు నే నా పదవతంసకములఁ జూచినది మొదలు నన్నుఁ గూర్చి,

చ. ననవిలుఁ బూనితుమ్మెదలనారిఁ బదింబదిలాఁగి చూచుచున్
ధనువునఁ గూర్పఁగాఁ గుసుమనాళములన్ సవరించి, క్రుద్ధుఁడీ
మనసిశయుండు మూర్ఖమతి మైఁ జెలరేఁగి మదీయమానసం
బున గుఱిలేని యుత్సుకతఁ బూనిచె నీతనియాశ యెద్దియో.

పారాశర్యుఁడు కర్ణపూరముఁ దీసికొని వచ్చుటకు మత్తురంగవేగ మనుసరింపఁ జాలమి నించుక వెనుజిక్కె. కావున నే నిపు డేవినోదంబున నీ తమకమ్ముం గడపి పుచ్చుదునో తెలియకున్నది.

(నేపథ్యమున)

చంపకుఁడు, చంపకుఁడు.

రాజు—ఆహా! యిది పారాశర్యునికంఠస్వరమే!

{ అంతట భయముతో విదూషకుఁడు ప్రవేశించుచున్నాఁడు. }

విదూ—చంపకుఁడు, చంపకుఁడు. (భయము నిరూపించి) ఇట్టి భయస్థానమందు దుర్గాస్తోత్రమైనను రానినాకు రక్షాసాధనములగు బ్రహ్మసూత్రదండకాష్ఠములు రెండును నష్టములైనవి.

రాజు—వయస్యా! భయ మొందకుము. ఏమిది?

విదూ—(రాజును బట్టుకొని బాష్పగద్గదస్వరముతో) మిత్రమా! నన్నేమఱక రక్షింపుము.

రాజు—మిక్కిలి భయ మొందితివి. ఈనీభయమునకుం గారణ మేమి?

విదూ—(దిక్కులు పరికించి నవ్వుచు) నేను నీచెంతఁ జేరినమాత్రముననే నా శత్రువర్గము నశించినది.

రాజు—ఏమి శత్రువర్గమా!

విదూ—నే నింతవఱకు నింద్రజిత్తువలె వానరసైన్యపార్థివులతో మహాపరాక్రమమునఁ బోరాడి వచ్చితిని.

రాజు—(నవ్వుచు) నీపరాక్రమ మే నెఱింగితిని. సజాతీయబుద్ధిచే వానరములు నిన్నుఁ బీడించియుండు నని తలఁచెదను. ఇది యటుండ నిమ్ము. కర్ణపూర మెక్కడ?

విదూ—ఏమి కర్ణపూరమా! పరమ లుబ్ధుఁడవుగా నున్నాఁడవే. సర్వధనముం గోల్పోయి ప్రాణములమాత్ర మెట్లో దక్కించుకొని వచ్చితిని. మఱియు నా ప్రేమసార మగుకర్ణపూరమును దండకాష్ఠాగ్రమున జన్నిదముతో బంధించి తెచ్చుచుండ శత్రువులగు వానరులు నాపైఁ బడి బలాత్కారముగ లాఁగికొని పోయిరి.

రాజు—కట్టా! ఎంతప్రమాద మొనర్చితివి!

విదూ—మిత్రమా! కోపింపకుము. ఇంకను నీ కాపాడుకర్ణపూర మేటికి? దాని మూలముననే గదా దేవి మిక్కిలి కోపముఁ జెంది మఱల నెంతో ప్రయాసచే శాంతించినది.

రాజు—పోని మ్మింకనూరకుండుము. ఆ పాదముద్రలఁ జూచినది మొదలు నేనుత్కంఠచేఁ బీడింపఁ బడుచుండియు నీజిహ్వాచాపల్యమునకు వెఱచి నే మఱల వెల్లడింపనైతిని. ఇప్పు డెచ్చటనైన నొకవనప్రదేశముం జేరినఁ గాని నాకూరట గలుగ నేరదు, కావున వెదకుద మూరమ్ము.

విదూ—నీవు మృగములజాడ వెదకికొనుచుం జను నట్లు నేను నీమార్గము వెదకికొనుచు వచ్చుచుండి భృగుమహర్షి యాశ్రమపదమునఁ బ్రవేశించితిని. అంత నామహర్షి నాకు గొప్పకథ యొకటి వినిపించెను. దానినంతయుఁ బూసగ్రుచ్చినట్లు వచింపఁజాలను. కాని దానిసారము మాత్రము వినిపించెదను. ఇచ్చటి కుత్తరమునఁ గల్యాణవామన మనుపేరునఁ బుణ్యక్షేత్ర

మునియాలయ మొండుఁగలదు. పూర్వము భగవంతుని గూర్చి తప మొ
నర్చి సూర్యభగవానుఁ డిచ్చటనే త్రిలోకముల వెలిగించుశక్తి సంపాదిం
చెను. అదిమొదలాయరణ్యము తపన వనమను పేరునఁ బరఁగుచున్నది.
మున్ను త్రివిక్రమమూర్తియై విజృంభించిన వామనమూర్తి కరతలమునుండి
దానజల మిచ్చటనే పడినది. అది కరతలోదక మను పేర నొక సరస్సై
విలసిల్లుచున్నది. కావున నచ్చటికే పోదము రమ్ము.

రాజు—ఇట్లయిన జగన్నాథుని పాదకమలము లవశ్యము సేవనీయములు. కావున
రమ్ము. ముందు నడువుము.

విదూ—నడువుము నడువుము. (యిద్దఱుఁ బరిక్రమించుచున్నారు)

విదూ—వయస్యా! సర్వకాలరమణీయమగు నీవనమునం బ్రవేశించుటచే నాకు
దిగ్భ్రమయే గాక కాలభ్రమయు సంభవించినది. కావున నిప్పుడు జరుగు
చున్న ఋతు వెద్దియో నాకెఱింగింపుము.

రాజు—(సావధానముగ నంతటం జూచి) శిశిర వసంతముల మధ్యకాల మని తలఁ
చెదను. ఏలయన,

సీ. అవసానదశఁ జిక్కి ♦ నవసియున్న తుషార
సంతానమును జాల ♦ సరకుగొనక
యుదయార్కకిరణంబు ♦ లుద్ధతిం జెలరేఁగెఁ
గమలముల్ బహువికా ♦ సమునఁ బొదలె
విగతసూనములైన ♦ ప్రేంకణంబులయందు
నల్ల నల్లన నాస ♦ లెల్ల వీడి
యభినవంబుగఁ బూయ ♦ నారంభమగుచున్న
తరుణవంజుళలతా దర్శనమున
గీ. నమితసంతోషపారవ ♦ శ్యమునఁ బొదలి
నిజకటాక్షంబునకు దాని ♦ నెలవు సేయఁ

గోరి, తిరుగాడు మధుకరీ ♦ కులము లెల్లఁ
గనులకెంతయుఁ బ్రియములై ♦ కానఁబడెడి.

విదూ—(పరికించి యాశ్చర్యముతో) మిత్రమా! చూడు చూడు. ఇట్టివిచిత్ర
మెన్నఁడైనఁ జూచితివా? ముత్తెపుమొగ్గలను స్వేదబిందువులు లేఁగరు
వలితాఁకునఁ జలించుచుండ నీపసిండివన్నెలతాకన్యలు మదనపరవశలై
రతనంపువిరుల కన్నులతో నిన్నే చూచుచున్న ట్లగపడుచున్నవి.
ఇదియ తపనవనము గానోపు.

రాజు—మిత్రమా! చక్కఁగాఁ దిలకించితివి. ఇదిగో! యిచ్చట,

చ. ఇరవగు కెంపుసొంపు జిగి ♦ సీనెడి లేఁజిగురాకు వాతెఱం
దిరముగ నొక్కి నిచ్చిమొల ♦ దేఁటులఝంఝుము నాదసీత్కృతుల్
నెఱపుచుఁ దమ్మిమొగ్గచను ♦ నత్తపు రాపిడి యుప్పతిల్ల సు
స్థిరరతిఁ గల్పవల్లి తన ♦ చేవమావిని గౌఁగిలించెడిన్. 4

విదూ—స్వప్నమందైన నిట్టివిశేషము లెన్నఁడును జూచి యుండలేదు.
కావున మున్ను నీవు వచించినట్టు లాకాశగమనము గూడ నొకప్పుడు
తటస్థింపఁ గలదని నాకాశ వొడముచున్నది.

రాజు—(స్పర్శ మభినయించి) మన మిప్పుడు గోవిందమందిరము సమీపించి
నట్లున్నది. ఏలయన,

సీ. పరిసరంబుల నున్న ♦ సరసులందున నీఁది
మాలిన్యమును నీటి ♦ పాలొనర్చి,
మహిమాత్త ధూపధూ ♦ మమున నంగము వార్చి
ఘనసారరేణు సం ♦ గ్రహ మొనర్చి,
యరుణకేసరభార ♦ భరణకుంకుమసాంద్ర
రమణీయ వనవిహారములు సల్పి,
పరిమళంబున కాస ♦ పడి జేరవచ్చిన
యళికులంబుల నెల్ల ♦ నాదరించి,

గీ. శైత్య సౌభాగ్యలక్ష్మి హ • స్తంబు పట్టి
నాసికారంధ్రయుగళి వి • కాస మొంద
మనకుఁ గల్గిన మార్గశ్ర • మంబు నెల్ల
దూరముగఁ ద్రోలె నీ వన • మారుతములు. 5

(ఇద్దరుం బరిక్రమింతురు.)

విదూ—మిత్రమా! దేవమందిరముం జేరితిమి. లోపలఁ బ్రవేశించి నమస్కరింతము.

రాజు—(ప్రవేశము నటించి దోయిలి పట్టి నమస్కరింపుచు)

ఉ. మేనను జన్నిదంబు, మొల • మీఁదను జాతెడి ముంజి, [క్రొమ్ముడిన్
జానగుచూడ, జింక యజి • నంబు, బలిక్రతుసామగాన సం
ధానముఖంబుఁ, గన్నుఁగవ • తమ్ములు, గ్రాలఁబలాశదండముం
బూనిమహాశుచిత్వమునఁ • బొల్చెడివామనమూర్తిఁ గొల్చెదన్.

విదూ—లిఖితాక్షరంబగు నీజిహ్వామూలమున మాట లను పుష్పములతో దేవునిఁ బూజించితివి. అనక్షరవిభవుండనగు నే నన్నో సాధారణ పుష్పములు దెచ్చిపూజించెదను. (అని నిష్క్రమించును.)

రాజు—ఇపు డిచ్చట ననిర్వాణమాణిక్య దీపమాలాదూరీకృతగర్భ నిలయాంధకారంబును, జాంబూనదాకల్పకల్పితదివ్యవిగ్రహ వేషవిశేషంబును, సుధాసౌరభ సుభగసురతరు సుమనస్సంపాదిత భక్తివితానంబును నగు నీసపర్యాక్రమము దివ్యజనసంప్రాప్తిని సూచించుచున్నది.

{ అప్పుడు మన్మథవికారముతోఁ దపతి కూర్చుండియుండును. }

తప—(దీర్ఘనిశ్వాసముతో) మనోరథసిద్ధిఁ బడయఁ గోరి యెట్లో మానసమ్ముఁ గుదురు పఱచుకొని నే నిప్పుడే భగవానుఁడగు వామనమూర్తి పూజ

ముగించి వచ్చితిని. ఇపుడు సఖీజనమైన నాచెంత లేమిం జేసి యీ ప్రదేశము నిర్జనమై యున్నది. కావున స్వేచ్ఛానురూపకముగ సంకల్ప సంగసౌఖ్యము లాభవమైక మోహన విగ్రహునితో ననుభవించెదను.

(ధ్యానస్తిమితయై యుండును)

{ అంతట రంభా మేనకలు ప్రవేశించుచున్నారు. }

రంభ—సఖీ! నెచ్చెలి తపతి యెచ్చట నున్నది?

మేన—కరతలోదక తీరమండలి పటికంపుఁ జవికెపై యీపె కభిమాన మెక్కుడు. కావున నిపుడచ్చటనే యుండనోపు.

రంభ—అట్లయిన నచ్చటికే పోదము రమ్ము. (అని పరిక్రమింతురు.)

మేన—సఖీ! నెచ్చెలి యేమో యాలోచించుచు నించుకయైనఁ జలనము లేకున్నది. యీపె యాలోచన యెద్దియో!

రంభ—ఆహా! నెచ్చెలియొక్క యీదశ యపూర్వముగా నున్నది. కావున నిచ్చటనే దాఁగియుండి యీపె ప్రయత్నముం దెలిసికొని పోవుదము. (గోడచాటున దాఁగి యుందురు.)

{ పటాక్షేపమున విదూషకుఁడు ప్రవేశించుచున్నాఁడు. }

విదూ—వయస్యా! అశ్చర్య మాశ్చర్యము! విస్మయావహం బగు నొకసరోవరతీరంబున ఘనపటలఘననీభూతం బగు నొకయుద్యానసీమఁ జూచివచ్చితిని. పటికపు సౌధమున లక్ష్మిప్రతిమ లిఖింపఁబడి యున్నది. కావున త్వరితముగ విచ్చేసి తిలకింపుము.

రాజు—మూర్ఖా! నీర మెప్పుడును బల్లము ననుసరించి పోవుట స్వభావము. కావున స్థిరీభావము, నూర్ధ్వగమనంబును సంభవించు టెట్లు?

విదూ—కరతలగతామలకవిషయమై యింత వివాదమేల? ప్రత్యక్షప్రమాణమున సాధించెదను. నావెంటరమ్ము. (అని రాజును లాగుచున్నాఁడు.)

రాజు—ఇదంతయుఁ గేవలము నీమతిభ్రమ పరిణామమే యని తోఁచుచున్నది. అయినను నీయిష్టము నెఱవేర్చెదను. నడువుము. (ఇద్దరుఁ బరిక్రమింతురు.)

విదూ—ఇదిగో! యాసరస్సు! అవునా కాదా? దీనిఁ గూడ నేమైన భ్రమపడితినా?

రాజు—నిజమే యిది సరస్సే. భృగుమహర్షి నిర్దేశించిన దిదియే యని తలఁచెదను.

చ. నిలుకడఁ గాంచి మానికపు ♦ నేలపయిన్, సతతంబు ముత్తెపుం
బలుకులవోలు స్వచ్ఛతర ♦ వారికణంబులనిండి, నిత్యమం
గళకరమై, ముకుందుకర ♦ కంజతలంబునఁ గ్రాలు నట్టి భా
సిలెడిఁ గరోదకాఖ్యసర ♦ సీవర మిత్తరిఁ గూడఁ జిత్రమా. 7

విదూ—అయిన నింకొక భ్రమముఁ గూడఁ జూపుదునా! (పరిక్రమించి ముందరఁ జూచి) ఇదిగో! యాజలశైల మిది. చిత్తగు విది. ఇదియు సత్యమేకదా!

రాజు—మూర్ఖా! ఇదంతయు నసత్యము, ఇది స్ఫటికనిర్మితం బగు దివ్యజనఘోష్టి మండపము. నిర్మలస్ఫటికభిత్తులనుండి వెలికిం గానవచ్చుచున్నాత్మతేజఃపటలావృతం బగు నొకానొక దివ్యాంగనా రత్నమిది. (మరల సావధానముగఁ జూచుచు) ఆహా! లావణ్యాతిశయ విశేషంబుల కవధి లేదు గదా! ఈ పదార్థ విశేషమును సృజించుటఁ జేసి యాధునికబ్రహ్మ పూర్వసృష్టికర్తల జయించెను. ఏలయన,

ఉ. వాడక, మంచుచేఁ గలక ♦ వారక గ్రాలు పయోజలక్ష్మియై
వేఁడిమి వీడి స్వచ్ఛముగ ♦ వెల్గెడి దీపశిఖార్చియై పువుం
బోఁడుల సృష్టిలోనఁ దొలి ♦ మొక్కయునై యలరారు దీనినిం
బోఁడిగఁ జూచి, చిల్చికొనెఁ ♦ బుష్పశరుండు నిజాంతరంగమున్. 8

విదూ—ఆ పదవతంసకంబు లీలతాంగివైయుండునో యా లతాంగియు నిప్పుడు మన కగపడుచున్న యీలలనామణియు నొక్కతెయే యైనచో మిక్కిలి యనుకూలముగ నుండును.

రాజు—విధివిలసితంబు లెవ్వఁ డెఱుఁగును? ఇచ్చట దాఁగియుండి యీ లతాంగి స్వైరాలాపంబుల విని నిశ్చయింతము. (అట్లు చేయుదురు.)

తప—(విషాదముతో) ఛీ! కేవల మాత్మచ్ఛందమున నే నాతనిం జేరఁబోవుచు కన్యకాజన విరుద్ధముగాఁ బ్రవర్తించితిని.

సఖులు—భయముతో (వక్షంబునఁ జేయిడుకొని యొకరి నొకరు చూచుచున్నారు.)

రాజు—(చింతతో మరలి) మిత్రమా! అన్యాసక్తయగు వనితారత్నముపై నామనశ్చక్షువులునుఁ బ్రవర్తించినవి. కావున నిట నుండరాదు. పోవుదము రమ్ము.

విదూ—ఇంచుక వినుట మాత్రముననే యథార్థము గ్రహించుటకు బ్రహ్మదేవునికేనియు శక్యంబుగాదు. ఈ రమణీయమూర్తి నింద్యకర్మ మొనర్పఁ జాలదని నానమ్మకము. కావున నింకను కొంచెము విని పోదము.

తప—[నిట్టూర్పు విడిచి చూచి] సంకల్ప సంగము కూడదని యనవసరముగా నన్ను నే నేల యధిక్షేపించుకొంటిని?

సఖులు—(హర్షముతో) బ్రదికితిమి.

విదూ—మిత్రమా! వింటివా?

రాజు—(వెనుక మరలి) ఇంతమాత్రముననే నీ కూరట గల్గెనా? చూడుము.

ఉ. ఇమ్మగు ప్రేమచే యువకు ♦ నెవ్వనినో మదినిల్పి బొక్కు నీ
కొమ్మ మొకర్తు నా యెదుటఁ ♦ గూర్చి, యొకుమ్మడి పూవుటమ్ములం
జిమ్మ సుమాస్త్రి మోవ 'మను ♦ చీకటి నించుక లాలవంబు నా
నెమ్మదిఁ గూడ నేఁచు నెడ ♦ నిక్కమిదే ధృతి నాశ్రయించెదన్

తప—సఖీ! మేనకా!

మేన—సఖి నన్నుఁ జూచెనా యేమి?

తప—మేనక యెక్కడ?

మేన—ఋజుబుద్ధి యగు నీపై సంకల్పమే నన్నాహ్వానించుచున్నది.

రంభ—(ఈర్ష్యతో) ఈమదనసంభ్రమ మందైన నెచ్చెలి నన్నుఁ దలంపక పోయె.

మేన—మొదటినుండియు నీ వీవృత్తాంత మించుకైన నెఱుంగవు. నే నన్ననో కొంత యెఱుంగుదును. అందుచేత సఖి యట్లువలికినది.

తప—హృదయమా! ఏమిది హృదయ మెక్కడ నున్నది? (స్మృతి నభినయించి) ఓహో! యాసుకుమారుఁడు హరించెఁ గదా. దేవా! కుసుమాయుధా! నీ వన్ననో నన్నుఁ గారింప వచ్చితివి. నీశరంబులకు లక్ష్యభూతం బగు నాహృదయ మన్ననో సకలభువనైకనాథునిహస్తగతమై యున్నది. సమర్థుఁడ వైనచో నచ్చోటి కేఁగి పరాక్రమింపుము.

రాజు—(సాభిలాషముగా) ఏనిక్కై దీనికి యుత్తలపాటు సంభవించెనో యాతఁడిపు డిచ్చట సన్నిహితుఁడై యున్నచో జన్మవంతులలోఁ బ్రాగ్రేసరుఁడగును గదా. ఏలయన

చ. తలిరులవింటివానిశర ♦ ధాటి సహింపఁగ లేక దీనలై
వెలదులు తమ్ముఁగూర్చిపలు♦వించుచుఁబల్కు విలాపవాక్యముల్
వలనుగ విన్న యట్టియెలఁ♦బ్రాయపుఁ వారల నెమ్మనంబులన్
మెలఁగెడిసౌఖ్యసంతతికి ♦ మేళనమే చెలువుపైదనర్చెడిన్. 10

విదూ—అనుచితంపు టూహ లింకఁ జాలు నూరకుండుము. నిన్నే స్వీకరించుటం జేసి గదా భువనైకనాథుఁడని యామె వచింప సాహసించుట.

తప—(చింతతో) ఇంకెంత కాలము దుఃఖింతును? మనఃప్రియుఁడు సదా మనాత్మసవర్తియయ్యు నన్నుఁ గరుణింప కున్నాఁడు. యేదేవునను గ్రహంబున నే నుద్భవించితినో యట్టి యీకల్యాణధాముఁడు నాచే నారాధితుండయ్యు నన్ననుగ్రహింప కున్నాఁడు.

రాజు—(కరతాళము వైచి) అపుడు నేఁడెలకించిన యాదేవునిసపర్యావిధానకంతయు నీహస్తకౌశలమునఁ గలిగినదే.

తప—దుఃఖభాజనం బైనయీనాళీకేర మాతనికే యర్పించెదను. (బాష్పగద్గదముగా) అన్యోన్యదిక్కు లేనిదాన నైతిని. రంభామేనకల చరమపరిరంభణం బందకయే ప్రాణముల వదలుచున్నాను. (రేచుచున్నది)

రాజు—ఆహా! అతిభయంకర మతిభయంకరము! (సమీపింప నుంకించును.) పాపము శాంతించుఁ గాక!

సఖులు—(సంభ్రమముతో సమీపించి కన్నీళ్లతోఁ) సఖీ అమంగళము ప్రతిహతమగుఁగాక! అనేకకల్పాంతరములు మమ్మాలింగనముఁ జేసికొను చుందుము.

తప—ఆహా నెచ్చెలులా! (లజ్జనభినయించును.)

రాజు—(ఆనందముతో) మిత్రమా! యన్యాసక్త యగునేనిని నిజసఖులతోఁ గూర్చి దైవము మేలొనర్చె.

విదూ—వీరిసంభాషణమువలన నీపెయభిలాష స్పష్టము కాఁగలదు.

తప—(తనలో) వీరియాగమనముచే మత్సహోదరుఁడగు దండధరుని దర్శించుట తప్పిపోయినది. ఇప్పుడును జిత్తస్థైర్యమును విడువ కుందును గాక!

సఖులు—సఖీ! ప్రాకృతస్త్రీలమార్గ మనుసరించి నీవేల నిష్కారణముగా మరణింప నుంకించితివి? ప్రాణసమానలమగు మేము నీమనోరథముం దీర్పఁ జాలమా? నీయౌవనరూపవిభ్రమాదిగుణంబులకు లోఁబడని వాఁడీజగంబున నుండునా?

తప—ఈవచనంబులచే నన్నింక బాధింపకుఁడు. నాహృదయసంతాప మతిదుస్సహమై యున్నది. నన్నుఁ బట్టుకొనుఁడు.

మే—(పట్టుకొని స్పర్శ నభినయించి) అబ్బా! దీనియంగసంసర్గమునకన్న హుతవహోత్సంగ ప్రవేశము చాల సుఖకరము. (రంభం జూచి) సరస్సునుండి సరసీరుహపత్రంబులం దెచ్చి నెచ్చెలికి వీవుము.

రంభ—(అట్లు చేయును.)

మేన—నలినీపత్రసమీరమును లోనఁ జొరనీక స్తనాంశుక మడ్డగించుచున్నది. కావున దానిం దొలఁగింపుము.

తప—ఇది మఱుఁగులేని ప్రదేశముగా నున్నది. కావున నన్నెవరైన జూతురేమో శరీరము బయలు పఱచుటకు సిగ్గగుచున్నది.

మేన—అస్మన్మనోరథసిద్ధికి సంవరణసాన్నిధ్య మున్నదిగదా!

తప—(సంభ్రమముతో దిశలు బరికించి) ఎచట నెచట? నార్యపుత్ర—(అనునర్ధోక్తియందే లజ్జచే ముఖము వాంచి యుండును.)

మేన—(నవ్వుచు)—సఖీ! ఆ స్థానమునఁ దత్తరించెద వేల? ఈభిత్తి నుద్దేశించి సంవరణపద ముచ్చరించితిని. అంతియ కాని నీహృదయమున నున్న పురువంశప్రదీపకుఁడగు రాజర్షిని గూర్చి కాదు.

రంభ—అతిప్రమోషమగు దీనిమన్మథవికారము నన్ను ఖేదపరచినను యుచిత స్థానంబును జెందుటఁజేసి నేను సంతసించుచున్న దానను.

రాజు—(సాహసముతో) వినఁదగినవానిని వింటిని. హృదయమా! యిఁక నీ జనునియందు నిరాటంకముగాఁ బ్రణయప్రసారము వృద్ధిఁ బొందింపుము. మఱియు,

చ॥ సుమశర! మంజుపుష్పపరి ♦ శోభిహిమాద్రితరుప్రవాళబృం
దములఁ బటీరశైలపవ ♦ నమ్ములు పేర్చి కదల్చుఁ గాక! వం
తమున రణోర్వి నన్నెదిరి ♦ తాఁకఁగనీదానదోయి నిప్పుడే
భ్రమరవినీల-పుంఖసుమ ♦ బాణపరంపరనింపుమీ వెసన్

విదూ—ఈతన్వి తనయునిపేరి యగ్నికి సంభవస్థానమగు నరణిగా దైవముచే నీ కొడఁగూర్పఁ బడియె.

(నేపథ్యమున)

గీ. సాయపుంగృత్యముం దీర్చ ♦ సమయ మయ్యెఁ
గలుషముల నెల్ల తీర్థోద ♦ కములఁ బాపి

జలజమిత్రుని కర్ఘ్యపూ ♦ జనము సల్పఁ
ద్వారగ గన్నెరువిరులు, గం ♦ దమును దెండు. 12

సఖులు—(సంభ్రమముతో) సఖీ! లెమ్ము లెమ్ము. సూర్యోపస్థానసమయ మతిక్రమించుచున్నది.

తప—(తనలో) ఈయవస్థ తండ్రిజూచును గాఁబోలు. మన్మథశరనిపీడితసారంబులగు నీయంగములతో నే నెట్లు బోఁగలుగుదును? అయినను దైవాచార మనతిక్రమణీయము గదా? (ప్రకాశముగా) సఖులారా? అట్లే చేయుదము (అని అందఱు నిష్క్రమింతురు)

రాజు—అయ్యో! కష్టము. నామనోరథభూమి తిరోధాన మొందినదిగదా! ఆశనిదారుణమైన యీవాక్య మెవ్వఁడు వచించెనో! ఒకవేళ నానయన భాగ్యమునకిది యవసానదశ గాఁబోలు.

విదూ—అతిసమీపమున నున్న యీతపోవన మందలి ఋషులు లిట్లుద్ఘోషించిరి.

రాజు—(చూచి) మిత్రమా? ఈమార్తాండుని దివసదీక్షాధికార మవసాన మొందినట్లే యున్నది. ఏలయన,

చ. మూనితపద్మరాగమణి ♦ మండలతుల్యము లైన మేఘసో
పానములక్కదినేందిర యు ♦ పాంపతిఁ జేరఁదొడంగె; మల్లెపూఁ
దేనియతావులం జిలుకు ♦ తెమ్మెర సోఁక సరస్థచక్రవ
ద్మానన గుందఁ జొచ్చె విర ♦ హార్తిభయంబెదఁ గూఱి దీనయై

మిత్రమా? యిఁక నాచరణీయ మెద్ది?

విదూ—రాత్రుసభీతుఁడగు కులపతి భృగుమహర్షి మిమ్మచ్చటికిఁ దీసికొని రమ్మని నన్ను బ్రార్థించెను. కావున నచ్చటికే పోదము.

రాజు—మంచి దట్లే అవశ్యకరణీయము.

(అని యిద్దఱును నిష్క్రమింతురు.)

ద్వితీయాంకము.

సంపూర్ణము.

ఓం

తపతీసంవరణము.

తృతీయాంకము.

{ అప్పుడు హోమసాధనహస్తుండగు తాపస కుమారుండు ప్రవేశించుచున్నాఁడు. }

తాప—(విస్మయముతో) ఆహా? అద్భుతరసానుభావుండగు సంవరణసార్వభౌము పరాక్రమవిధాన మవాఙ్మానసగోచరము గదా! ఇపుడీతఁ డేదియో నొకమనస్తాపంబుచేఁ బీడింపఁ బడి కృశీభూతశరీరుఁడై యుండినను,

గీతమాలిక. అనలశిఖలను బోలు నీ ♦ తనిశరంబు
లద్రికాయుల నసురసే ♦ నాధిపతుల
బెడిదముగఁ దాఁకి, ప్రాణంబు ♦ లెడపుఁ గాఁక
శరమరుద్వేగమునఁ బడి ♦ చని చని తద
సురజనంబు లాశ్రమ బాహ్య ♦ ధరణి నెచటఁ
బడిరో చిత్ర మాదెలియ ది ♦ ప్పుడును గూడ. 1

"వత్సా కౌండిన్య! సంవరణశరంబులచే నిహతులయిన రాక్షసుల భార్యలాతనికిఁ బ్రత్యక్షంబుగఁ గీడు సేయ నోడి మాయలు గావింతురని తలఁచెదను. అట్టిమాయల నశింపఁజేయుట కొకతంత్రము గలదు. దాని నిప్పుడు నెఱవేర్ప వలసియున్నది. కావున నీవుపోయి కుశలు, సమిధలు, పుండరీక సంచయంబులును గొనిరమ్ము" అని గురుఁడు నాకాజ్ఞ నొసంగె. నిరతోపయోగముచే నాశ్రమసమీపప్రదేశము లన్నియు హోమసాధనరహితములై యుండుటఁ జేసి దూరారణ్యభూముల కేఁగి

నే నీయింధనభారముం దేవలసివచ్చె. అందుచేఁ బవలంతయు గడచి సాయంసమయము సంప్రాప్తమైనది. (నలుదిక్కులం జూచి) ఆహా? పక్షిజాతులకుఁ గూడ సంసారధర్మమత్యుచ్చమైనది గదా? ఇదిగో! యీసరస్సునందు,

సీ. సాముఱెక్కలు రాఁగ ♦ జలజపత్రములందుఁ
బొరలాడు నిజశిశు ♦ పుంజములను
లకుముకిగరిత ల ♦ ల్లవె పక్షములచేత
నొకచోటఁ బ్రోవుగా ♦ నుంపఁదొడఁగె,
కలువలతేనె రాఁ ♦ క సమీప మగుచుంట
నెఱిఁగి నెమ్మదిలోన ♦ వెఱపుఁ బొంది
నీరజాతముచాల ♦ నేర్పుమై దొరకొని
దళములనెల్ల బం ♦ ధన మొనర్చె.
గీ. అంత నొకభృంగసతి దాని ♦ చెంత కరిగి
లోన నిజకాంతుఁ డుండుట ♦ మానసమున
నెఱిఁగి తానును శయనింప ♦ నెంచి, మిగుల
దమకమునఁ దిరుగాడెడిన్ ♦ దానిచుట్టు. 2

(పరిక్రమించుచు ముందునకుం జూచి) ఓహో! సంరంభదూషితముఖకాంతిచే నున్న యీరాజర్షి వయస్యునిఁగూడి యిటే వచ్చుచున్నాఁడు. ఇది యాశీర్వాదసమయము గాదు. కావున నాశ్రమమార్గముం బట్టి పోయెదను. (అని నిష్క్రమించుచున్నాఁడు.)

(ఇది విష్కంభకము)

{ అప్పుడు రాజును విదూషకుఁడును ప్రవేశింతురు. }

రాజు...(సంరంభముతో) ఓరీ దురాత్మా! మన్మథచండాలా!

చ. దనుజబలంబు నస్త్రతతిఁ • ద్రచ్చిన నం దృణరీతి నెంచి, యు
ద్భ్వ తతనుతా తనుత్ర మని • భీకమునం జెలరేఁగె దీవు రు
ద్రనయనవహ్ని మగ్గికొని • ధైర్యమువంచనపై హరించు నీ
తనుతరశక్తులన్ వెదకి • తాఁకఁగఁజాలవె నాదు బాణముల్ 3

అయ్యో! ఛీ! యసంబద్ధప్రలాపము లాడుచున్నాఁడనే! నాపై విజృంభించుట కాతని కొకానొకప్పు డనుజ్ఞ నిచ్చియుంటిని గదా! కావున నీతని నిప్పుడనునయించెదను. భగవానుఁడా! యీయపరాధము సహింపుము. ని న్నిట్లు వేఁడుకొనుచున్నాఁడను.

చ. అలికులముల్ మకందరస • మాని తలంగిన లేఁతమావిపూ
వుల సిసుమంతయున్ నిలుపుఁ • బొందనిగందపుఁగొండగాడ్పులన్
గలుగదు సిద్ధినీకు మదనా! యింక నేర్పరి వైన నేయుమా!
కలువలకప్పు నేలు నల • కల్కిమిటారపు వాలుచూపులన్.

విదూ—(సనిర్వేదముగాఁ దనలో) ఆహా అతిఘోరముగ నున్నదే! మహావ్యాధి చికిత్సకుం గడంగిన దుర్వైద్యునిభంగి నే నీతనియనంగవ్యాధిం జూచి తత్తరపడు చున్నాఁడను. అనుచరసమూహంబుల నీతఁడు వెనుకకుఁ బంపుటం బట్టిమాడ నగరగమనవృత్తాంతముఁ బూర్ణముగ మానినట్లగపడు చున్నది. ఈయడవిలో నే నొక్కఁడ నేమి చేయఁగలను? కాని యిట్లు చెప్పి చూచెదను. (ప్రకాశముగా) మిత్రమా! నీయపూర్వవచనంబులు విన నాహృదయంబు తల్లడపడు చున్నది. కావున ధీరుఁడవై యుండుము.

రాజు—(తన్నుఁ దాను నిలువరించుకొని) మిత్రమా! నీవు వచించినది నిక్కమే. మాటలు మనశ్శక్తిమూలకములు. అట్టి మనశ్శక్తిని యాతన్వంగి నిర్మూలింపఁజేసినది. కావున ననాకులంబులై యెట్లుండును?

విదూ—(విషాదముతో) ఇట్లయినచో నిఁక శరణ మెద్ది?

రాజు—(దీర్ఘనిశ్వాసముతో) తదంగసంసర్గశ్లాఘనీయమగు స్ఫటికమండపము దప్ప వేఱేమి యుండును? కావున దారిఁ జూపుము.

విదూ—(ప్రత్యాశతో) రమ్ము. (ఇద్దఱుం బరిక్రమింతురు.) ఇదిగో! యీ మండపము. ప్రవేశింతము రమ్ము. (ప్రవేశింతురు)

రాజు—(మండప మంతటనుం జూచి విషాదముతో) ఆహా! వస్తుసంపద లస్థిరములు గదా! చూడుము,

ఉ. అంబుజగేహ లేని కల • శాంబుధి, యంబిక లేనిభస్మశు
భ్రంబగు శంభుమేను, సుర • వాహిని లేని తుషారవారగా
రంబగు శీతశైలమును • రాజిలనట్లు మదీయజీవితు
ల్యంబగు కాంత లేని తెలి • ఱా నెలవుం బొలుపేదియుండెడిన్

విదూ—పూర్వ మప్పద్మగంధి యధిష్ఠించుటం జేసి దివ్యపరిమళంబుల వెదజల్లుచున్న యీ ప్రదేశమును నీకు సహధర్మచారులగు మధుకరంబులు విడఁజాలక మూఁగియున్నవి. కావున నిచ్చటఁ గూర్చుండి పొద్దు బుచ్చికొనుము.

రాజు—మిత్రమా! అట్లు గాదు. మధుకరంబులు నా కెట్లు సహధర్మచారులగును?

చ. శరమనుకూలురైన నిజ • కాంతలు గానము సేయుచుండ నిరం
తరమును దమ్ముఁగొల్వఁగ మ • నఃప్రియభోగములన్ భుజించి వి
స్తరకుతుకంబుతోడ నిట • ధన్యతమై జరియించుచున్న బం
భరవరరాజితోడ సరి • వత్తునె యెన్నఁటికేని మిత్రమా!

(కూర్చుండి దాహవేదన భావించుచు) ఆహా విధివైపరీత్యము! సుఖోత్పాదనకై గల్పింపఁబడిన యీప్రదేశము నాకతిదుస్సహసంతాపమును గలుగఁ జేయుచున్నది గదా! మిత్రమా! నే నిఁకఁ దాళఁజాలను. కావున నీకరతలోదకమునుండి శిశిరవస్తువులం గొని తెచ్చి నాకు శయ్య నమర్పుము.

విదూ—అట్లే. (అట్లు చేసి) ఇంక బరుండుము

రాజు—(శయన మభినయించి ప్రక్కలం జూచుచు) అప్పద్మగంధికి శిశిర సమీరముం గల్పించుటయం జేదియుపకరించెనో యట్టి యీనళినపత్రంబుచే నన్ను వీవుము.

విదూ—(అట్లు చేయు చున్నాఁడు.)

రాజు—(స్మృతి నభినయించి నిట్టూర్పుతో) హా! ప్రేయసీ! ఈ నళినపత్రంబుచే వీచుచు నీనెచ్చెలి పయ్యెదఁ దొలఁగింపఁ బురికొల్పినను వినక నాలోచనంబులకు వైఫల్యము ఘటింపఁ జేసితివి. అట్లయినను,

చ. హిమమున నించుకంత తెలఁ ♦ పెక్కియొసంగు పసిండితమ్మితో
సమమయి గాలుచుంబయుఁట ♦ సందునడాఁగిననీ స్తనంబుపై
విమలశిలాప్రశస్తతర ♦ భిత్తి నిరోధముఁ ద్రోసిపుచ్చుచుం
దమకముసెందునాదునయ ♦ నప్రభ వేప్రసరింపలేదొకో ॥7

మిత్రమా! నళినీపత్రసమీరంబుచే మన్మథాగ్ని ప్రజ్వరిల్లినది. కావున నించుక విరమింపుము.

విదూ—మంచి దట్లే (విరమించు చున్నాఁడు.)

{ అంతటఁ దపతియు మేనకయు
నాకాశగమనమునఁ బ్రవేశింతురు. }

తప—(దీర్ఘనిశ్వాసముతో) చెలీ! హాస్తిపురసమీపమునకు వచ్చితిమా?

మేనక—(విషాదముతోఁ దనలో) నాప్రియసఖికి మదనోన్మాద మెప్పుడు శాంతించునో గదా! (ప్రకాశముగా) సఖీ! అచ్చట మన కేమి పని?

తప—(విస్మయముతోఁ దనలో) నే నేమంటిని! (ప్రకాశముగా) కార్తికేయావాసపరిసరారామ మతిరమణీయ మైనది గదా!

మేన—సఖీ! యిప్పుడతఁడు వేఱొకచోట

తప—అసంబద్ధము లాడెద వేల?

మేన—(నవ్వుచు) ఎవ రసంబద్ధము లాడునదియుఁ దెలియుచునే యున్నది.

తప—పిచ్చిదానా! అతనికిఁ జలనము కలదా?

మేన—అవును. కలదు.

తప—అనఁగా నీయభిప్రాయ మెద్ది?

మేన—నీహృదయగత మైనదెద్దియో యదియే.

తప—నాహృదయ గత మైన దెద్ది?

మేన—(నవ్వుచు) సంవరణమహారాజు.

తప—(రోషముతో) అన్యగతమనోరథుం డగునాతని నుద్దేశించి నన్నేల పరిహసించెదవు?

మేన—నేనుపరిహసించుచుంటినో లేక నిజమునే పల్కుచుంటినో నీహృదయమునకే తెలియును.

తప—పరిహాసమికఁ జాలును. భగవాఁడగు భృగుమహర్షి యాశ్రమమునకు మార్గ మెద్ది?

మేన—మన మాశ్రమపథమునకు బయలుదేఱ లేదు. రంభను మాత్ర మచ్చటికిఁ బత్తెంచి మనము తపనవనమునకు బయలు వెడలితిమి.

తప—ఓహో! తపనవనమునకా మనము బయలువెడలినది! అట్లయిన నావన మెచ్చటనున్నది?

మేన—(క్రిందికిఁ జూచి) ఇదిగో! స్ఫటికమండపముయొక్క శిఖర మగపడుచున్నది. కావున నింక దిగుదము. (దిగుట నభిన యింతురు).

{ అంతట బద్ధకర్ణపూరదండ హస్తయై
రంభ ప్రవేశించు చున్నది. }

రంభ—"భృగునాశ్రమంబునకుఁ బోయి యారాజర్షి యచ్చటికి వచ్చెనో లేదో తెలిసికొని రమ్మని నాకు సఖులు జెప్పి పంపిరి. అతఁడన్ననో ప్రదోషారంభమునే వయస్యునిఁ గూడి తపనవనాభిముఖుఁడై బయలు వెడలెను. కావున నేనును దపనవనమునకే పోయి సఖులం జూచెదను."

మేన—(చూచి) సఖీ! బద్ధకర్ణపూరదండముం బుచ్చికొని యిదిగో రంభ వచ్చుచున్నది.

రంభ—(సమీపించి) చంద్రికాదుకూలావృతంబగు నీప్రదోషము నిన్ను సౌఖ్యాంబుధి నోలలాడించుట లేదా!

తప—(నిట్టూర్పువిడిచి) నా సుఖవృత్తాంత మట్లుండ నిమ్ము. దీని నెచ్చట నుండి తెచ్చితివి?

రంభ—తపోవనమునుండి నేను మరలివచ్చుచుండ నెద్దియో యొక సహకార శాఖనుండి యిది నాముందటం బడియె. అప్పుడు నే నిది యేమియై యుండునోయని యించుక యోచించి పిమ్మట బుచ్చికొని వచ్చితిని.

మేన—(చూచి) సఖీ! ఇవిగో! యీ గాథాక్షరంబులు. అప్పుడు హస్తిపురంబున మనచేతినుండి జాఱిపడిన కర్ణపూరమిది. ఆరాజవయస్యుని ప్రమాదముచే నిట్లు జరిగియుండెనని తలంచెదను.

తప—(రంభను జూచి) సఖీ! ఇప్పు డాబ్రాహ్మణుం డెక్కడ నున్నాడు?

రంభ—(నవ్వుచు) ఈతపోవనమందే యెచ్చటనో యున్నాడు?

తప—(ఖేదమభినయించి) సఖీ! ఆకాశగమనాయాసము నన్ను బాధించుచున్నది. కావున నీస్ఫటికమండపమున విశ్రమింతము.

సఖులు—అట్లే చేయుదము. (ప్రవేశమునటింతురు.)

విదూ—(సంభ్రమముతో) ఏమిది! ప్రదోషారంభముననే ప్రభాతము సంభవించినదే?

మేన—(జనాంతికముగా) సఖీ! యిదిగో యీరాజర్షి బలితంపు సంతాపంబునంబడి శిశిరోపచారంబు లనుభవించుచుం బరుండియున్నాడు. మండపాభ్యంతరమును వెలిగించుచున్న నీప్రభాజాలంబులం జూచి భ్రమపడి యీబ్రాహ్మణుండు ప్రభాతమని పలవరించుచున్నాడు. కావున తిరస్కరణీ ప్రభావమున ప్రతిచ్ఛన్నలమై యుండి వీరివ్యాపారముం గని పెట్టుదము. (అట్లు చేయుచున్నాడు.)

విదూ—(విస్మయముతో) మిత్రమా! మఱల రాత్రివచ్చినది. ఈ రమణీయప్రదేశమున ఋతుసంకరంబువలె అహోరాత్రసంకరముగూడ కలిగినది. కారణమేమై యుండును?

రాజు—(సవిమర్శముగా) దివ్యజనముండుచోట నేమి విచిత్రముండదు? మిత్రమా! వీంచుట లే దేల?

విదూ—(భయముతోం దనలో) క్షణక్షణప్రవర్ధమానంబగు నీతనిమదనోన్మాదము నాకు భయముం గలిగించుచున్నది. (ప్రకాశముగా) మిత్రమా! నీకింతయు నేల? నీవె వీవ వలదంటివి గదా!

రాజు—ఈతప్పు నాహృదయమునది. హృదయమా! ఆ పద్మగంధి లభింపమిం జేసి నేను పరితపింతును గాక; నీ వన్ననో,

చ. ఘనతరలజ్జచే మొగము గ్రక్కున నంసమునందుం జేర్పజాం
బనమొనరింతునూత్నసతిం బట్టి, లతాలునం గౌంగిలింతు, నుం
త నలిగినట్టినీవి తరుణమ్మును వేంచి సడల్ప నేర్తు, వీ
వనయము శ్రోణిచక్రములయందు జరింతిక ఖేదమేటికిన్.

తప—(అసూయతోం దనలో) మదనా! యేమి నీయవివేకము? నాహృదయము భేదించి యతం డభిలషింపకపోయినను యాతని కర్పించితివి. చిరకాలమునుండి నేను ప్రార్థించుచున్నను యాతని హృదయము నాకభిముఖముగు నట్లు చేయంజాల కున్నాండవు. (ప్రకాశముగా) ఇతండు తన దేవింగూర్చి పరితపించుచున్నాండు. కావున మనకిట నేమి పని?

మేన—సఖీ! నీవు నూతనవే కదా! ఇతండు దేవీవిరహోత్కంఠుండు గాండు "నవవధు" వనుమాట నితండు వచించుచుండ నీవు వినియుండ లేదా?

తప—వింటిని. అయినను నావిషయ మేమున్నది?

రంభ—అందువలననే గదా సందియము. మఱల విందము.

విదూ—మిత్రమా! పద్మరాగ గవాక్షాంతరమునుండి ప్రసరించుచున్న యీచంద్రమయూఖములు నీ యనంగమోహమును బోంగొట్టుట లేదా?

రాజు—పుణ్యవిహీనుపట్లం బదార్థశక్తులు విపరీతములుగా మాఱునుగదా. చూడుము.

ఉ. పున్నమరేలఁ దోఁచి పరి ♦ పూర్ణకలాగ్రహణాభిరాముఁడై
వెన్నెలలీను నీతొగల ♦ విందు గురుండయి గూఢ హారపుం
జెన్నునఁ గ్రాల్ కరాగ్రముల ♦ చే నిది మంచిచెడ్డయుం
జెన్నఁగనీని చీఁకటుల ♦ నీరిక లెత్తఁగఁ జేసె నామదిన్.

తప—(తనలో) మూఢహృదయమా! అతఁ డన్యనామధేయ ముచ్చరింపక పోయిన మాత్రమున నే చావ నుద్యుక్తనై యున్న నా శోకదురాశఁ గల్పించి నివారించెద వేల?

రాజు—మిత్రమా! చూడుము నాయవస్థ. శయనించుటకుఁగూడ శక్తి చాల కున్నది.

విదూ—(విషాదముతో) మందభాగ్యుఁడనగు నే నేమి చేయుదును? కర్ణపూర మైన నున్నచో నీతఁ డొకించుక యూరడిల్లి యుండును. దానిం గూడ ప్రమాదవశంబున మర్కటంబులపాలు జేసితిని.

మేన—(అభిప్రాయగర్భముగా) సఖీ! నమ్మకలేనిదానా! నీయం దుదాసీనుఁడే యైనచో నీకర్ణపూరముచే నీతని కూరట గలుగు టెట్లు?

తప—తనదేవి ననునయించుచు "నీ యపరాధమున కద్భుతరసమే కారణ" మని హస్తిపురోద్యానమున నాతఁ డన్నవాక్యము నీవు వినలేదా?

మేన—చతురము లగునర్మోక్తులం దెలిసికొనుటకు నీ వింకను జిన్నదానవుగదా

తప—ఇది యటుండుఁ గాక "కేవలము విస్మయముచేత నే నాకర్షింపఁ బడితిని. వేఱు కాదు" అని విజనప్రదేశమందుఁ దనవయస్యునితో నీతఁడు చెప్పియుండ లేదా? ఇదియు నర్మోక్తియా?

మేన—పురుషు లతిగంభీరమానసులు గదా? తమనూతనచాపలము మిత్రులకడ గూడఁ మఱుఁగుపరుపఁ జూతురు.

రంభ—బ్రాహ్మణునివలన మన కీ కర్ణపూరము వచ్చుటనిశ్చయముగ దెలిసినది. కావున దీనిని దీనుఁడగు నావిప్రుని కిచ్చెదను.

(విదూషకునిముందుట వైచు చున్నది.)

విదూ—(చూచి విస్మయముతో) దండకాష్ఠయుక్త మగు జన్నిద పూరంబును దలఁపనితలంపుగా వచ్చి పడినవి. భీతము లగువానరము లెచ్చటనో డాఁగి యుండి దీనిం బడవైచి నట్లు దోఁచు చున్నది.

రంభ—పోరా! గ్రామీణకా! బ్రహ్మచారీ! నీవే కోతివి.

రాజు—(మందముగా దృష్టిఁ బ్రసరింపఁ జేయుచు) మిత్రమా? దీనిని నాయెదపై బెట్టుము. (విదూషకుఁడు దండకాష్ఠమునుండి విడదీసి కర్ణపూరము రాజు నెదపై నుంచును.)

మేన—సఖీ! యిప్పుడైన నమ్ముము.

రాజు—(తెలిసికొని తిరస్కారపూర్వకముగా) ఎవరి దీకర్ణపూరము? అవ్వల బారవైవుము. (విదూషకుఁ డట్లు చేయును.)

తప—[తనలో]అయ్యో చెడితిని గదా! [ప్రకాశముగా]ఇఁక నేమి విందును

మేన—కర్ణపూరము నీది కా దనుకొని యాతఁ డిట్లు బారవైచెన తలఁచెదను.

తప—[రోషముతో] పూర్వము "నీకర్ణపూరముచే నీతని కూరటకలుగు" నని చెప్పితివి. ఇప్పుడు "నీదికాదనుకొని పారవైచె" నంటివి. ఆహా! నీ కీతని యందేమి పక్షపాతము. [పోవ నుంకించును.]

రాజు— గీతమాలిక

నిర్దయా తపతీ ప్రియా! ♦

మేన—ఆత్మావమానినీ! పోదము రమ్ము.

తప—నీదుసంశయం బుడిగె నిప్పుడో హృద♦ యంబ! వినుము

రాజు—ఆర్తిఁ బొందెదఁ గదవె చం ♦ ద్రాతపమున

తప—దైవమ! హతాస్మి

రాజు—రవిజని ♦ దాఘమందు

తప—అలరుమా! హృదయమ!

రాజు—కల్వ ♦ కొలనుభంగి

తప—సుకృత మొనరింప నైతినో ♦ సకియ! నేను.

రాజు—[నిట్టూర్పు విడిచి దైన్యముతో] ప్రియా ! నీసఖి యుచ్చరించిన సంవరణశబ్దమున కర్థము వేరైనను నీవు,

చ. కలఁగినధైర్యవృత్తిమయిఁ గ్రాలుచు నల్లపు "డార్యపుత్ర" యం
చలికులవేణి! కొన్నియమృ ♦ తాంచితవర్ణములొప్పుమాటలన్
బలికితి గాదె? యిప్డుకరు ♦ ణామతి నాదగుగాత్రమందు నీ
లలితకరాంబుజం బునిచి ♦ ప్రాణములన్ నిలుపంగఁ బోలదే.

తప—(సాభిలాషముగా రోమాంచ మొప్పఁ దనలో) అమ్మయ్యో ! నేనే కదా యీతని కామమునకు హేతువు. [సంతోషవశంబున మూర్ఛిల్లుచున్నది.]

మేనక—[సహర్ష బాష్పగద్గదముగా] సఖీ ! మూర్ఛిల్లుము. మూర్ఛిల్లుము. నా కిష్టమే.

రంభ—[సంభ్రమముతో నాత్మగతము] సఖీ ! ఏమి నీమోహము ! [మేనకతో] సఖీ! నెచ్చెలి ఖేదమొందుటకు బదులు మూర్ఛిల్లుచున్నది. దీని నూరడింతము. [ఇద్దరు సమీపించి] ఊరడిల్లుము. ఊరడిల్లుము. ప్రియసఖీ ! [తపతి మూర్ఛఁ దెలిసి ప్రేమవిశాలములగు చూపులతో రాజుం దిలకించుచున్నది.]

రాజు—[అస్పష్టముగా] మిత్రమా !

క. కుదురుఁ దొలంగి మదసువులు
మెదలఁ దొడంగెడిని గళస ♦ మీపమున, సిదే
వదలెడి గాత్రము, నిఁక నా
సుడతి మదక్షులను బడెడి ♦ చో ప్పానరుపుమా! 12

విదూ—[తత్తరపడుచు నశ్రుగద్గదముగా] హా! చెడితిని. చెడితిని. నాయందు దైవోపక్రమ మిట్లు గాఁబోలు. [సత్వరముగా సమీపించి రాజునంగముల స్పృశించును.]

రాజు—హా ప్రియా! [అని యర్ధోక్తియందే మూర్ఛిల్లును.]

విదూ—[విషాదముతో] మిత్రమా! యూరడిల్లు మూరడిల్లుము. [మఱలఁ జూచి విషాదముతో] మిత్రుఁడు గతించెనా యేమి! [తలఁ గొట్టుకొనుచు] హా! వయస్యా! సకలధరామండలైకనాథా! హా! మదకారణబద్ధస్నేహా! సర్వకాల సహచరుఁడును బాలమిత్రుఁడును ననన్యశరణ్యుండను నగు నన్నేల విడనాడి పోయెదవు? దీర్ఘాయుష్మంతుండును వంశకరుండునగు పుత్రునిం బడయు మని యాశీర్వదించిన సిద్ధదేశికుల వాక్యముగూడ వ్యర్థ మయ్యెనా? ఇఁక విలాపముతోఁ బనియేమి? భృగుపతనమునఁ బ్రియమిత్రు ననుసరించెదను. [నిష్క్రమించుచున్నాఁడు]

తప—(ఖేదమోర్వఁ జాలక భూమిపైఁ బడుచు) ఆహా! ఆర్యపుత్రుఁడు నన్నే పలవరించి గతించెను. ఆర్యపుత్రా! నేనును వచ్చుచున్నాను. ఇంచుక నిరీక్షింపుము. (మూర్ఛను బొందుచున్నది.)

సఖులు—(సంభ్రమముతోఁ దొడపై నునిచికొని) ప్రియసఖీ! యూరడిల్లు మూరడిల్లుము.

తప—(ఊరడిల్లి) సఖులారా! పతివధపాపమలీమస నగు నన్ను ముట్టకుఁడు ముట్టకుఁడు. పరలోకగతుఁ డగు నాతని ననుసరించుటకు నాకు సెలవిండు.

రంభ—(చింతించి) సఖీ ! ఆహా యేమి మనదౌర్భాగ్యము ! నీ కరకమలసంసర్గమభిలషించి యీమహారాజీయవస్థఁ బొందెను. కావున నీతని హృదయంబుపై శీఘ్రముగ నీ కరకమలముంచుము. ఇదిగూడ విఫలమైనచోఁ బిమ్మట నందఱ మొక్కసారియే పోదము.

{ తపతి సత్వరముగా సమీపించి తిరస్కరిణి నపనయించి
ససాధ్వసకంపముగా నతనియురమునఁ
గరతల మిడుచున్నది. }

రాజు—(శీఘ్రముగా లేచి చేయి వెనుకకు దీయుచుండఁగాఁ దపతిఁ జూచి)

గీ. నన్ను బ్రదికించుటకు నీవు ♦ నాయురమున
నిడినయీసుధాపూరంబు ♦ లెసఁగుఁబాణి
వెనకకుం దీయఁ బోకుమీ ♦ వినుతగాత్రి!
మత్కరంబున నునిచి స ♦ మ్మదముఁ గూర్పు. 13

(గ్రహింప నుంకించును)

{ తపతి లజ్జతో సఖులఁ దిర్యగ్దృష్టులం జూచుచున్నది. }

మేన—(రాజును సమీపించి) మహారాజా! త్వరపడకుఁడు త్వరపడకుఁడు. ఈమాప్రియసఖి త్రిలోకప్రదీపకుండగుభానుని పుత్త్రి. భగవతియగు సావిత్రికిఁ జెల్లెలు. పేరు తపతి. భాను సంకల్పము గూడ నల్లుడు మహారాజుగారనియే కావున దేవు నారాధించి యీపెకరగ్రహణ మొనరింపుము. నీ యవస్థం జూచి నీచెలికాఁడు నిరాశఁ జేసికొని భృగుపతనమునకై వెడలిపోయెను. కావున శీఘ్రముగఁబోయి నాతని రక్షింపుము. మేము పోయివచ్చెదము. పునర్దర్శనమగుఁ గాక. (సఖులతోఁగూడ తపతి నిష్క్రమించును.)

రాజు—(సంభ్రమముతో మండపము నిర్గమించి పోయి) ఎక్కడెక్కడ నా చెలికాఁడు?

విదూ—(ప్రవేశించి) స్నానసంశుద్ధుఁడ నగు నేనిఁక గర్తవ్యమునకుం గడంగెదను.

రాజు—(శీఘ్రముగ సమీపించి) సాహసింపకు సాహసింపకు. ఇదిగో! నేను ప్రాణములతో నున్నాఁడను.

విదూ—(విని సంభ్రమముతో) ఎచ్చట నెచ్చట నున్నాఁడవు? బాష్పాంధదృష్టినగు నేను నిన్నుఁ గనఁజాల కున్నాఁడను. (కౌఁగలించుకొని యేడ్చుచు) ఈజన్మమునందే మరలనిన్నుఁ గౌఁగిలించుకొను భాగ్య మొదవె.

రాజు—మిత్త్రమా! దుఃఖింపకుము. వ్యసనాంబుధిం గడచితిమి.

విదూ—ఎట్లు?

రాజు—ఇట్లు—(అని చెవిలోఁ జెప్పును.)

విదూ—(హర్షముతో) దైవకృప నీయందుఁ బూర్ణముగ నున్నది. ఇఁక మనము చేయవలసినదెద్ది?

రాజు—వేఱెద్ది గలదు?

గీ. ప్రణతవత్సలుఁ డైనట్టి ♦ పద్మహితుఁడు
క్రియల నెద్దాన మిగుల సం ♦ ప్రీతి నొంది
తనయ నివ్వక వెఱవు లే ♦ దని దలఁచును
యట్టిపని నిష్ఠతో లుదాత్త ♦ నాచరింతు. 14

(అని నిష్క్రమింతురు.)

తృతీయాంకము.

సంపూర్ణము.

శ్రీ

తపతీసంవరణము.

చతుర్థాంకము

{ చేటి యొకగిన్నెం జేతం బట్టుకొని ప్రవేశించుచున్నది. }

చేటి— "సఖీ! సౌగంధిక! తమ్మిమొగ్గలారగింపని పూదేనియలం గొనిరమ్మా" అని భర్తృదారిక నాకాజ్ఞ యొసంగి యున్నది. కావున నిచ్చట వెదకెదను. (పరిక్రమించి చెట్లపై దృష్టులు నిగుడ్చి) ఈ కల్పలత యందలి బంగారు తామరమొగ్గ యూతికడ నించుక విరిసి నట్లగపడు చున్నది. అందుచే నిందు మధుకరములకుం ప్రవేశము దుష్కరము. కావున దీనిని గ్రహించెదను. (అని గ్రహించుట నటించును) ఆహా! యేమి యీ మధుపేశలత! అపుడే గిన్నె దాదాపుగా నిండవచ్చినది. (మరియొకచోం జూచి) ఈ మందారవృక్షము నందలి కనకకర్ణికార కుసుమము వికసించి యున్నను లేమావిచిగుళ్ళు కప్పియుండుటం జేసి మధుకరముల కిచ్చటంగూడ ప్రవేశము దుష్కరమె. (అని కొమ్మ వంచును.) (అంత నాకాశయానమున జరణి పట్టుకొని మఱి యొక చేటి ప్రవేశించుచున్నది.)

చేటి— ఇది తపనవనము. ఇచ్చట దిగియెదను. (దిగుట నభినయించి ముందు నకుం జూచి) ఓహో, యిది ప్రియసఖి యగు సౌగంధికా! సఖీ సౌగంధిక! యిచ్చట నేమి జేయుచున్నావు?

ప్రథ— (చూచి) ఓహో జాంబూనదికా యిది! సఖీ! రతిపూజకుం బూం దేనియలు సంగ్రహించుచున్నాను. నీ విప్పు డెక్కడనుండి వచ్చితివి?

ద్వితీ— దేవు నుద్దేశించి మహారాజుగా రెప్పుడు తపస్సుం జేయ నారంభించెనో యప్పుడు భగవతి యగు యమునాదేవి చెంతకు భర్తృదారికయొక్క కుశల వృత్తాంత మెఱింగించుటకై నేం బోయి యుంటిని.

ప్రథమ— తరువాత,

ద్వితీ— అక్క యగు యమునకుం త్రైలోక్య మాల్యామరూప మగు హార మొకటి గలదు. దానిని తా ధరించుకొని గంగాహర సేవనార్థమై కైలాసమున కేంగుచుం దా మరలి వచ్చుదాంక వేచి యుండి దానిం గొనిపోయి భర్తృదారిక కిమ్మని నన్నింతవరకు నామె నిల్పినది. ఇప్పుడు నే నాహారముం దీసికొని వచ్చితిని. కావున నిచ్చట జరిగిన వృత్తాంత మంతయు నాకెఱింగింపుము.

ప్రథమ— చెప్పెదను వినుము. మహారాజుగారు ద్వాదశవాసరనియమమును బూని యుండంగా భగవానుండగు వశిష్ఠుం డాతనిని నియమమునుండి నివర్తింపం జేసి భర్తృదారిక నడుగుటకయి భగవానుండగు సూర్యుని కడ కేంగెను.

ద్వితీ— తరువాత,

ప్రథమ— పిమ్మట భగవానుండగు రవి యనుమతంబున మహర్షి భర్తృదారికం గొనివచ్చి మహారాజుగారి కిచ్చెను. పిమ్మటం గొన్నిదినంబులకు గర్భముం దాల్చి కుమారనిభుండగు కుమారుం బ్రసవించినట్లు భర్తృదారిక యొక స్వప్నముం గనెను. ఇచ్చట జరిగిన వృత్తాంత మిది. (అని గిన్నె లోపలం జూచి) ఇప్పుడీగిన్నె నిండియున్నది. కావున నిఁక భర్తృదారిక కడకుం బోవుదము రమ్మా.

(అని యిద్దరును నిష్క్రమింతురు)

{ అంతట రాజు లలిత వేషధారి యై విదూషకునితోం బ్రవేశించును. }

రాజు— (స్మృతి నటించి యానందముతో) ఆహా! మన్మథవ్యాపారములు మరవశోధరసాగరములు గదా! అట్లే,

సీ. తెం పొకింతయు లేక ♦ తెలుప హస్తం బొడ్డి
పైకొనం బోవ తోం ♦ బ్రతిఘటించు
ప్రారంభమున నైనం బ్రతి ♦ షేధజల్పముల్
శారదాబ్జాలోక ♦ సల్పుచుండు
లజ్జాభరముచే వి ♦ లాసానురాగముల్
పల్లవాధర బయల్ ♦ బఱుప వెఱచు
రతివాంఛ గారింప ♦ రమణీశిరోమణి
మదిలోనె నిరతంబు ♦ మలంగుచుండు
గీ॥ నీవి సడలింపనీయదు ♦ నీలవేణి
యిట్లు ప్రతికూలరీతిం బ్రా ♦ చేయు కేళి
నటిప జరియించినను గూడ ♦ నట్టిరతిని
మఱువ వాంఛింప దింత నా ♦ మానసంబు.

విదూ—అట్లయినం గామరసమును భోజనరసమును నొకజాతిలోనివే. భోజనరసమును గామరసమువలె దుఃఖలబ్ధమైనపు డిచ్చునంత సుఖమును సుఖలబ్ధమైనపుడీయంజాలదు. ఈవిషయ మేల పోనిమ్ము. అద్దమువలె నీదృష్టిని జక్కంగాం దుడిచి నాయీలలితబ్రహ్మవర్చస్సౌభాగ్యరూపముం జూడుము. ఇదిగో బంగారు జన్నిదము చూచితివా? దీనినొకసంతానవృక్షమునుండి గ్రహించిధరించితిని. ఇంకొకదానినుండి యీహేమదండకాష్ఠము సంపాదించితిని. ఒకానొకవానరము నా బ్రహ్మసూత్రమపహరించుటం జేసి నే నింతవఱకును మనస్సున బ్రహ్మసూత్రసహాయమున నిత్యకర్మల నెఱవేర్చుచుంటిని. ఇదిమొద లింక యథావిధిగా ననుష్ఠాన మొనర్చెదను. (రాజుముఖముం జూచి) ఓహో! నేను కనులు మూసికొని మాటలాడుచున్నాడను. నీ వెద్దియో విచారమాలోచించుచుండ నే నెద్దియో ప్రేలుచుంటిని.

రాజు—చక్కంగా వచించితివి. ఈసఖీవియోగమునం గేవలము హృదయమే కాదు పరితపించుట,

క. స్తనకల, శాంగా, ధరములం
గనం జాలమి నాయురంబుం ♦ గనులు వదన మా
వనితావియోగవిక్లబ
తను ద్రుటియును నైంపలేక ♦ తలంకెడిని సుమీ!

విదూ—వివాహమునకుం బూర్వము సంగమమో సంగమమో యని యొకయేడుపు. ఇప్పుడు సమఱల విరహమో విరహమో యని యీయేడుపు. కావున నీకు సంసారబాధ చాలదుస్సహముగానున్నది. (చెవియొగ్గి) మిత్రమా! పరితపింపకుము. కలహంసనాదము కమలసామీప్యమును సూచించునట్టులీనూపురధ్వని దేవిగారు సమీపగతయైనట్లు సూచించుచున్నది.

{ అంతం దపతియు మేనకయు సపరివార సహితముగా బ్రవేశింతురు. }

తపతి—సఖీ! నే నతిసాహస మొనరించితినిగదా! కైసేతసందడింబడి యార్యపుత్రునిం జూడక యీకాలము వేయి యుగములనువలె గడిపితిని. అలంకారమైనను ముగియకున్నది. పోనిమ్మట్లయినను సరే యార్యపుత్రుని దర్శనోత్సవమునకై నాహృదయము త్వరపడుచున్నది. కావున నార్యపుత్రుండిప్పుడెక్కడ?

మేనక—ఈకరతలోదకతీరమునందలి మందాకలతామండపమునందు చెలికానితోం గూడి కూర్చుండి యిటే చూచుచున్నాడు. కావునరమ్ము. ఇటు నిటు.

(పరిక్రమింతురు.)

రాజు—(తపతింజూచి విదూషకునితో) మిత్రమా!

గీ. అరుణబింబాధరమ్ము నైదె ♦ నావనీజ
భవమనోజ్ఞాంశుక హారిత్వ ♦ భానిచయము

వరుణమృదుకరము లమర ♦ గురుపరిజన
సంగతయువోలె దరిసె శు ♦ భాంగి దేవి.

తపతి—(సమీపించి) జయ మార్యపుత్రా!

మేనక—జయము మహారాజా!

(నమస్కరింతురు.)

రాజు—(లేచనెత్తి తపతింజూచి)

గీ॥ అంగముల నెల్లఁ బ్రసరించు ♦ నట్టినీదు
స్తనభరస్పర్శయ నెడి సు ♦ ధారసంబు
గ్రాలఁ, దనుమధ్యనన్నిటు ♦ గౌఁగిలించి
ప్రమద మొసఁగుమునా దుగా ♦ త్రములకిపుడు.

(అని కౌఁగిలించి) సఖీ మేనకా! యాసన మలంకరింపుము.

మేనక—చిత్తము మహారాజా!

(అందఱును గూర్చుందురు)

రాజు—(మేనకం జూచి) నెచ్చెలి రంభ రాకున్న దేల?

మేనక—మహారాజా! యెద్దియో కార్యాంతరమున భగవతియగు సావిత్రికడ కేఁగినది.

విదూ—(తపతీముఖముంజూచి సంభ్రమముతో) మిత్రమా! అనుచరసమూహంబులతోఁగూడ చికిత్సకులుం జనిరా?

రాజు—ఇపుడు చికిత్సకులతోఁ బని యేమి ?

విదూ—దేవిగారికి పాండురోగము సంభవించినది. పూర్వము కామోద్రేకమని చెప్పుటకు వీలుండెను. ఇపుడు నినుఁగలసి యుండియు దేహమెల్ల పాండురమై యుండ నేల?

రాజు—వ్యాధి విశేషము లెఱుంగుటకు నీకంటె సమర్థుఁ డెవ్వడును లేఁడు. మూర్ఖా ! ముక్తాహారకాంతులం జూచి నీవు భ్రమించుచున్నాఁడవు.

విదూ—(నిరూపించి) సరే నిజమే (మేనకం జూచి) అమ్మా మానుష చాపలమునకన్న బ్రాహ్మణచాపలము రెండు మడుంగు లధికముకావున నిన్నొకటి యడుగఁ దలఁచితిని. దయచేసి యానతిమ్మా. ఈవిస్మయనీయమగు హార మెక్కడ నుండి వచ్చినది.

మేనక—పాంచజన్యమున జనించిన ముత్తియములచే రచియింపఁ బడిన యీ హారమును ముకుందుఁ డాత్మచరణ సంభూత యగు గంగాదేవికిచ్చెను. ఆమె దానిని తన సఖియగు యమునకిచ్చెను. యమునాదేవి తనచెల్లెలగుతపతికిం బుత్తెంచినది. అది యీ హారము.

రాజు—భానుతనయా ! యీ హారము చిరకాలమునకుఁ దన కుచితమైన స్థానమును బొందినది. మఱియును,

చ. స్తనసరసీరుహంబులకు ♦ దగ్గరచుట్టము నాఁగనొప్పు నీ
ఘనసితహారకాంతిఝుర ♦ కాండము కోకిలఘతుమూలరీ
తి నసితమౌ నభమ్మున ♦ నతిస్ఫుటమై విలసిల్లుచుం బయో
ధినిఁబ్రసరించు దైవతన ♦ దీఝురకాండముభంగిఁదోఁచెడిన్.

(నేపథ్యమున)

గీ. తేనె, సుమములు, ధూపముల్, ♦ దీపవితతి,
గంధ మాదిగ నుచితోప ♦ కరణము లివె
చేర్పఁ బడియెను రతిపూజ ♦ సేయఁ దఱి యి
దే యనుచు వేగ దేవికిఁ ♦ దెలుపవలయు.

తపతి—హా ! (అనిస్మృతి నభినయించును.)

రాజు—సఖీ మేనకా ! యిదియేమి ?

మేన—మహారాజా ! చిత్తగింపుడు. దేవరవారి సంగమమునకుఁ బూర్వముభగవతియగు రతీదేవినిఁ గూర్చి నెచ్చెలి ప్రార్థించి 'ఆర్యపుత్రునిసంగమము నాకెప్పుడు లభించునో యప్పుడు మధుకరము లానని పూఁదేనియలు నీకు సమర్పించెదను' అని చెప్పెను. సంగమ సుఖలోలయై సఖియింత

వలెను నావిషయము మఱచినది. అందుచేతనే యీయారంభమంతయు.

రాజు—(తపతి ముఖముం జూచి నవ్వుచు) ఈ యారాధనక్రమము చాల లలితమైనదే. కాని యందించుక విపరీతము గూడ నున్నది.

చ. వరనిచయప్రదానగుణ ♦ వారవిభాసిని వేట నిన్నె తా
వరముల నిచ్చుకుందగిన ♦ వానిని వేఁడుటబోలుఁ గాని యా
త్మరమణు నీశనేత్రజని ♦ త జ్వలనంబునఁ గోలుపోయి దు
స్తరపరితాప మొందురతి ♦ తానొడఁగూర్చునె నీకుఁగోరికల్

తపతి—ఆర్యపుత్రుని ముఖము సరసోక్తులకు నివాస భూమియే కదా!

మేన—ఇంకఁగాలక్షేపము సేయుట తగదు. కావున మహారాజుగారనుజ్ఞ నిత్తురు గాక.

రాజు—ప్రియా! సరే నీసఖీప్రణయము నిర్వర్తించికొనుము.

విదూ—మంచిదే యాశీర్వచనకాల మెప్పుడు తటస్థించునో యప్పుడు బ్రాహ్మణుఁడు సంపన్నుఁడని తలంపవలసినదే.

మేన—మూర్ఖా! ఈవిషయమున నీ ప్రచారమే మున్నది?

(రాజు ముఖమునుండి దృష్టుల నెట్లో వెనుక మరల్చి పరివారముతోఁ గూడ తపతి నిష్క్రమించుచున్నది.)

రాజు—వయస్యా! కాంతా వియోగముచేఁ బాఁడరియున్న యీ కాలమిప్పు డేవినోదములచేఁ గడపి పుచ్చుదును?

విదూ—(నిర్వేదముగా) నిర్మానుష్య మగు నీజ్ఝాటవీమధ్యమున వినోద మేముండును? కావున నొక్క విషయము మాత్ర మాలోచించుకొనుము. రాక్షసులయొక్కయు వ్యాఘ్రములయొక్కయు నోటఁబడకుండ తప్పించుకొనినప్పుడు మాత్రమే సంతానవృక్షములఁ జుట్టుఁ దిరిగి భిక్షమెత్తుకొనుటకు మనకు వీలగును.

[అంత భీషణవేషముతో రాక్షసి ప్రవేశించుచున్నది.]

రాక్షసి—(సరోషముగా)

గీ. మిగుల రోసంబు నాకిదే ♦ మేఱమీఱ
మాయలను ఘోరదండసం ♦ పాతములను
గ్రూరుడగు సంవరణుని శ ♦ రీర మిపుడు
బ్రద్ద లొనరింతు సలిలకుం ♦ భమును బోలె. 8

సంవరణుని బాణములచేఁ బ్రాణంబులుఁ గోల్పడిన రాక్షసుల బంధుగులందఱు నన్నుఁ జేరి "సఖీ మోహినికా! నీమాయాబలముచేత నెట్లయిన ఋషికుల శరణ్యుండును, రాజాపశదుండును నగు సంవరణునిఁ బట్టికొనిపోయి సముద్రమధ్యమునఁ బడఁద్రోసి చంపుము" అని యిపుడు నన్ను సవినయముగాఁ బ్రార్థించిరి. నానూర్గురు సుపుత్రులాతనిచే మడియుటం జేసి నాకును గ్రోధముగ్గలమై యున్నది. కావున నా సఖులయొక్క నియోగము నెఱవేర్చుటకు నిశ్చయించుకొంటిని. ఇఁకనిచ్చట వానిని వెదకెదను. (పరిక్రమించి చూచి) యిదిగో! యెవఁడో యొక బ్రాహ్మణుంగూడి యీసంతానమండపమునఁ గూర్చుండియున్నాఁడు. (చెలిమలు నాకుచు) ఈబ్రాహ్మణుం దినఁగోరి నాదంతములు కరకర లాడుచున్నవి. నోరూటలూరుచున్నది. ఏమిది! ఈమహానుభావు నెదుటి కేఁగుట యటుండ నావిషయమును దలఁపెట్టుటకైన సాధ్యము గాకున్నది. ఇఁకఁ దినుట యెట్లు సంభవించును? కావున నిట్లొనర్చెదను.

(అతిరమణీయరూపయై రాజును సమీపించుచున్నది.)

రాజు—(చూచి విస్మయముతో) మిత్రమా! చూడు చూడు.

గీ. దిబ్బపిఱుదులు నెఱికొను ♦ గుబ్బచనులు
వెడఁదకన్నులు నసియాడు ♦ వేనలియును
గ్రాల, మరుడను విలుకాని ♦ కోల యనఁగ
వచ్చె నెటనుండియో యొక్క ♦ వస్తువిటకు. 9

విదూ—ఈ యరణ్యమున వంచనశీలరగు స్త్రీలు ప్రచ్ఛన్నవేషమునఁ జరించుచుందురు. ఇదెద్దియోనాకుఁ దెలియకున్నది.

రాక్షసి—(విని విషాదముతోఁ గంపము నొందుచు) వంచనశీలతను చున్నాడే. యిదియెట్లు? ఈతఁడునన్నుఁ దెలిసికొనెనా యేమి? నామనోరథము భస్మీభూయమాన మయ్యెఁగదా?

రాజు—అట్లనకుము. కాంతలందరును విప్రలంభశీలరే యగుదురా?

రాక్షసి—(హర్షముతో) దైవవశమున నన్నుద్దేశించి యితఁడీమాట ననలేదు (సమీపించి) జయము మహారాజా!

రాజు—పూజ్యురాలవగు నీకు స్వాగతము. నీవెవరు? ఇచ్చటికరుదెంచుటకుఁ గారణమేమి?

రాక్షసి—చిత్తగింపుడు మహారాజ! చిత్రరథుఁడనుగంధర్వరాజునకు గగనమాలయాని యప్రతిమానసౌందర్యరాశియగు నొకకూఁతురుగలదు. నేనామె సఖిని. సుమనావతియనుదానను. అనేక దేవాసురసంగ్రామవిజయులగు దేవరవారిగుణగణములను విని మిముజూచువేడ్క హృదయంబునఁ జివురొత్త నాసఖినన్నుఁగలసి హస్తిపురమునకొకప్పుడువచ్చియుండెను.

రాజు—తరువాత,

రాక్షసి—అనంతరము కార్తికేయావాసపరిసరారామమున నాసఖియొక్క పాదచిహ్నములను గాముతేఖను గణ్ణపూరమును దేవరవారనురాగపూరితములగు దృష్టులతోఁ జూచుచుంటిరి. అదిగని నాసఖి నెమ్మనమున నుమ్మలికంబొంది పితృపరాధీనయగుటంజేసి చేయువదిలేక తన నగరమున కేఁగెను.

రాజు—(విదూషకునితో జనాంతికముగా) మిత్రమా! పాదచిహ్నములయొక్కయుఁ గర్ణపూరముయొక్కయుఁ బరిణామమిట్టిది. తెలిసినదా?

విదూ—సరే కానిమ్ము. మరల నిప్పుడధికమ్ముగఁ గమ్మతావు లెటనుండియో వచ్చి ఘ్రాణేంద్రియములకు బర్వ మొనర్చుచున్నవి. కావున మఱికొందఱు దివ్యకన్యలు నిన్నుఁగామించుటకు వచ్చుచున్నారని తలంచుచున్నాఁడను.

రాజు—(రాక్షసింజూచి) తర్వాత,

రాక్షసి—ఇప్పుడు నాసఖి దేవరవారిసంగమసుఖము తనకు సంభవింపదని దలఁచి భృగుపతనమునకు సిద్ధమాయెను. అప్పుడు నేనాశాజనకములగు వాక్యములింజెప్పి యెట్టెటో నివర్తింపఁజేసి యిటకరుదెంచితిని. దేవరవారిప్పుడు సంగమానుగ్రహమొనర్పనిచో నామె నిశ్చయముగాఁ జనిపోవును. నేనును సఖీమరణముఁ జూడఁజాలక యిప్పుడు మీసమక్షము నందే ప్రాణములు వదలెదను.

విదూ—(రాజుతో) మిత్రమా! యీదూత్యోపక్రమ మపూర్వముగానున్నదే! బలాత్కారముచేత నాకామ ముత్పాదించుట?

రాజు—(స్వగతము) దీనివాక్యమును బట్టిచూడఁగా నామనస్సునకుఁగూడ ససంతుష్టిగనేయున్నది. కానిమ్ము, దీని నిట్లుబంపివైచెదను. (ప్రకాశముగా) శోభనవతీ! తమంతఁ దామువ్రార్థించి వచ్చెడి యిట్టి స్త్రీరత్నములనుయేపురుషుఁ డభిలషింప కుండును? వేయేల?.బూజ్యురాలవగు నీమాట జవదాటము.

రాక్షసి—(హర్షముతో) దేవరవార లనుగ్రహించుటంజేసి బ్రదికితిని. కావున నేటి ప్రదోష సమయమున మిత్రునితోఁ గూడ దేవరవారిచ్చట నేవేఁచియుండుఁడు. నేనునప్పటికి విమానముం దీసికొని తప్పక వచ్చెదను. (అని నిష్క్రమించును.)

విదూ—మిత్రమా! ఏమి నీప్రయత్నము?

రాజు—నామనోవ్యాపారములు నీ వెఱుంగఁజాల కున్నాఁడవు. తపతీగుణగణబద్ధమగు నా యీచిత్తవృత్తిని వేఱొకచోఁ జరింపఁ జేయగల్గనా? కేవలము దాని సాహసమునకు వెఱచి నే నట్లంటిని. తపతీగాత్ర సంపర్కమున ధన్యమైనదని భ్రమపడి నే నిన్నాళ్ళీకర్ణపూరమును బ్రాణపదముగఁ జూచుకొనుచుంటిని. అన్యకాంతా కపోల సంసర్గోపహతంబగు దీని నిప్పుడవ్వలఁ బాఱవైవుము.

విదూ—(నవ్వి) ఆహా! ఏమి యీరాజకులము నాశ్రయించువారికిఁ గలుగు పరిభవము. ఇంతవరకును మద్భుజాంతరవర్తియైన యీకర్ణపూరమునకు నిముసములో నవితర్కితోపద్రవము సంభవించినది. (కర్ణపూరమును బాఱవైచి) మిత్రమా! ఆశ్చర్య మాశ్చర్యము. ఆకాకి మీకర్ణపూరమును దిగమ్రింగినది. మఱల నిది భూమిపై బడకున్నది.

(నేపథ్యమున)

మ. వనితాప్రాప్తివిహీనమర్త్యహితమున్ ♦ భావిన్ విషాదప్రదం
బును నాకస్మికమైన యొక్కసమయం ♦ బుం గల్పనం జేసి నే
తనునమ్మించిన మాయలెల్ల భృగుస ♦ త్కర్మంబులందూలెమో
హినికాఖ్యాసురిస్వాంగ మొందిచనెన్ ♦ హీనీకృతారంభయై.

రాజు—[హర్షముతో] విమాన సమేతయై యీ నాతివచ్చినప్పుడే తిరస్కార విధానమునఁ బంపివైతునా యని చింతించుచుంటిని. ఇంతలో నిదంతయును మాయాజాల ప్రభావమని వచించి దైవము మనల సంకటంబులనుండి యుద్ధరించెను.

విదూ—నేను నెట్లో దైవకృపచే నారాక్షసియొక్క దంష్ట్రాప్రహారముల బారిఁబడకుండ బ్రదికితిని.

{ అంతటఁ గర్ణపూరముఁ జేతఁ బట్టుకొని
పటాక్షేపమున మేనక ప్రవేశించుచున్నది. }

మేన—త్వరపడుము. త్వరపడుము. మహారాజా!

రాజు—[సంభ్రమముతో] ఏమి యేమి?

మేన—ఆరాక్షసి తన నెచ్చెలి భృగుపతనవృత్తాంతము దేవరవారితో విన్నవించుటకుఁ బ్రారంభించినప్పుడు సఖి నాతోఁ గలసి యిచ్చటికివచ్చి యుండి దేవరవారి సంకేతవచనము విని కోపము వహించి వెడలిపోయెను. నేనును బర్యవసానము నిరీక్షించుచుండి దేవరవారి కిప్పుడు

యథార్థము విన్నవించుకొనఁ గలిగితిని. కావున త్వరితముగఁ బోయి నెచ్చెలి నూరడింతురుగాక.

రాజు—[విషాదముతో] ప్రేయసి యిపు డెచ్చట నున్నది?

మేనక—అదిగో చూడుఁడు. కల్యాణవామనాలయముఁ బ్రవేశించుచున్నది. కావున త్వరపడుఁడు.

[అందఱు సంభ్రమముతోఁ బరిక్రమింతురు.]

[అంతఁ దపతి ప్రవేశించును.]

తపతి—(సప్రణామముగా) దేవా! రమావల్లభా! పూర్వము కామాగ్నిచేఁ గ్రాగి నశింపనున్న నాశరీరంబుఁ గాపాడితివి. ఇప్పుడు మఱల పరిభవానలదాహమున నశింపనున్నది.

రాజు—(సంభ్రమముతో సమీపించి) ప్రేయసీ! ఇది యేమి? పరిభవానల మనుచున్నావు?

తపతి—(బొమలు ముడిచి వెనుదిరిగి మరలిపోఁ బోవును)

రాజు—(చేలాంచలముఁ బట్టుకొని)

చ. అనయము నీవునాయెడల ♦ నంచితరీతినిఁ జూపుప్రేమవ
ర్తనములతత్త్వముం దెలియఁ ♦ దథ్యముగాఁగ మదీయమానసం
బునకు నశక్యమేయగును ♦ హా! యిదియేల వహించెదీవు నీ
మనమున నీడులేని యవ ♦ మానము ముగ్ధకురంగలోచనా.

మేన—సఖీ! కోప మొందకుము. (చెవిలో) ఇట్లు జరిగినది.

తపతి—కట్టా! నిష్కారణముగ నార్యపుత్రునిపై నపరాధము మోపితిని. (రాజుం జూచి) ఆర్యపుత్రా! జయము.

రాజు—(సంతోషముతోఁ గౌఁగిలించుకొని) అనిమిత్తకోపశీలా! యీదాసునిపై నీకుఁగల కోపహేతువు లసత్యములును దుఃఖభాజనములు నైనవి.

మేన—(విదూషకునిజూచి) ఓయి రాజవయస్య! యీ కాకముచే దిగమ్రింగఁబడిన నీకర్ణపూర మిదిగో! తీసికొనుము.

విదూ—(భయముతో) రాక్షసియొక్క కర్ణపూరము మాకు శుభంకర మైనది కాదు. కావున నే నొల్ల.

రాజు—(తపతి వినకుండునట్లు) సఖీ మేనకా! మాకు మర్మవ్యథఁ గలిగించుచున్నావు గదా!

మేన—మహారాజా! శంకింపకుడు. యీ కర్ణపూరంబును, బదయుగళంబును మా నెచ్చెలి యవియే.

రాజు—నా హృదయమున నాటియున్న సంశయశల్యము దైవకృపచేఁ జిరకాలమునకు నీచేఁ దొలగింపఁబడినది. (విదూషకునిం జూచి) మిత్రమా! కోపాంతరాయ రహితమగు ప్రియా పరిష్వంగమిది. కావున నీకర్ణపూరము స్వీకరింపుము.

విదూ—అట్లే (అని పుచ్చుకొని దిక్కులు పరికించి) మిత్రమా! అకాముకులగు మాబోఁటివారు సంధ్యోపాసన మతిక్రమింప గూడదు గదా!

రాజు—(నల్దిక్కులం జూచి) మిత్రమా! చక్కఁగాఁ బ్రబోధించితివి. (తపతిం జూచి) ప్రేయసీ! నీవభ్యంతర మందిరముఁ బ్రవేశింపుము. మేమును,

గీ. ధాతృగాత్రముఁ దమమునఁ ♦ దవులనీక
బ్రోచుచుఁ ద్రివేదములకును ♦ మూలమగుచుఁ
దవిలి నిరుసంజ జపియింపఁ ♦ దగిన దగుచు
వెలయునీ సహజాతను ♦ గొలుతు మిపుడు. 21

(అందరును నిష్క్రమింతురు.)

చతుర్థాంకము

సంపూర్ణము.

ఓం

తపతీసంవరణము.

పంచమాంకము.

{ అంతట బద్ధకర్ణపూరదండహస్తుఁడై భయముతో విదూషకుఁడు ప్రవేశించుచున్నాడు. }

విదూ—(నిట్టూర్పు విడిచి) అయ్యో! వంచింపఁబడితిని, వంచింపఁబడితిని. ఈ తపనవనమం దతిచిరకాలము విహరించియున్న వయస్యుఁడును, దేవియుఁ బరిజనంబును స్వప్నలబ్ధమగు నిధివలె ప్రభాతమున మేల్కాంచి చూచునరికి నాకగపడకున్నారు. ఈ తపనవనమందంతటను వెదకితిని. మృగశకుంత జాలంబుల మాత్రము విడచి సర్వస్వమపహరించికొనిపోయినగత రాత్రిచేఁ దపనవనమును నేను నేలకో విడువఁబడితిమి. ఆశ్చర్యము! (సవితర్కముగా) దేవితోఁగూడి రాజు తపనలోకమున కేఁగియుండునా యనుకొన్నచో నాకుఁ దెలుపకయే యాతఁడట్లొనర్చి యుండడు. ఒకవేళ మాయాదక్షులగు రాక్షసు లెట్లయిన నీతనిఁ గొంపోయిరనుకొందునా యది వారికి సాధ్యముగాదు. భృగుకర్మ ప్రభావముచే మాయలిచ్చటఁ బ్రసరింపవు. ప్రత్యక్షముగ నే పరాక్రమించియుందురనుకొన్నచో వారల నివారించుట కాతని ప్రభావమే చాలును. కానిమ్ము దురూహలచే నిఁకఁ బ్రయోజనము లేదు. కావున తపనవనము విడిచి వేఱొకచోట వెదకెదను. (పరిక్రమించి దిక్కులు బరికించి) ఆహా! ఈవనగహన ప్రదేశమెంత భయంకరముగా నున్నది! కుంభస్థలము సింహనఖాగ్రంబులచేఁ జీల్పఁబడుటంజేసి తనసహచరుఁడు రోదనము సేయుట

విని భయముచేఁ బఱువెత్తుచు మార్గమధ్యమున బోయలు గల్పించిన గుంటఁ బడి యీ కరిణి జాలిపుట్టునట్లుగ నేడ్చుచున్నది. (మఱియొక చోఁజూచి) ఆహా! భల్లూకము వెనుకటి భాగమంతయుం దిని విడువ నాలుక వెడలఁ బెట్టి నిశ్చలోత్ఫుల్లలోచనంబులతో నిటబడియున్న యీకురంగాంగనం జూడ నిప్పుడును భయమగుచున్నది. క్రూరసత్త్వనిహతంబులగు దుర్బల మృగ కళేబరంబులచే నిండి దుర్గంధంబై యున్న యీప్రదేశము దుర్భిక్షాపీడితంబగు రాష్ట్రంబును బోలి యున్నది. వేయేల? భయవిధురం బగు నాదృష్టియే యిచటఁ బ్రసరింపఁ జాలకున్నది. ఇఁక నడుగులస్థితిఁ జెప్ప నేల? పురవీధుల నేని యొంటి బోవ వెఱచు నే నీయరణ్యమం దెట్లు భయపడకుందును? సహాయులా లేరు. కావున నాకిఁక శరణ మెద్ది? దిక్కెవరు? (భయకంపితుండై దండ కాష్ఠము నూఁతఁగా గొని నిలుచును.)

{ అంతట నమాత్యుఁడు ప్రవేశించుచున్నాఁడు. }

అమా—(సవితర్కముగా) ఆహా! కామ మెంతనీచ మైనది. ప్రసిద్ధప్రభావుండును నిసర్గవినయ సముద్భవశేముషీ ప్రశమితప్రజోపద్రవుండును నగు మహారాజుగూడ నీకామమునకు లోనై స్వరాజ్యము విడచి యింత కాలమును యీమహారణ్యమునందు నివసించుచున్నాఁడు. ఇఁక రాజ్య మన్ననో చిరకాలము నుండియుఁ బర్జన్యునిచే నిరాకరింపఁబడియున్నది

సీ. ఏవంకఁ జూచినఁ ♦ బ్రేవుల ప్రోవులు
చిత్తభీకరములై ♦ చెలఁగుచుండె
ఘోరమైనట్టి శి ♦ వారావభారంబు
కర్ణరంధ్రంబులఁ ♦ గాడుచుండె
భూతభేతాళసం ♦ ఘాతంబు చెలరేఁగి
తిరుగాడఁ జొచ్చె నల్ ♦ దిక్కులందు

నర శిరంబుల వితా ♦ నమ్ము లెమ్ములు మేది
నీ భాగమంతట ♦ నిండి యుండె
గీ. ప్రజలు వెఱగంది మిగుల దూ ♦ రంబు సనిరి
యీదృశావస్థలం జిక్కె ♦ నిప్పుడు చూడ
సంవరణచక్రవర్తి రా ♦ జ్యంబు భయద
మయ్యెఁగాళీమహోగ్రకా ♦ యంబు భంగి

అభిమత కాంతాయుక్తుండైన మహారాజుగారికి తపనవన మను నొకా నొక దేవారణ్యము విహారభూమి యనివింటిని. కావున తపనవన మెచ్చట నున్నదో వెదకి కనుగొందును గాక. (పరిక్రమించుచు ముందుఁ జూచి) ఓహో! దేవరవారికి బహిఃప్రాణ మగు నీపారాశర్యుఁడు శనిచేతనో పట్టుపడిన వాఁడువలె గన్పట్టుచు నిచట నున్నాఁడు. ఈతని వలన మహారాజుగారి వృత్తాంతముఁ దెలిసికొనియెదను. (సమీపించి) మిత్రమా! సేమమా!

విదూ...(సంభ్రమముతో) ఓహో అమాత్యుఁడు వసుమిత్రుఁడా? ఏమి యీ మబ్బులేనివాన. (హర్షముతోఁ గౌఁగిలించికొని) రాజరహితంబగు రాష్ట్రంబు విధవాడి వద్భితి విదేల? బలగర్వితులును మనకుఁ బూర్వవైరులును నగు పాంచాలు రుపేక్షింపఁ దగువారలు కాదుగదా?

అమా...అతి క్షుద్ర పరాక్రమ వంతులగు పాంచాలురగోడవయేటి కటుండనిమ్ము. ఇప్పు డతి భయంకరమగు క్షామ మాదేశము బీడించుచున్నది?

సీ. తిన నోగిరము లేక ♦ దినదినంబును జిక్కి
శల్యావశిష్టులై ♦ జనులు మృత వి
శేషులు కంఠాగ్ర ♦ సీమఁ బ్రాణములు మె
దలకను దీనాత్ము ♦ లయి వలలు

గాలముల్ మూఁపున ♦ వ్రేలవైచి, తరలి
మత్స్యంబులం బట్టు ♦ మమతమీఱ
గంగయందల్లి లోఁతు ♦ గలయట్టి మడువుల
లో సొచ్చి కుత్తుక ♦ లోఁతు నీట
గీ. మునిఁగి యుండగ నామిషం ♦ బునకుఁ దిరుగు
లాడు గ్రద్దలు వక్రంబు ♦ లైన వాఁడి
ముక్కులను వారి తలల పైఁ ♦ బొడుచు చుండుఁ
దటుకు తటుకున ఘోర శ ♦ బ్దంబు గాఁగ. 2

ప్రభు వచ్చుట లేమిం జేసి యిట్టి దారుణావస్థ సంభవించినది. కావున నేదో యుపాయమున నతనిని హస్తిపురికిం దోడ్కొనిపోవ వచ్చితిని. ఇప్పుడు మహారాజుగారెచ్చట నున్నారు?

విదూ—(నిశ్వాసముతో) మందభాగ్యుఁడను జెప్పెదను వినుము. ఇంతకాల మిచ్చటనే తపనతనూజం గూడి విహరించి గతరాత్రియందు నిదురించుచుండ నన్నిచ్చటనే విడిచి దివ్యజనసమూహముతోఁ గలసి గంధర్వనగరమువలె నదృశ్యుఁడయ్యె. అందుచే నీకాంతారమంతయు వెదకుచు క్రూరమృగంబులవలని భయంబున నేసిటనిలిచియుండ నీవువచ్చి నన్నుఁ గలసికొంటివి. ఇదంతయు నా యధన్యతాపరిపాకమే.

అమా—అట్లుగాదు. నాపై నిందారోపణ సేయఁబూని మాత్సర్యముచే మహారాజిట్లుపక్రమించె. ఏలయన,

గీ. వ్యసనమిత్రంబు లగు భూప ♦ రాత్మజాప
రాధముల నంతిపురపు మూ ♦ ర్ఖతను జేసి
యపనయమునను నా దోష ♦ మంతయు నచి
వాత్మమాలిన్యపరిపాక ♦ మగుఁదలంప. 3

(చింతించి) మహారాజుగారు నిజముఁగా నిన్నువిడచి దేవీసమేతుఁడై పోవఁడని నానమ్మకము. ఏకారణముననో యంతర్హితయైనదేవిని వెద

కుచు నీయరణ్యమందే తిరుగుచుండునని తలఁచెదను. కావున నాతని వెదకుదమురమ్ము.

విదూ...(స్వగతము) ఆహా! దేవియెంతనిర్దయస్వాంత! తనయుఁడను ఫలమునకుఁ బుష్పమును జూపినట్లైనూపి వెడలిపోయినది. (ప్రకాశముగా) అట్లే కానిమ్ము.

(ఇద్దఱుఁబరిక్రమింతురు.)

విదూ...(ముందుజూచి) ఈయిసుకనేలపై నెవ్వఁడో వనచరుఁడు నడచినట్లున్నది. ఇదిగో యడుగుజాడ.

అమా...(సావధానముగా నిరూపించి హర్షముతో) చిరకాలమునకు నా నేత్రములు ధన్యములైనవి. ఇయ్యది మహారాజుగారిపదకమలముద్రయే. చూడు

మ. కలశంబియ్యది ఛత్రమియ్యది తురం♦గంబల్లదేయాయుదే
జలజంబియ్యదియే పతాకమిదియే ♦ శంఖంబుచక్రంబదే
భళిరే! కల్గునె లక్షణంబులివిభూ ♦ షశ్రేష్ఠుఁడై సప్తవా
ర్ధిలసన్మేదినినేలుసంవరణు నం♦ఘ్రిందక్క నన్యాంఘ్రులన్

(నేపథ్యమున)

ఛీ! దురాత్మా! అచలాధమా! చిరకాలంబునుండి వెదకుచున్నను నాప్రాణేశ్వరిం జూపకున్నాఁడవు. విశ్వవిజయానంతరవిరమదైక్ష్వాక క్షోణీధరకార్ముకోద్వహనకర్మకరా! జనితబహుజన్యపౌరవరాజన్య చాపచక్రపరాక్రమవిశేషంబు లిప్పటికిని నీ వెఱుంగఁజాలకున్నాఁడవు. కానిమ్ము. సంవరణుఁడిప్పుడు బోధింపఁగలఁడు.

విదూ...(చెవియొగ్గి) దైవవశమున జలధరగంభీరమగు వయస్యుని స్వరము వినఁగంటిమి.

అమా...ఆహా! మహారాజుగారు తనప్రాణేశ్వరిని హిమవంతుఁడపహరించెనని తలఁచి యున్మత్తునిభంగి నతనిపైఁ గోపించుచు నిటువచ్చుచున్నాఁడు కావున నతనిదర్శించుటకిది సమయముగాదు. తటి వేచియుండి సమీపింతము.

విదూ...అట్లే! (గుహాంతరంబున డాగియుందురు.)

{ అంతట నున్మత్తుఁడగు రాజు
ప్రవేశించుచున్నాఁడు. }

రాజు...(ఉద్వేగముతో 'ఆ దురాత్మా' యని పూర్వరీతినే పఠించి)

చ. హరుఁడు పురత్రయైకహరుఁ ♦ డల్లుఁడు దాశరణంబొసంగినన్
శరభవుఁడాత్మజాతతను ♦ జాతుఁడు నిన్ బ్రదికింప నెంచినన్
సురరిపువాహినీప్రకర ♦ శోణితధారలఁ బుక్కిలించి బల్
బిరుసుగ నున్న నాదుశర ♦ బృందము నిన్ విడనాడునే ఖలా? 5

ధనువు, ధనువు.

విదూ...(క్రిందపడి భయముతో) అహా! నన్నెవ్వఁడో పడఁగొట్టినట్లున్నది.

అమా...(విస్మయముతో) అహా! మహారాజుగారి ప్రభుశక్తి శక్రప్రభావము నతిశయించి యున్నదిగదా! గౌరీగురుండగు హిమవంతుఁడుగూడ నీతనికోపంబునకడలి కంపించుచున్నాఁడు. (విదూషకుని లేవనెత్తును.)

రాజు...(చింతించి) ఛీ! కృతఘ్నులందె నగ్రేసరుండఁగదా! నాఁడు విరహార్తిచే నా ప్రాణములు పోవనున్న తఱిని మనోహారిణితోఁ జేర్చి నన్ను రక్షించెఁగదా యితఁడు. అట్టి యీ హిమవంతు నిప్పుడు నాబాణంబులకు లక్ష్యభూమిగా నొనర్చితిని. వేఱొకచోఁ వెదకెదనుగాక. (మఱియొకచోఁ జూచి) దేవా!

మ. సరసీజాక్ష! విలాససంచలితరో ♦ మా భ్రూలతంబోలు నీ
విరివిల్లం సమునందుఁ జేర్చితుహినో ♦ ర్వీభృద్వనశ్రేణి సం
చరణాసక్తుఁడవైతి, వెందయిన న ♦ స్మత్ప్రాణతుల్యంబుఁ గాం
తరసారంగవిలోచనం బగుపదా ♦ ర్థంబొండు గన్పట్టెనే? 6

రాజు—హాహాహా! నే నున్మత్తుఁడంగదా! శరీరింబోలె నీయనంగు నుద్దేశించి ప్రేలఁ జొచ్చితిని. కానిమ్ము వేఱొకచోట వెదకెదను. (పరిక్రమించి

హర్షముతో). అహా! నా మనోహారిణి పోయిన త్రోవ గుర్తించితిని. ఏ కారణంబుననో కోపించి నన్ను విడనాడి పోవుచు,

గీ. శ్రమమునఁ జేదేవి ఇచ్చోట ♦ క్షణము సేపు
కూరుచుండి వియోగార్తిఁ ♦ గుందు వేళఁ
గోలఁకులందుండి ధారలై ♦ చలువ జాఱ
నంజనముఁ గూడి పడినట్టి ♦ యశ్రులివియె. 7

(మఱల భావించి) ఇది చంద్రకాంతము గాదు. ఇవి యశ్రుజలంబులుం గావు. విరిసిన తెలిమెట్టదామరలపైఁ జేరిన తేఁటిమొత్తంబు లివి. కావున మఱియొకచో వెదకెదను. వెదకిమాత్ర మేమి ప్రయోజనము? ముహూర్తమాత్ర మేని తన వియోగము సహింపఁజాలని నా హృదయ మెఱింగియును నను విడనాడి యెచ్చటికో వెడలిపోయినది. (మఱల విచారించి) ఇట్లనుగాదు. పతినే దైవముగా భావించు నా పరమసాధ్వి యిట్టి యపరాధ మొనర్చియుండదు. ఇదిగో! కులట వసుంధర. సపత్నీమాత్సర్యంబున నా సాధ్విని దిగమ్రింగినది. దీని శీల మిదివఱకే తెల్లమై యున్నది. ఏల యన,

గీ. రాజసభయందు దశరథ ♦ రాజతనయు
ననుఁగు నిల్లాలి నాతని ♦ కనుల యెదుట
నపహరించి తిరోధాన ♦ మందెఁ, గాన
నిచట దీనికి దుష్కరం బెద్ది యింక? 8

(స్మృతి నభినయించి) ఇది యనుంగాదు. అనేక సహస్రభూపాలుర ననుభవించి విడిచిన దీనికా పరమసాధ్వియై సపత్నీమాత్సర్యమున కవకాశ మెద్ది? కావున నీ పుడమి మత్ప్రాణవల్లభ నపహరించి యుండ దని తలఁచెదను. కావున వేఱొకచో వెదకెదను. (పరిక్రమించి యెదుటం జూచి యానందముతో) అహా! యిది దేవియొక్క మందారవతంసకము. మిత్రమా పారాశర్యా! దీనిని మఱలఁ బాఱవైచితివేల! (తీసికొనఁబోవును)

అమా...మిత్రమా ! నీవు మహారాజును సమీపించుట కిదియే సమయము. నేను నేదో యుపాయమున నీయన యున్మాదమెుకించుక తగ్గించి పిమ్మట నగపడియెదన్.

విదూ...(అశ్లోకిక్రమించి మఱలఁ బ్రవేశించి శీఘ్రముగ రాజును సమీపించి కర్ణపూరముం జూపుచు) మిత్రమా ! కర్ణపూర మిది. ఈమందభాగ్యుఁడను నేను. ఈపద్మరాగ భూమియందలి కిరణజాలంబులంజూచి భ్రమచే కర్ణపూర మను చున్నాఁడవు

(విదూషకుఁడు కర్ణపూర మిచ్చుచున్నాఁడు.)

రాజు—(తీసికొని హృదయముపైనిడికొని సరోమాంచముగా) ఓయీ! ప్రియా! పరిగ్రహాసుభగావతంసకా !

చ. పులకసుహృద్వతంసములఁ • బొందిదళాళికిస్పర్శవిఘ్నముల్
గలుగఁగఁజేయ దేనిపయిఁ • గల్గెనెనీకుమహాభ్యసూయ య
య్యలికులనీలనేత్ర సుమ • మాగ్రచయంబునఁ జిత్రమైన వ
త్స్మల నయనావిపాండుతర • గండతలంబునకుం బ్రమోదమే.

మిత్రమా ! కదంగసంగమోత్సవదుర్లలితం బగు నీకర్ణపూరంబుచే నామోహాంధకార మించుక విరళమైనది. కావున తదన్యము శ్లాఘాపాత్ర మగు మఱే యేవస్తువుచే నేనిప్పుడూరటఁ బొందుదును.?

విదూ—మిత్రమా ! వియచ్చరయగు నామెకు సంబంధించిన వస్తువులు మనుష్యమాత్రుల మగు మనకెట్లు లభించును?

రాజు—(నింగివంకఁజూచి యానందముతో) ఆహా ! నే నింతవఱకును సుకరంబుగ నూఱటఁబొందు మార్గమును మఱచితిని. చూడు మిదిగో! యాలతాంగి జనకుండగు భానుమాలి, దేవా! పద్మినీ వల్లభా !

గీ. స్వతనయాచ్యుతరాగసం • గతినిఁ జేసి
మంజుళతఁ గాంచి నీకర • మాల యమృత

రసము లొలికించె నాదు గా • త్రముల నిపుడు
కాన నమృతాంశుఁడవు గాని • ఖరకరుఁడవె ? 10

హా ! కష్టము. ఏమి యీయకాల జలదము ! ఈ పాపి భానుమాలి కడ్డుపడు చున్నాఁడు. ఓయి సౌదామనీమనోహరా !

చ. వెడద శిఖాళినొప్పు నిజ • పింఛములన్ విరియించినాట్యము
న్నడపుచుఁగూఁతమ్రోత గళ • నాళమునిండగ మోరసాఁచిప్రే
ముడినిఁజెలంగు బర్హివర • ముం గనుమా!ప్రణయంబుమీఱఁగాఁ
దొడఱకుమింక సూతయునఁ • ద్యోమణికిన్ విని క్రోధివాటకున్

(నేపథ్యమున)

రాజా! ఋతునందనా!

మ. పర తేజోనిధి వీవు దూర మగుటం • బాంచాలకుల్ నీదు రా
జ్యరమాస్థానము నాక్రమించి రిఁక న • త్యంత త్వరం బోయి నీ
పుర మాపజ్జలధిస్వభంగముల ని • ర్మూలంబు గాకుండ భూ
వర! రక్షింపుమనంతరంబున భవ • ద్వాంఛల్ ఫలించుంజుమీ

రాజు...(కోపారుణిత నేత్రుండై వినుచు) ఏమి? పాంచాలపశువులు నా రాజ్యమాక్రమించిరా?

ఉ. కాలుఁడ! యుంతు వేని తుణ • కాలను మత్త దనోర్వియందు [బాం
చాలుర, పత్తిహస్తిరథ • సైంధవ యుక్తముగా తుణంబులో
వాలును బల్కదొట్టి శర • పంక్తుల వారలసంధిబంధముల్
వ్రాలఁగఁగొట్టి పంపెద న • రాతిగణంబుల నీదుప్రోలికిన్॥

విదూ...(తనలో) శబాస్!వసుమిత్రా శబాస్! అమాత్యభావానురూపముగఁ జరించితివి. భగవదనుగ్రహంబుచే నీతని మదనోన్మాదము రోషాంకుశ ప్రభావమున నివారితమైనది. కావున నేనుగూడ నీతనిదోషము

నించుక వృద్ధిఁ బొందించెదను. (ప్రకాశముగా) మిత్రమా! ఆపాంచాలాధములు నీబాహుబల పరాక్రమ మిదివఱకే యెఱింగి యుండియు నిపుడిట్లు దొడంగుటెల్ల నాత్మవినాశనంబునకే.

రాజు...(సవిమర్శముగా) మిత్రమా! పూజ్యుఁడగు వసుమిత్రుఁడు రాజ్యమున లేఁడా? ఇట్లేల సంభవించినది.

{ వసుమిత్రుఁడు ప్రవేశించుచున్నాఁడు. }

వసు...దేవా! జయ మగుఁ గాక!

రాజు...(చూచి) ఆహా! అమాత్యుఁడు వసుమిత్రుఁడు విచ్చేసి యున్నవాఁడు (కౌఁగిలించి) నెచ్చెలీ! మన రాజ్య మంతయుఁ బాంచాలురచే నాక్రమింపఁ బడెనని యాకాశవాణి వచించినది. నీమతిబలముచే వారి పరాక్రమ మంతయు నడుగంటి యుండెఁ గదా! మరల నిట్లేల సంభవించె?

అమా...దేవా! నిజము. కేవల మాపాంచాలాధముల పరాక్రమ మెంచఁ దగినది కాదు. కాని భవద్బాహుబలనిర్జితము లగు సకలరాజన్య చక్రంబులతోఁ గూడ తా మేకీభవించి నామతిబలము నయిత మతిక్రమించి, దేవరవారి పరాక్రమమున కెదురు నూచుచున్నారు. కావున నింక నిముసమైన నాలసింపక వారి మనోరథంబులం దీర్పుఁడు.

విదూ...అమాత్యా! అనుచరులను వాహనంబులనుగూడఁ దోడితెచ్చితివా? అట్లయిన శీఘ్రముగ బయలు వెడలుదము.

అమా...అవును తెచ్చితిని. ఇచ్చటికి క్రోశమాత్రప్రదేశమున వారల నిలిపి మహారాజుగారిని వెదకుచు నేనొక్కఁడనే యిట కేతెంచితిని.

రాజు...అనుచరసమూహంబు లేటికి? సకలరాజన్య ప్రాణాపహారియై నాదక్షిణ భుజము మిక్కిలి త్వరపడుచున్నది. కావున మన కంబరగమనోపాయ మాలోచింపుము.

{ అప్పుడాకాశమునుండి సారథి రథముతోఁ బ్రవేశించును. }

సారథి...సూర్యభగవానుఁడు నా కిట్లానతిచ్చెను. "హయసేనా! నాయల్లుఁడచట లేమిం జేసి జలపూరపూర్ణంబు లయ్యును నా రశ్మిజాలంబు లాతని రాజ్యమున వర్షింప నిచ్చగించుటలేదు. కావున నాతని రాజ్యము దుర్భిక్షపీడితంబై నశింపనున్నది. ఇఁక సంవరణుఁడన్ననో తపతీ సంగమ లోలుఁడై కర్తవ్యముల మఱచి నందనోద్యానతుల్యంబు లగు నీ హిమవత్కాననంబుల సంచరించుచు స్వరాజ్యమున కేఁగుట కిచ్చగింపకున్నాఁడు. కావున నీదంపతుల నించుక కాలము వేఱుపఱచినఁ గాని కార్యములు నెఱవేరవు. పతినే దైవముగ నెంచు నాతపతి జాగ్రదవస్థలో వియోగమువూట విన సైఁ నొల్లదు. కావున వారిద్దఱు నిద్రావస్థలో నున్నపుడు నాతపతిని సపరివారముగా సావిత్రీ సకాశమున జేర్పుము" పిదప నేనన్నో

గీ. సహచరమునుండి యెల చక్ర ♦ సతినిబోలె
పృథుపయోధరభార గు ♦ ర్వియగుప్రియను
నృపునికెడ జేసి రవియాన, ♦ నిచుఁడ నయి
తొలుతవాడైతి జడులఁ బ్ర ♦ దోషగతిని

ఇఁక దేవునిరెండవ నియోగము. "అమాత్యునిచేఁ బ్రేరేపింపఁబడి సంవరణుఁడు నిజరాష్ట్రమున కేఁగదలఁచి శీఘ్రగమనోపాయ మెఱుంగక చింతిల్లుచుండ నతని రథముం గొంపోయి యాతనిమనోరథంబుఁ దీర్పు" మనియె కావున నిటక్రిందికి దిగియెదను. (అవతరణము నటించుచుఁ గ్రిందఁజూచి) ఆహా! యీరథము క్రమముగాఁ గ్రిందికిదిగుచుండఁగా

చ. జలమునఁ దేలు నేలదళ ♦ సంతతిఁ గాదు కుజంబులం, గుజం
బులు జలమందు కాదు గిరి ♦ భూమి, గిరుల్ జలరాశిఁ, గాదు భూ

స్థలి, భువిసంద్రగొసినము ♦ సందున, మామకచిత్తవృత్తు లి
ష్వాలుపునఁదోఁచెనెక్కొని సముద్ధరణప్రతిరోపణంబులన్

విదూ...(పైనిజూచి) మిత్రమా! నీహృదయసంతాపము నివారింపఁదలచి మీ మామయగు సూర్యభగవానుఁడిట కేతెంచుచున్నట్లున్నది.

రాజు...ఇదేదియో నొక దివ్యరథము. నిజప్రభాపటలంబులచే నాద్యంతంబుల దోఁపనీయకున్నది.

అమా...దేవతలెల్లపుడును దేవరవారిమనోవర్తులేకదా?

సారథి...(క్రిందికి దృష్టులు నిగుడ్చి) ఆహా! యిదిగో మహారాజగు సంవరణుడీ హిమవత్కాననంబున నున్నాఁడు. ఇపుడు నేనీతనికి భూతార్థమంతయు నెఱింగించినచో తనదేవివృత్తాంతమతఁడు నన్నడుగును. అపుడు కష్టము సంభవించును. కావున నిట్లువచింతునుగాక. (క్రిందికి దిగి సమీపించి) మధ్యమలోకపాలా! విజయమగుఁగాక! అసురవిజయంబున మీరు పలుమాఱు తనకు సాహాయ్యమొనర్చుటంజేసి మహేంద్రుఁడుమిగుల సంతసించి యాయుష్మంతుఁడవగు నిన్ను హస్తిపురముం జేర్పుమని యీ రథంబుతోఁగూడ నన్నిటకుఁబుత్తెంచెను. కావున నధిరోహింపుడు.

రాజు...(సంతసముతో) భగవానుఁడగు మహేంద్రుఁడు నన్ననుగ్రహించుటం జేసి మిగుల ధన్యుఁడనయితిని.

[అందఱు రథమునఁ గూర్చుండురు.]

అమా...ఓయీ సేనాపతీ సింహఘోషా! అనుచర సమూహంబులనెల్ల నిర్బాధకముగాఁ బురంబునకుం దోడితెమ్ము. ఏమనుచున్నాఁడవు? అట్లే యనియా?

సారథి...ఆయుష్మంతుఁడా! పగ్గముల సడలింతునా?

రాజు...మంచిది. తప్పకయట్లొనర్పుము.

(సారథి యట్లొనర్చును.)

విదూ—మిత్రమా! పూర్వము నిన్ను నేనుప్రార్థించిన యాకాశగమనము సంప్రాప్తమయ్యెఁగదాయని మిక్కిలి సంతసముగలుగుచున్నది. కాని యీ రథవేగముచేతఁ గనులుతిరిగి క్రిందపడుదునేమోయని మిక్కిలిభయమగుచున్నది. కావున నిన్నుగట్టిగాపట్టుకొని కూర్చుండెదను. (రాజును పట్టుకొనుచున్నాఁడు.)

రాజు—(రథవేగము నిరూపించి) ఆహా! యీరథవేగము వితర్కింప నలవిగాకున్నది. ఏలయన,

మ. కన నేకక్షణపూర్వపశ్చిమకలా ♦ కాలంబునం దీహరుల్
వనదాగ్రంబునఁబూర్వపశ్చిమఖుర♦ద్వంద్వంబులన్ నిల్పుఁ బ్రాం
తనిబద్ధోజ్జ్వలఘుర్ఘరోదిత తడి ♦ త్సంఘంబు సూచించు నీ
ఘనవేగస్థిరమైనటుల్ దనరు చ ♦ క్రవ్రాతపుందొర్లికన్. 16

(అందరు నిష్క్రమింతురు)

పంచమాంకము

సంపూర్ణము.

ఓం

తపతీసంవరణము.

షష్ఠాంకము.

{ అంతటఁ గంచుకి ప్రవేశించుచున్నాఁడు. }

కంచు — (సవిమర్శముగా) రథహయహేషితంబులతోడనే ఘనాఘనహుంకారంబులా? పాదపద్మరాగంబులతోడనే భూమిపయిఁ బయోవృష్టులా! ఆహా! సంవరణమహారాజుగారి మహానుభావత యేమని చెప్పవచ్చును. కాని యీమహాత్మ్యముచేత నాయవయవములకు దౌర్బల్యము రెండుమడంగు లధికమైనది. ఏలయన

చ. నడయొకరీతిగాదు, నయ♦నమ్ములఁ దారలు సంభ్రమించుఁ, జొ
ప్పడును విషాదము న్శ్రమము♦భ్రాంతియు, నూరుపులుపంగు, వత్తు
గడుఁ జలియించు గాత్రవల్లి♦కంచుకమై పచరించునిట్టిసంభ్రముం
దడిని జరాభరంబు నను♦నర్తకుభంగి నటింపఁ జేసెడిన్. 1

"వినయత్రాత! శీఘ్రముగఁ బోయి కార్తికేయావాస పరిసరారామము నందలి వాపికాతటినాతి పావనయోగ్య మగు గంగాలోక సౌధమును జక్కఁగ నలంకరించి రమ్మ" ని యేలిక నాకు మొదల నిడె. నా నియోగ మిప్పుడు నెరవేర్చికొంటిని. మహారాజుగారును దత్సౌధము నధిరోహించి యున్నారు. కావున నిఁక వేఱునియోగ మనుష్ఠింపఁ బోయెదను. (అని నిష్క్రమించుచున్నాఁడు)

ఇదివిష్కంభము.

{ అంతట రాజును విదూషకుఁడును ప్రవేశించుచున్నారు. }

రాజు — ఆహా! మంత్రులయొక్క మనోవ్యాపారములు నిసర్గనిష్ణాతమతుల కైన నెఱుఁగరానివి గదా! ఆర్యుఁడు వసుమిత్రుఁడు

గీ. అరులు పాంచాలు రొనరించి♦నట్టి భూరి
పరిభవము నాకు దైవదం♦భమునఁ దెలిపి
మోహ మెడబాపి నను పురం♦బునకుఁ దెచ్చి
కొల్లలుగ రాజ్యమున వృష్టిఁ♦గురియఁ జేసె. 2

ప్రాయికంబుగఁ బయోభరమేదురంబులగు ఘనసంపదలను గోపులం బిలుకు చందమిదియ కదా?

విదూ — సకల భువనైకనాథుండవగు నిన్ను మేఘదోహనార్థమై దూతగాఁ గొని తెచ్చుటం జేసి యీ మంత్రి మూర్ధాగ్రేసరుండని నేను నిశ్చయముగా వచింపఁ గలను.

రాజు — పరిహాస మిఁకఁ జాలును. ఇంతవఱకును పాంచాలుర యందలి కోపముచే వ్యాపారరహితమై యున్న ప్రియావియోగానలము నేఁ డడ్డులేక చెలరేఁగ నంకించుచున్నది. విరహిజనుల కతిభయంకరమగు కాలము సంభవించినది. చూడు,

చ. ఉడుగు వనంపుమల్లెవిరు♦లూడఁగఁ బాంథుల నేఁచునట్టి ప్రా
వృడనిలరాజి వీఁచె, నన♦లెత్తుముదంబునఁ గంఠనాళముల్
నిడుపుగ సాఁచి చాతకవి♦నీలకచల్ వడగండ్లఁ గ్రుమ్మరిం
చెడితొలిధారలం బ్రియులఁ♦జేరిసుఖంబుగఁ గ్రోలుచుండెడిన్

కావున నాకిపుడు శరణ మెద్ది?

{ అంతట మేనకారూపము ధరించి తపతి ప్రవేశించుచున్నది. }

తపతి — (సవిమర్శముగా నిట్టూర్పు విడిచి) సఖీరూపమున నార్యపుత్రుని

దర్శించి యూరటఁ బొందసెంచి నా సఖులనిద్దఱినిఁ గూడ వంచించి వచ్చితిని. ఇంత మాత్రమున జనకశాసనమతిక్రమించినట్లు కాదు గదా? కావున నార్యపుత్ర సందర్శనోత్సవ మనుభవించెదను. (పరిక్రమించి క్రిందికిఁ జూచియానందముతో) ఇదిగో! ఆర్యపుత్రుఁడు వయస్యునిం గూడి ప్రాసాదాగ్రభాగమునఁ గూర్చొని యున్నాఁడు. కావున నిప్పుడిచ్చట దిగిపోయెదను. (దిగుచున్నది.)

విదూ—(చూచి)ఇదిగో! పూజ్యురాలగు తపతీదేవి విచ్చేసినది.

రాజు—ఎక్కడెక్కడ?

తప—(విషాదముతో) వీరు నన్నుఁ దెలిసికొనిరా యేమి?

విదూ—ఇదిగో మాడు మేనకారూపమున నవతరించినది.

తప—(విషాదముతో) నిక్కముగ వీరు నన్ను దెలిసికొనిరి. తండ్రికన్ని విధముల నపరాధమొనర్చితిని.

రాజు—(చూచి) ఓహో! సఖియగు మేనకవచ్చినది. మిత్రమా! యీమె నాప్రేయసియంటివే, యదేల?

విదూ—వీరిద్దఱెక్కుడైకమత్యముతో నేకశరీరముభంగిఁ జరియించుటం జేసి యట్లంటిని.

తప—దైవానుగ్రహముచే నాకిపుడూరటగల్గెను. (సమీపించి) జయము మహారాజా!

రాజు—సఖీ స్వాగతము. (అని గాఢముగాఁ గౌఁగిలించికొని స్పర్శము నిరూపించుచు నాత్మలో)

గీ. దేవిపరిరంభమునవోలె ♦ దేహమెల్ల
గగురుపాటొందె నూరకే ♦ కారణంబో?
సతతసంశ్లేషమునదాని ♦ స్పర్శయింత
సంక్రమించెను యేమొ యీ ♦ చానయందు. 4

(ప్రకాశముగా) సఖీ మేనకా! మాప్రాణములకుఁగుశలమే కదా!

తపతి—మహారాజా! యిపుడు కుశలమే.

రాజు—ఇపు డనుచున్నావదేల?

తపతి—మహారాజా! చిత్తగింపుడు. నాఁడు నెచ్చెలి దేవరవారిం గూడి తపన వనమందు విహరించుచుండి పిదప మేల్కొన్నసరికి సావిత్రీసకాశమం దున్నట్లు తెలిసికొనెను. అచట దేవరవారిఁగానమింజేసి నెచ్చెలి మూర్ఛలో మునింగియుండ సావిత్రిదేవనెత్తి యూరడించి 'బిడ్డా! పరితపింపకుము. నీయందలిగాఢానురాగమున నీనాథుఁడు నినుఁ బాసి పోవమింజేసి యాతనిరాష్ట్రమున గొప్పక్షామము సంభవించినది. జనకుఁ డది యెఱింగి మీకిద్దఱకెడగలిగినఁగాని మహారాజు నిజనగరంబున కేఁగఁడని తలంచి సారథిచే నిన్నిటకుఁ దెప్పించెను. అంత విరహోన్మాదపరవశుఁడగునీభర్త నిజపురంబునకేఁగెను. నీవిఁక జనకు ననుమతి లేనిదే నీనాథునిచెంత కేఁగరాదుసుమా!' యని చెప్పెను.

రాజు—(విదూషకునితో) మిత్రమా! అతఁడుగూడ సూర్యసారథిగా మారెను. (మేనకంజూచి) తరువాత,

తపతి—భర్తృవియోగజనితదుఃఖమున నెచ్చెలి గుండుటఁదొట్టి సర్వవృత్తాంతమును దేవరవారికి నివేదింపవచ్చుచుండి పయోవృష్టులు భూమిపైఁబడుటం దిలకించితిని. కావున నిఁక మీపరస్పరసంయోగమునకు స్వామియగు భానుమాలి యనుమతించునని తలఁచి "ఇప్పుడు కుశలమే" యంటిని.

విదూ—దేవి నపహరించికొనిపోయిన దొంగలు బయలుపడిరి.

రాజు—(నిట్టూర్పువిడిచి) ఇపుడు నాసందియము నశించినది. సఖీ మేనకా! నేనిఁక క్షణమైనప్రియావియోగము సహింపఁజాలను. కావున భగవానుఁడగు సూర్యు నంగీకరింపఁజేసి దేవినిటకుఁదోడ్కొనిరమ్ము.

తప—(రాజును జక్కఁగాఁదిలకించుచు) మహారాజా! భవద్దర్శనసుఖమించుక యనుభవించిపోయెదను.

రాజు—(సవితర్కముగాఁదనలో)

చ. పరులకుదూతికల్ దెలుపు ♦ వార్తసఖీప్రణయానురూపమై
కరము రసప్రధానముగఁ ♦ గ్రాలుటనైజముగాని యీనిరం

తరరతిరాగనవ్యరస ♦ ధారలఁజిమ్మెడి దీనివీక్షణం
బరుదయియెన్నఁడేనిఁగన ♦ నట్టివిచిత్రముఁదోఁపఁజేసెడిన్. 5

(ప్రకాశముగా) నీసుఖము మాత్రమే చూచికొనకుము. నామానసము మిక్కిలి తమకమొందుచు నీగమనమును త్వరపెట్టుచున్నది.

తప—(మేఘగర్జనము విని ప్రస్తుతము మఱచి) అయ్యో! భయమగుచున్నది. ఆర్యపుత్రా! నన్ను గాఢముగఁ గౌఁగిలింపుము.

రాజు—(క్రోధముతో) ఛీ! పాపి! అనాగరతకుంజొచ్చితివా? అభిమతకాంతాగుణనిబద్ధహృదయుండగు నీ జనుండు నీవనుకొనినట్లు నైచ్యమునకుం జొచ్చువాఁడు కాఁడు.

తపతి—(రోషముతో) సరే! నీకనురూపయగు దేవిం గూడి స్వేచ్ఛగా విహరింపుము. అనుచితమగు చోట నెయ్య మొనర్చినందులకుఁ దగిన ప్రాయశ్చిత్త మొనర్చికొనియెదను. (అని నిష్క్రమించును)

విదూ—మిత్రమా! ఇదేమి రాక్షసిగా నున్నదే! ఇది నిజముగా మేనకయైనచో స్వప్నమందైన నిట్లొనర్పదు.

రాజు—స్త్రీస్వభావ మిట్టిదే చూడు,

మ. వరవంశంబును బంధుసంతతిని వి ♦ శ్వాసార్హమైయొప్పు సు
స్థిరమైత్రిన్ గురువర్గమున్ మనములోఁ ♦ జింతింప కేభామినుల్
దిరుగంజూతురు; వారిమానసములా ♦ త్మీయేచ్ఛకున్ సూటియై
వఱలుం గాని మఱెట్టిభంగినయినన్ ♦ వారింప రాకుండెడిన్

నిష్కళంకమానసయగు నాపరమసాధ్వి యజ్ఞానముచే నీరంకులాడి నిటులం బుత్తెంచినది. మనోవినోదార్థమై నియమింపఁబడిన యది యిట్లు మారినది. పోనిమ్మిదేల? కర్ణపూరముం గొనిరమ్ము.

విదూ—చిత్తమట్లే (నిష్క్రమించును.)

{ అంతట రంభారూపధారిణియై రాక్షసి ప్రవేశించుచున్నది. }

రాక్ష—పూర్వము హిమవత్కాననమందే నొనర్చిన మాయ లన్నియు భృగుకర్మప్రభావమున నిష్ఫలము లయ్యెను. ఈతని కులక్షయమొనర్చుట కిదియే తరుణము.

(సమీపించి రాజుపాదములపైఁ దటాలునఁ బడును.)

రాజు—(సంభ్రమముతో లేవనెత్తి) సఖీ! యిదేమి? నామానసముఁ గలఁచుచున్నావు? నీవిషాదమునకుం గారణమేమి?

రాక్ష—(బాష్పములు గార్చుచు గద్గదస్వరముతో) నెచ్చెలియగు తపతి జనకుని చండశాసనమునకు లోఁబడి భవత్సంగసౌఖ్యము లభింపమిం జేసి వియోగానలము సహింపఁజాలక తన్ను తానే... యింకమీఁదనే వచింపఁజాలను. నేను కూడ నాత్మహత్యచేఁ గాయమును బాసెదను. (నిష్క్రమించును.)

రాజు—(మూర్ఛనొంది కొంతవడికిందెలిసి) హా! రవికరోత్సంగలాలితా! ఆజ్ఞాకరుండనగు నన్ను విడనాడి యెట కేఁగితివి? దేవా! కృతాంతా!

గీ. భానుతనుజాతతయు ♦ నాదుభార్యతయును
నీదుసహజతనైన గ ♦ ణింపకుండ
నపహరించితి మృగనేత్ర ♦ యామె నీవు
కాన నినుముంచు నెంతు నీ ♦ మానసంబు. 7

ఏమిది! నే నింకను ప్రాణలోభునివలెఁ గేవలము గన్నీరు గార్చుచున్నాఁడను. ఇఁకఁ బ్రాయోపవేశమున కుపక్రమించెదను. (సౌధముఁ దిగుట నభినయించి పరిక్రమించుచు) ఈ స్ఫటిక సోపానమార్గమున రేవులోనికిం దిగి గంగాజలంబులాడి ప్రస్తుతకార్యమున కుపక్రమించెదను. (స్నాన మభినయించును.)

{ అప్పుడు గంగాజలంబులం దడిసి తపతి ప్రవేశించుచున్నది. }

తప—సఖీ! మందాకినీ! ఆర్యపుత్రు మరణవార్తవిని విపత్తున కెదురయి యున్నదానను. ఇపుడు నాకంతభార మేల తొలఁగించెదవు? ఇఁక శీఘ్రముగఁ బ్రాణముల విఘటింపఁ జేసి నన్ను మృతుఁడగు నార్యపుత్రునితోఁ జేర్పుము.

రాజు—(ధ్వనివచ్చు వైపునకుం జూచి)

గీ. కమలపరిశోభితయు ఘన • కలుషయుతయు
శఫరనేత్రియు నయి యాత్మ • సదృశరూప
మున వెలుంగు నొకానొక • ముదిత నిపుడు
తాల్చి యున్నది జహ్ను సు • తా స్రవంతి. 8

ఇఁక వితర్కించినఁ గార్యము దప్పును. ముందీమె ప్రాణములు విడువనున్నది. కావునఁ బట్టి నివారించెదను. (అని పట్టుకొనును.)

తప—[రోషముతో] ఎవఁడీది? నాహస్తము పట్టుకొని కళంక మొదవించుచున్నాఁడు.

రాజు—[నిరూపించి] ఆహా! ఇదేమి! దవిగానున్నదె! భగవతి! భాగిరధీ! యిది నాకు మహానుగ్రహము. మరణోద్యుక్తుండనై నేనిటకు వచ్చియుండఁ బ్రాణములు నిల్పి నన్ను రక్షించితివి. ప్రియా! శంకింపకుము. నీ వెవని వియోగము సహింపఁజాలక మరణమున కుపక్రమించితివో యాఘోరపాతకి సంవరణుఁడు వీఁడె.

తప—ఆహా ఆర్యపుత్రుఁడా! జయమార్యపుత్రా! (గాఢముగఁ గౌఁగిలించుకొని) నాథా! యిది స్వప్నవృత్తాంతము కాదుగదా.

రాజు—నాకు నదియు సందియము. కానిమ్ము గట్టున కేఁగి విచారింతము.

తప—(వడఁకుచు) ఆర్యపుత్రా! నాయంగములు వడఁకుచున్నవి. కావున గాఢముగఁ బట్టుకొని నడువుము.

రాజు—(అట్లే చేసి పరిక్రమించుచున్నాఁడు.)

(నేపథ్యమున)

సఖీ మేనకా! మహారాజుగారిని, నెచ్చెలినిఁబాసి నిముసమైన నే నీ శరీరము ధరింపఁజాలను. కావున నాకంఠమునఁ బాశమర్పింపుము.

(మఱల నేపథ్యమున)

సఖీ! రంభా! నేను నీ మరణముం గూడఁ జూచి యింకను దుఃఖింపఁజాలను. కావున నేనే ముందు మరణించెదను.

తప—కష్టా! సఖులంత మొందుచున్నారుగదా! ఆర్య పుత్రా! త్వరపడుము త్వరపడుము.

రాజు—(సంభ్రమముతో సమీపించి) పూజ్యులగు మీరు సాహస మొనర్పకుఁడు. మే మిదిగో జీవించియున్నారము.

{ నిష్క్రమించి రంభామేనకలతో మఱలఁ బ్రవేశించును. }

రాజు...ప్రియా! నీసఖులం జూచికొనుము. కుశలముగ నున్నారు.

తప—సఖులారా! నన్ను గాఢముగఁ గౌఁగిలింపుఁడు.

(కన్నీరు విడుచుచు నొకరి నొకరు కౌఁగిలింతురు.)

రాజు—ప్రేయసీ! భవత్పాదచిహ్నిత మగు నీమరకతశిలాతలమందొక ముహూర్తమాత్రము విశ్రమించిపోవుదము

తప—మనోహరా! యట్లే జేయుదము (అందరుఁ గూర్చుందురు.)

రాజు—ప్రియా! నీవు భాగీరథినిఁగాయము విడువ నుంకించుటకుఁగారణమెద్ది?

తప—ఆర్యపుత్రా! చిత్తగింపుఁడు. సఖి యగు మేనకారూపమున నేను దేవరవారిచెంత కేతెంచి యనురాగాంధకారమునఁ బ్రస్తుతము మఱచి భవత్పరిష్వంగ సుఖంబుఁ గోరి మీచేఁ దిరస్కరింపఁ బడితిని.

మేన—(లజ్జారోషములతో) నన్ను మిక్కిలి పరిభవించుచు, సఖీ! ప్రణయపాట్లు వెల్లడించితివి, బాగు.

రాజు—(తలయూఁచి) ఓహో! యిట్లు జరిగినదా! తరువాత,

తప—పిమ్మట నేను మరణమున కుపక్రమించి దైవవశమున నెట్లో సఖీరూపధారిణినై యుంటిఁ. దెలిసికొని పశ్చాత్తాపంబునఁ బొక్కుచుంటిని. అపుడు రంభ కన్నీరుమున్నీరై కారుచుండ నాకడకేతెంచి దేవరంగూర్చి యమంగళముఁ దెలిపెను. అందుచే నేను మరణమున కుపక్రమించితిని.

రంభ—(విషాదముతో) ఆరంభ యెవ్వతె ?

తపతి—నీవు గాదా ?

రంభ—కటా! నేనచ్చోటికి వచ్చియైన యుండలేదే! అట్టి ఘోరకృత్య మెట్లొనర్చియుందును ?

రాజు—అదెట్లు? నాకడ దేవికై నమంగళమారోపించినదియు నీవే కదా!

రంభ—(భయముతో వక్షమునఁ జే యిడుకొని) అయ్యో! యిఁక నెట్లు ?
(అని మేనకం జూచుచున్నది.)

మేన—మహారాజా! మీరుపొరపడితిరి. మే మిరువురమును నెచ్చెలిని వెదకుచు వచ్చుచుండ జాంబూనదిక యేడ్చుచు మాకెదురై నెచ్చెలి విపత్తును, దేవరవారి ప్రాయోపవేశమును గూర్చి మా కెఱింగించెను. పిమ్మట మేము మహాదుఃఖమున మరణమున కుపక్రమించుచుండ తమరరుదెంచి మమ్ము బ్రదికించితిరి.

తప—(సాధ్వసముగా) ఆహా! ఆర్యపుత్రుఁడును నిట్టి సాహస మొనర్చెనా? మఱల జాంబూనదిక రాకున్నదే. యేల ?

రాజు—

గీ. తపనవనమందుఁ దొలుత నే ♦ దానవి ననుఁ
గినుక వంచించె నట్టి మో ♦ హినికసల్పు
మాయయో యేమొ యిదియు న ♦ మ్మంగ రాదు
చకితసారంగశాబక ♦ చారునేత్ర !

తప—(స్మృతినభినయించి శోకముతో) ఇపుడు నేనార్యపుత్రుకడఁ జేరుటం జేసి గురునియోగ మతిక్రమించిన దాననైతిని. ఆర్యపుత్రా! నన్నిఁక విసర్జింపుము.

రాజు—ఆకాలమున నీ కిడుము పాటేమి? (అని విషణ్ణుఁడగును)

సఖులు—నెచ్చెలీ! విషాద మొందకుము. మేము భగవాను ననుజ్ఞ దెచ్చితిమి. ఇది మొదలు నీసహచరుని గూడి విహరింపవచ్చునని దేవుఁ డాజ్ఞనొసంగెను. మఱియు విప్రవాస శామకము లగు నీవసనంబులు మీకుఁ బుత్తెంచె. కావునఁ బరిగ్రహింపుఁడు.
(పరిగ్రహింతురు.)

తప—(ఆనందముతో) జనకానుగ్రహమునఁ బ్రదికితిని.

రాజు—(హర్షముతో) మీవచనామృతమున సుఖించితిమి.

మేనక—(స్మృతి నటించి భయముతో) సఖీ! జాంబూనదికారూపధారిణియై యారాక్షసి గురువులకుఁగూడ నెద్దియో కీడు రోయుచున్నది. కావున మనమేఁగి యథార్థ మెఱింగివత్తము రమ్ము.
(అని నిష్క్రమించుచున్నారు.)

నేపథ్యమున

ఓహో! తొలఁగుఁడు తొలఁగుఁడు. దావాగ్ని ప్రవిదీప్యమాన మగు నంజన శైల శిఖరము క్రిందఁ బడుచున్నది.

తప—(భయముతో) ఆర్యపుత్రా! రక్షింపుము రక్షింపుము (రాజును గౌఁగిలించికొనును.)

రాజు—భీరురాలా! భయ మొందకుము. ఇది నిశ్చయముగా పాకాశర్యుని భ్రమముగాని మఱొండు గాదు.

{ కర్ణపూరముం బట్టుకొని విదూషకుఁడు
భయముతోఁ బ్రవేశించుచున్నాఁడు }

విదూ—(మరల నదే చదువును.)

అంతట శరపంజరనిబద్ధ యగు
రాక్షసి ప్రవేశించుచున్నది.

రాక్ష—(రాజుం జూచి) రక్షింపుము రక్షింపుము. మహారాజా! (రాజు పాదములఁ బడును.)

విదూ—ముందీయగ్నిముఖమునుండి నన్ను రక్షింపుము. (అని రాజువెనుక డాఁగుచున్నాఁడు.)

తప—ఆర్యపుత్రా! నాయంగములు వడఁకుచున్నవి. ముందీరాక్షసిని వదలివేయుఁడు.

రాజు—ప్రియా! భీతిల్లకుము. నే నుండలేదా! (రాక్షసింజూచి) నీ వెవరు? నీదుఃఖమునకుఁ గారణ మేమి?

రాక్ష—(తనలో) ఈయన సత్యప్రియుఁడు. కావున నిజమునే వచించి తప్పించుకొందును గాక. (ప్రకాశముగా) చిత్తగింపుఁడు. మహారాజా! దేవరవారిచే నూర్గురు పుత్రులఁ గోల్పోయినదానను. మోహినికయను రాక్షసిని. నాఁడాయరణ్యమున నామాయలన్నియు ఋషిప్రభావంబున భగ్నము లగుటం జేసి యిచ్చట కరుదెంచి రంభాజాంబూనదికల వేషంబులతో మిమ్మును, మీకళత్రంబును, సఖీజనంబును మరణవ్యవసాయులం జేసి సూర్యలోకమున కేఁగుచుంటిని. అపుడు మార్గమధ్యంబున, వసిష్ఠునిఁ గూడి భవత్తనయుఁ డెదురయ్యె. అంత నాతని ధిన నుంకింప నాకుమారుఁ డాకాశయాననిరోధకరములగు బాణంబులచే నన్నీస్థితికిం దెచ్చెను. కావున మహారాజుగారు నన్ను మన్నింతురుగాక.

విదూ—మిత్రమా! యీరాక్షసి మన కేమపకార మొనర్చినది?

రాజు—(విదూషకుని చెవిలో) ఇట్లు

విదూ—ఆహా! పరమాద్భుతము. (రాక్షసిం జూచి) ఇంతయుపకార మొనర్చిన నిన్ను రక్షింపకుండు టెట్లు?

తప—అనపత్యనగు నాకు తనయుఁ డేడ? అయిన నార్యపుత్రుఁడు బహుభార్యాపరిగ్రాహుఁడు గదా!

రాజు—(నవ్వుచు) ఇదంతయు సరియ కాని నాకుఁ దనయుఁ డెవఁడు?

అంతట వసిష్ఠుఁడునుఁ జాపహస్తుఁ
డగుకుమారుఁడును బ్రవేశింతురు.

మ. సరసీజాక్షునిఁ బాలసంద్రమున స్ర ♦ ష్టన్ సత్యలోకంబునన్
గిరిజేశున్ రజతాద్రియందు మఘవున్ ♦ గీర్వాణలోకంబునం
ధరణిం బైనిఁ బ్రసన్నుఁ జేసి రవికిం ♦ దౌహిత్రుఁ డౌనితనిన్
గురులం జేర్పఁగఁ బౌరవీయ పురికిం ♦ దోతెంచితే నిప్పుడే.

కుమా...(కౌతుకముతో)

చ. ఇపుడుమదీయగాత్రముల ♦ కెట్టిసుఖంబులభింపనుండె నా
దుపితలపాదపద్మముల ♦ ధూళి కతమ్మునఁ జేసి, యట్టియీ
విపులసుఖంబుమున్ను తొలి వేల్పుదళమ్ములఁ గూల్చుటన్ సురల్
గృపను బ్రసూనవృష్టిఁ గురి ♦ యించిననాఁడును దోఁపకుండెడిన్

(ఇద్దఱును బరిక్రమింతురు)

విదూ—(స్మృతి నటించి) రాక్షసీసంభ్రమమున నే నింతదాఁక నీకర్ణపూరము మాట మఱచితిని.

రాజు—(నవ్వుచు) ఇది యనవసరమందుఁ గానవచ్చినది. ఓహో! ఔనిదియే ముఖ్యావసరము. ఏలయన (తపతిం జూచి)

కం. పరిరంభమాత్రఁ బులకల్
వఱపుచు లాలిత్యసార ♦ భమ్ముల నీతో
నరియగునీయవతంసము
తిరిగి భవచ్ఛ్రుతితలమునఁ ♦ దిర మగుఁ గాతన్.

రాక్షసి—మహారాజా! దీనురాలనగు నీరాక్షసిని వదలివేయుము.

రాజు—సరే కానిమ్ము. (అని యస్త్రబంధము విప్పును.)

రాక్ష—రాజా! చిరకాలము వర్ధిల్లుము. (అని నిష్క్రమించును.)

వసి—(క్రిందఁజూచి) వత్సా! వీరె నీతలిదండ్రులు. కావున నిచ్చటదిగుదము.

(దిగుచున్నారు)

రాజు—ఓహో! గురుజనులు విచ్చేసియున్నారు. (సమీపించి) భగవానుడా నమస్కరించుచున్నాఁడను.

తపతి—మహానుభావా? నమస్కరించుచున్నాను.

వసి—(ఇద్దఱిం జూచి)

మ. ఉపమాతీత రసానుభావములచే నుత్కృష్టమై సంధిచే
నిపుణంబైసుగుణోత్తమాంగచయ సందీప్తంబునైగ్రాలునీ
తపతీసంవరణంబుభూమిపయి నిస్తంద్రప్రభాధిక్యతన్
విపులానందముఁగూర్చుఁగాతఁబ్రజకుం బెక్కేండ్లకాలంబొగిన్

వత్సా! తల్లిదండ్రులకు వందనము సమర్పింపుము.

కుమారుఁడు—(సప్రణామముగా.)

గీ. తపతికిని సంవరణునకుఁ దనయుఁడైన
యీకురుండు వినయభర హృదయుఁడగుచుఁ
బితృజనమ్ములపాదార విందములకు
మూర్ధమునువంచి యిదియె తా మ్రొక్కునిపుడు.

రాజు—(సస్పృహంజూచి) వత్సా! నీవెవఁడవైనను సరే. చక్రవర్తివిగమ్ము.

తపతి—(హర్షముతో) వత్సా! నాప్రేమమాత్రము నిన్నెఱుంగును. కాని నే నెఱుంగను. దీర్ఘాయుష్మంతుఁడవుగమ్ము.

విదూ—నాకించుకయైని సందియము గలుగుటలేదు. మీప్రతిబింబ మద్దమున నుంచినట్లేయున్నది.

వసి—వితర్కమేటికి? యీతనిచరిత్రము వినుఁడు.

రాజు—(సాదరముగా) అట్లే సెలవిండు వినుచున్నాఁడను.

వసి—పూర్వము తపనవనమం దీమె గర్భము ధరించినపిదప నాత్మప్రభావముచే నీకుమారుంగనియె.

రాజు—తరువాత,

వసి—సురల కజేయులగు నసురుల నీతనిచే నిర్జింపఁజేయుటకును, దేవాహారంబులచే నీతనిశరీరతేజోబలంబుల వృద్ధిబొందించుటకును, రంభ మార్తాండశాసనమునఁ బుత్రవియోగము మీకెఱుకవడకుండునట్లు ప్రసవసమయముననే తపతికి స్మృతిఁ దప్పించి యితనిని సావిత్రీసకాశమునకుం గొనిపోయెను. అందువలఁన దపతికి పుత్రజననము స్వప్నమువలె దోఁచెను.

రాజు—తరువాత,

వసి—పిమ్మట కతిపయదినములకు సురేంద్రుఁడసురవిజయార్థమై బలిష్ఠకాయుఁడగునీతనిం బ్రార్థించెను. అపుడు మాతామహుండు మార్తాండుఁ డీతనిం గని "కురుసురకార్యం" అని యాదేశించె. అందుచే నితఁడు కురుఁడయ్యెను.

రాజు—తరువాత,

వసి—పిదప సురకార్యము నివర్తించి వచ్చి తనయొద్దనున్న యీతని నిపుడు లోకబాంధవుఁడు నాతోఁగూడ నిటకుంబుత్తెంచె.

రాజు—(బాష్పగద్గదముగా) వత్సా! యిటు రమ్ము. (మూర్ధమాఘ్రాణించి తొడపైఁ గూర్చుండఁ బెట్టుకొనుచున్నాఁడు)

తప—ఆర్యపుత్రా! యేమి నీకుక్షింభరిత్వము!

{ అనిరాజు తొడనుండి కుమారునిబలాత్కారముగ లాఁగికొని కౌఁగిలించి స్తన్య మిశ్రములగు నానందబాష్పములచే నాతనిం దడుపుచున్నది. }

రాజు—(విదూషకునిఁ జూపుచు) వత్సా! గురునికి నమస్కరింపుము.

విదూ—(హావఁణమున వడఁకుచేతులతోఁ గౌఁగిలించి) వత్సా! మంగళమగుఁగాక (ఆకాశమువంకఁజూచి) ఉత్పలికా! నీ వేల వచ్చితివి? ఏమనుచున్నావు? పుత్రసంగతుఁడగు మహారాజుగారిని సంభావించుటకుఁ దేవి

యగుసాల్వరాజపుత్రి నిన్నుఁ బంపిన దనియా? మంచిది నీవు పొమ్ము. ఈకుమారుఁడామెను నమస్కరింప వచ్చుచున్నాడు.

వసి.— నీకుఁ బ్రియకార్య మింకెద్దియైన నున్నచో వాక్రువ్వుము. దానినే నొడఁగూర్చెదను.

రాజు.—

చ. జలజహితాత్మజన్ జముని♦సన్నిధినుండి మరల్చి తెచ్చె, ము
త్కులకరుఁడైనపుత్రునొడఁ♦గూరిచె దైవమునాకుఁ బ్రేముడిం
గొలిపెమదీయరాజ్యమునఁ♦ గోరినవృష్టుల గోత్రకారియున్
వలసిన దెద్ది యింక? మిముఁ♦బ్రార్థన సేయ మునీంద్రసత్తమా!

అయిన నీమేలు గలుగుఁగాత.

చ. జగతిఁబర్జన్యరంబు స్థిర♦సౌహృదముల్ విలసిల్లు, సత్కవుల్
మిగులఁ బ్రసిద్ధిగాంత్రు, బుధ♦మిత్రులు ఘుమత్సరముం ద్యజింత్రు, తు
చ్ఛగృహపరత్వజాతకలు♦షమ్ములఁ జార్చుచు నిందిరేశు పైఁ
దగిలి మదీయభక్తి యుచి♦తక్రియవర్ధిలి పాక మొందుతన్.

(అందరు నిష్క్రమింతురు.)

షష్ఠాంకము-సంపూర్ణము.

తపతీసంవరణనాటకము

సంపూర్ణము.

బెజవాడ మారుతీరాం కంపెనీలో దొరకు

నాటకములు.

పాండవ అజ్ఞాతవాసం.	సుసర్లవారిది	రు 0—8—0
బొబ్బిలియుద్ధ నాటకం.	శ్రీపాదవారిది	1—0—0
కనకతార నాటకం.	చ॥ కే	1—4—0
లంకాదహనం.	ద్రో॥ సీ॥	0—8—0
జయంతజయపాల డిటో		0—8—0
సారంగధర నాటకం.	బళ్లారివారిది	1—6—0
చిత్రనళీయం	డిటో	1—6—0
ప్రహ్లాద నాటకం	డిటో	1—2—0
చంద్రహాస నాటకం	డిటో	1—2—0
ద్రౌపదీ మానసంరక్షణ	డిటో	1—2—0
పాదుకాపట్టాభిషేకం	డిటో	1—4—0
బృహన్నల నాటకం	డిటో	1—2—0
మోహినీ రుక్మాంగద	డిటో	1—2—0
ప్రమీలార్జునీయం	డిటో	1—2—0
వరూధిని	డిటో	1—2—0
చిరకారి నాటకం	డిటో	1—2—0
సావిత్రీ చిత్రాశ్వము	డిటో	1—2—0

యివిగాక అనేక ఆంధ్రగ్రంథములు, నవలలు, స్కూలుబుక్కులు కలవు.

వలయువారు:—

మారుతీరాం అండు కో.,
బుక్కుసెల్లర్సు,
బెజవాడ

మారుతీరాం అండు కో., బెజవాడ

నాటకములు.

రామరాజుచరిత్ర లేక ఫాల్ ఆఫ్ విజయనగర్. బళ్లారి కోలాచలం శ్రీనివాసరావు గారు		1
కుశలవ నాటకం	డిటో	1
ప్రహ్లాద నాటకం	డిటో	1
చాందు బీబీ	డిటో	1.
కుశలవ. విస్సాభొట్ల సుబ్రహ్మణ్యం గారిది		0--
సంపూర్ణ రామాయణం	రామనాటకమ్	1.
సంపూర్ణ భారతము	డ్రామా	1.
సంపూర్ణ ఉత్తర రామాయణం		1.
సంపూర్ణ కృష్ణ చరిత్ర		1--
సతీతులసి డ్రామా		1--
కాంతామతి డ్రామా		0--

యివి, యివి యిన వెలకి సంస్కృత గ్రంధములు, ఆంధ్రగ్రంథములు, హరికథలు, వైద్యగ్రంధములు, ధర్మశాస్త్రములు అన్ని స[illegible] పనికొచ్చు అన్ని రకముల యింగ్లీషు, తెలుగు పుస్తకములు, స్టేషనరి సామా[illegible] న్యాపులు, [illegible] [illegible] వస్తువులు కలవు. కలయువా[illegible] కోటలాగు పంపబడును.

కలయువారు:—

మారుతిరాం అండు కో.,

బుక్కుసెల్లర్సు,

బెజవాడ.

END OF TITLE